PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 42 సంచిక : 202 | విజయవాడ, గురువారం 23 ఫిబ్రవరి 2023 | 8 + 8 పేజీలు వెల : 5.50
Vol No | Vijayawada, Thursday 23 February 2023 | Rs



తెనాలిలో పోక్సో కోర్టు ప్రారంభం

లోపలి పేజీలో..

ఆరేళ్లు ఉంటేనే ఒకటో తరగతి ప్రవేశాలు

న్యూఢిల్లీ : ఒకటో తరగతిలో చేరడానికి కనీస వయసు ఆరేళ్లు ఉండాలని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ బుధవారం ఆదేశాలు జారీ చేసింది. నూతన విద్యా విధానం (ఎన్ఇపి) ప్రకారం మూడేళ్ల వయస్సు నుంచి ఎనిమిదేళ్ల వయస్సు వరకు పునాది దశ (ఫౌండేషన్ స్టేజ్)గా పరిగణిస్తారు. ఇందులోనే మూడేళ్ల పాటు పూర్వ పాఠశాల స్థాయి (ప్రీ స్కూల్) విద్య, ఆ తర్వాత ఒకటో తరగతి, తదనంతరం రెండో తరగతి అభ్యసించాలని కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. అంగన్‌వాడీలు లేదా ప్రభుత్వ, ప్రభుత్వ సహాయ (ఎయిడెడ్), ప్రయివేటు, స్వచ్ఛంధ సంస్థలు (ఎన్‌జిఒ) నిర్వహించి ప్రీ స్కూల్ కేంద్రాల్లో మూడేళ్ల పాటు నాణ్యమైన విద్య అందుబాటులో ఉంచగలిగినప్పుడే నిరంతర విద్య, శిశు అభివృద్ధి సాధ్యపడుతుందని పేర్కొన్నారు. అందువల్ల ఆరేళ్లు అంతకుమించి వయస్సున్నవారికే ఒకటో తరగతిలో ప్రవేశాలు కల్పించేలా చూడాలని రాష్ట్రాలకు, కేంద్ర పాలిత ప్రాంతాలకు కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీ చేసింది.



చిత్తూరులో

ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (పిడిఎఫ్) తరపున తూర్పు రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గ అభ్యర్థిగా మీగడ వెంకటేశ్వరరెడ్డి, ఉపాధ్యాయ నియోజకవర్గ అభ్యర్థిగా పి.బాబురెడ్డి బుధవారం చిత్తూరు కలెక్టరేట్‌లో నామినేషన్లు దాఖలు చేశారు. దీనికి ముందు భారీ ప్రదర్శన, ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజాసంఘాల ఆధ్వర్యాన విద్యా సదస్సు జరిగింది. పిడిఎఫ్ ఎమ్మెల్సీలు విటపు బాలసుబ్రమణ్యం, కె.ఎస్.లక్ష్మణరావు, యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్.ప్రసాద్, సిఐటియు రాష్ట్ర నాయకులు కందారపు మురళి, ఎఐటియుసి నాయకులు రామానాయుడు తదితరులు ప్రదర్శన ముందు భాగాన నడిచారు. ప్రదర్శనకు పెద్ద ఎత్తున జనం తరలివచ్చారు.

ఉత్సాహంగా పిడిఎఫ్ నామినేషన్లు

అనంతపురంలో



పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గ పిడిఎఫ్ అభ్యర్థిగా పోతుల నాగరాజు, ఉపాధ్యాయ నియోజకవర్గ అభ్యర్థిగా కత్తి నరసింహారెడ్డి బుధవారం అనంతపురం కలెక్టరేట్‌లో నామినేషన్లు దాఖలు చేశారు. దీనికి ముందు భారీ ప్రదర్శన, ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజాసంఘాలతో సమావేశం జరిగింది. పిడిఎఫ్ ఎమ్మెల్సీలు ఐ.వెంకటేశ్వరావు, షేక్ సాబ్జి, మాజీ ఎమ్మెల్సీలు డాక్టర్ గేయానంద్, జల్లి విల్సన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రదర్శన సందర్భంగా గుత్తి రోడ్డు ఎర్ర జెండాలతో ఎరుపెక్కింది. వేలాది మంది పాల్గొని మద్దతు తెలిపారు. ప్రశ్నించే గొంతుకలను చట్టసభలకు పంపుదామంటూ నినాదాలు చేశారు.

వలస విషాదం

బడుల్లో తగ్గుతున్న విద్యార్థుల హాజరు • బతుకుపోరులో పిల్లలు కూడా

- కర్నూలు జిల్లా కోసిగి జడ్‌పి బాలుర ఉన్నత పాఠశాలలో 1321 మంది చదువుకుంటున్నారు. వీరిలో ప్రస్తుతం 280 మంది మాత్రమే తరగతులకు హాజరవుతున్నారు.
- ఇక్కడే బాలికల మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలలో 463 మంది విద్యార్థులు ఉండగా, వీరిలో 183 మంది ప్రస్తుతం బడికి రావడం లేదు.
- ఇప్పుడు బడికి వస్తున్నవారు కూడా ఎప్పుడు మానివేస్తారో తెలియని స్థితి రెండు చోట్లా నెలకొంది. దీంతో వీరిని బడికి వచ్చేలా చూడటానికి ఉపాధ్యాయులు నానాతిప్పలు పడుతున్నారు.
- ఈ పరిస్థితి ఇక్కడే కాదు. జిల్లా వ్యాప్తంగా అనేక పాఠశాలల్లో నెలకొంది. బాగా చదువుతున్న పిల్లలు కూడా అకస్మాత్తుగా బడి మానేస్తున్న ఉదంతాలు వెలుగులోకి వస్తున్నాయి.



కొసిగిలో విద్యార్థులు లేక వెలవెలబోతున్న ఆర్లబండ జెడ్‌పి పాఠశాల

ప్రజాశక్తి- కర్నూలు ప్రతినిధి

బతకడానికి వలస వెళ్లడమే తప్ప మరో మార్గం లేని కర్నూలు జిల్లాలోని సామాన్యుల బతుకుచిత్రమిది! భవిష్యత్తుపై గంపెడు ఆశలతో పిల్లలను బడుల్లో చేర్చినప్పటికీ ఆ కలలను నెరవేర్చుకోలేని దుస్థితి వారిది! అర్థంతరంగా బడి మాన్పించడం కష్టమైనా, ఇష్టంలేకపోయినా ఆ పనిచేస్తున్నారు. బతుకుపోరులో తమతో పాటు తమ పిల్లలనూ భాగస్వాములను చేస్తున్నారు. ఫలితంగా పెద్ద సంఖ్యలో బడులు విద్యార్థులు లేక వెలవెల పోతున్నాయి. ఎక్కడికక్కడ ఉపాధ్యాయులు నచ్చచెప్పడానికి ప్రయత్నిస్తున్నా 'తప్పదు కదా సార్.. మళ్లొస్తాం.. వచ్చినప్పుడు పంపుతాంలే' అని సమాధానం వస్తోంది! వర్షాలు పడినా... వలసలు తప్పని స్థితి ఈ ఏడాది నెలకొంది. కరువు కోరల్లో చిక్కుకోవడం, పొట్టచేతపట్టుకుని బతకడానికి వెళ్లడం ఇక్కడ కొత్తేమి కాదు! కానీ కుండపోత వర్షాలు కురిసినా, కష్టాలు.. కన్నీళ్లు తప్పకపోవడంతో చిన్నరైతులు, వ్యవసాయ కూలీలు విలవిలలాడుతున్నారు. అధిక వర్షాలు, పత్తి పంటను గులాబీ పురుగు ఆశించడం వల్ల వ్యవసాయ పనులు లేకుండా పోయాయి. దీంతో, జిల్లాలోని ఆదోని డివిజన్ పరిధిలో వ్యవసాయ కూలీలు, కౌలు రైతులు, పేద రైతులు పెద్ద సంఖ్యలో వలసలు వెళ్లారు.

బడి మానింది ఎందరు?

వలసల కారణంగా జిల్లాలో బడిమానిన విద్యార్థుల సంఖ్య ఎంత? ఈ ప్రశ్నకు అధికార యంత్రాంగం వద్ద స్పష్టమైన సమాధానం లేదు. కొందరు పిల్లలు బడికి రావడం తగ్గిందని చెబుతున్నారు కానీ, దానికి కారణం మాత్రం చెప్పడం లేదు. ఎక్కడికక్కడ ఉపాధ్యాయులు ఈ విషయమై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నప్పటికీ ఫలితం కనిపించడం లేదు. కోసిగి, ఎమ్మిగనూరు, నందవరం, హోళగుంద, పెద్దకడబూరు మండలాల్లో పెద్ద సంఖ్యలో వలసలు వెళ్లారు. ఈ మండలాల నుండి సుమారుగా 15 వేల మంది ప్రజానీకం వలస వెళ్లినట్లు చెబుతున్నారు. బడి మానేసిన పిల్లల సంఖ్య కూడా ఇక్కడే ఎక్కువ ఉంది. కొంచెం ఎదిగిన పిల్లలకు కూడా వలసకు వెళ్లిన చోట ఏదో ఒక పని దొరుకుతుండటంతో, ఎంతో కొంత చేతికివస్తుందని ఎక్కువ మంది తల్లితండ్రులు పిల్లలను తమ వెంట తీసుకువెడుతున్నట్లు సమాచారం.

సీజనల్ హాస్టళ్లపై కొరవడిన ప్రచారం

సీజనల్ హాస్టళ్లపై ప్రచారం కొరవడింది. వలస వెళ్లే కుటుంబంలోని విద్యార్థుల కోసం కర్నూలు జిల్లాలో 71 సీజనల్ హాస్టళ్లను ప్రభుత్వం మంజూరు చేసింది. వీటిలో 66 ప్రారంభం అయ్యాయి. ప్రభుత్వం నుంచి బిల్లులు సక్రమంగా రావన్న అనుమానంతో నిర్వహణకు ఎవరూ ముందుకు రాకపోవడంతో ఐదు హాస్టళ్లు ఇంకా ప్రారంభం కాలేదు. సీజనల్ హాస్టళ్ల ఏర్పాటు విషయం పక్క కాలనీలోని వారికి తెలియడం లేదు.

తక్షణమే ఉపాధి పనులు చేపట్టాలి

వలసల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి. ఉపాధి పనులు 200 రోజులు కల్పించాలి. కేంద్రం ఉపాధి నిధులు తగ్గించి ద్రోహం చేసింది. తక్షణమే ఉపాధి పనులు చేపట్టాలి. విద్యార్థుల చదువుకు ఆటంకం కలుగకుండా చర్యలు తీసుకోవాలి.

– డి.గౌస్ దేశాయ్,
సిపిఎం కర్నూలు జిల్లా కార్యదర్శి

విద్యార్థులు ఇలా తగ్గారు...

పాఠశాల పేరు	విద్యార్థుల సంఖ్య	ప్రస్తుత హాజరు
కొసిగి (మం)		
చాకలిగేరి ఎంపిఎ	376	230
దుద్ది జడ్‌పి	405	215
దుద్ది ప్రాథమిక	109	72
ఎమ్మిగనూరు (మం)		
కడివెళ్ల మెయిన్ ఎంపిపి	305	235
కందనాతి ఎస్‌సి కాలనీ	92	52
కందనాతి మెయిన్	190	150
కౌతాళం (మం)		
మరలి	122	70
గోతులదొడ్డి	280	180

టికెట్ తగువే వివేకా హత్యకు కారణం!

- కౌంటర్ అఫిడవిట్‌లో సిబిఐ

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

కడప ఎంపి టికెట్ విషయంలో రాజకీయ వైరుధ్యం వల్లే వైఎస్ వివేకానందరెడ్డి హత్యకు అవినాష్ రెడ్డి, శివశంకర్‌రెడ్డి, భాస్కర్ రెడ్డి కుట్ర పన్నారని సిబిఐ నిర్ధారణకు వచ్చినట్లు తెలిసింది. ఈ విషయాన్ని వివేకా హత్య కేసులో నిందితుడు సునీల్ యాదవ్ బెయిల్ పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో దాఖలు చేసిన కౌంటర్‌లో సిబిఐ వెల్లడించినట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం మేరకు.. "కడప ఎంపి టికెట్ తనకుగానీ లేదా విజయమ్మ, షర్మిలలో ఒకరికి ఇవ్వాలని వివేకా పట్టుబట్టారు. అదే టికెట్ అవినాష్ కూడా ఆశించారు. ఈ నేపథ్యంలో వివేకా, అవినాష్ మధ్య వైరుధ్యం పెరిగింది. వివేకానందరెడ్డి రాజకీయ కదలికలు అవినాష్‌రెడ్డి, భాస్కర్ రెడ్డికి నచ్చలేదు. శివశంకర్‌రెడ్డితో కలిసి అవినాష్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి.. వివేకా హత్యకు కుట్ర పన్నినట్లు తెలుస్తోంది. సునీల్ యాదవ్ ఇతర నిందితులతో కలిసి పక్కా ప్లాన్ ప్రకారం వివేకాను హత్య చేశాడు. హత్య జరిగిన రోజు రాత్రి వైఎస్.అవినాష్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి ఇంటికి సునీల్ యాదవ్ వెళ్లినట్లు ఆధారాలు ఉన్నాయి. హత్య తర్వాత సాక్ష్యాలను మాయం చేసేందుకు కూడా నిందితులు ప్రయత్నించారు" అని సిబిఐ కౌంటర్ దాఖలు చేసినట్లు తెలిసింది.

మన్యం జిల్లాలో రోడ్డు ప్రమాదం

- ఆటోను ఢీకొట్టిన లారీ
- ఐదుగురు దుర్మరణం

ప్రజాశక్తి –కొమరాడ (పార్వతీపురం మన్యం)

పార్వతీపురం మన్యం జిల్లాలో బుధవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. కొమరాడ మండలంలోని చోళ్లపదం–కూనేరు ప్రధాన రహదారిపై ఆటోను లారీ ఢీకొనడంతో ఆటోలో ప్రయాణిస్తున్న ఐదుగురు దుర్మరణం చెందారు. ఆటో డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొమరాడ మండలం దేవకోన పంచాయతీ అంటివలసకు చెందిన లక్ష్మి కుమార్తెకు పెళ్లి సంబంధం కోసం ఒకే కుటుంబానికి చెందిన 13 మంది అదే మండలం చోళ్లపదం పంచాయతీ పరిధిలోని తుమ్మలవలసకు ఆటోలో వెళ్లారు. అనంతరం స్వగ్రామం తిరిగి వస్తుండగా చోళ్లపదం వద్ద శివాలయం సమీపంలో పార్వతీపురం నుంచి రాయగడ వైపు వెళ్తున్న లారీ ఎదురుగా వస్తున్న ఆటోను బలంగా ఢీకొంది. ఈ ఘటనలో ఆటో నుజ్జునుజ్జు అయ్యింది. ఆటోలోని ఊయక నర్సమ్మ (40), ఊయక లక్ష్మి (42), మెల్లిక శారద (35), మెల్లిక అమ్మడమ్మ (40) అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన ఊయక వెంకట్ (50), ఆటో డ్రైవర్ ఊయక వెంకటేష్‌కు ఆస్పత్రికి తరలించారు. వెంకట్ మార్గమధ్యలో మృతి చెందారు. ఆటో డ్రైవర్ వెంకటేష్ పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. స్థానిక ఎస్ఐ జగదీష్‌నాయుడు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతులంతా ఒకే కుటుంబానికి చెందిన వారు కావడంతో గ్రామంలో తీవ్ర విషాదం అలముకుంది. మృతుల కుటుంబాలను ఆదుకోవాలని సిపిఎం నాయకులు కె.సాంబమూర్తి, గిరిజన సంఘం నాయకులు రామారావు ప్రభుత్వాన్ని కోరారు.



ప్రమాదానికి గురైన ఆటో

రూ.10 వేల లోపు పెన్షన్ ఉంటే రేషన్ కార్డు

- రిటైర్డు ఉద్యోగులకు అవకాశమిచ్చిన ప్రభుత్వం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రిటైర్డు ఉద్యోగులు రూ.10 వేలలోపు పెన్షన్ పొందే వారు రేషన్ కార్డు తీసుకునేందుకు అర్హులని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు పౌరసరఫరాలశాఖ ఎక్స్ అఫిషియో కార్యదర్శి హెచ్ అరుణ్ కుమార్ బుధవారం సర్క్యులర్ జారీ చేశారు. రేషన్ కార్డు పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం విధించిన ఆరెంచల నిబంధనల్లో గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబ ఆదాయం రూ.10 వేలలోపు, పట్టణ ప్రాంతాల్లో రూ.12 వేలలోపు కలిగి ఉండాలి. ప్రస్తుతం సిఎఫ్ఎంఎస్ నుంచి వేతనాలు పొందుతున్న ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ఆదాయంతో సంబంధం లేకుండా రేషన్‌కార్డును పౌరసరఫరాలశాఖ తిరస్కరిస్తుంది. ఇప్పుడు పెన్షన్ రూ.10 వేలలోపు పొందుతున్న వారు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపింది. ఇప్పుడు రూ.10 వేలలోపు పెన్షన్ పొందే వారికి దరఖాస్తు చేసుకునేందుకు అనుమతివ్వడం వల్ల 19,780 మంది కొత్త రేషన్‌కార్డులు పొందేందుకు అర్హత సాధించారు.

జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు స్వాగతం

- 24న గవర్నరుగా బాధ్యతలు

ప్రజాశక్తి – అమరావతి బ్యూరో

నూతన గవర్నరుగా బాధ్యతలు చేపట్టనున్న జస్టిస్ ఎస్ అబ్దుల్ నజీర్ దంపతులకు బుధవారం రాత్రి గన్నవరం విమానాశ్రయంలో సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రులు, ఉన్నతాధికారులు స్వాగతం పలికారు. అనంతరం వారు విజయవాడలోని రాజ్‌భవన్‌కు చేరుకున్నారు. ఈ నెల 24న నజీర్ గవర్నరుగా బాధ్యతలు స్వీకరించనున్నారు. ఛత్తీస్‌గడ్ గవర్నరుగా బదిలీపై వెళ్తున్న గవర్నరు విశ్వభూషణ్ హరిచందన్ దంపతులకు గన్నవరం విమానాశ్రయంలో సిఎం బుధవారం ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి ఛైర్మన్ కె మోషేన్‌రాజు, గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్, ఎపి అగ్రిమిషన్ వైస్ ఛైర్మన్ ఎంవిఎస్ నాగిరెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి, డిజిపి కెవి రాజేంద్రనాథ్‌రెడ్డి, పలువురు ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



గన్నవరం విమానాశ్రయంలో జస్టిస్ నజీర్‌కు స్వాగతం పలుకుతున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి

వృత్తిలో ఊతమిచ్చేందుకే

- 'లా నేస్తం' విడుదలలో జగన్

లోపలి పేజీలో..

అదాని అప్పులపై సెబీ ఆరా

షేర్లకు వికీపీడియా సెగ • రూ.51 వేల కోట్ల నష్టాలు




ముంబయి : అదాని గ్రూపు అప్పులు, సెక్యూరిటీలపై సెక్యూరిటీస్ అండ్ స్టాక్ ఎక్స్ఛేంజీ బోర్డు ఆఫ్ ఇండియా (సెబీ) ఆరా తీస్తోంది. గౌతం అదానీ కంపెనీలు తీవ్ర ఎకౌంటెన్సీ లోపాలు, కృత్రిమంగా షేర్ల ధరల పెరుగుదలకు పాల్పడుతున్నాయని హిండెన్‌బర్గ్ ఇచ్చిన రిపోర్టు నేపథ్యంలో సెబీ తాజా పరిశీలనకు ఉపక్రమించిందని ఓ ఆంగ్ల పత్రిక కథనం వెలువరించింది. తీసుకున్న రుణాలు, జారీ చేసిన సెక్యూరిటీలపై రేటింగ్స్‌ను తెలియజేయాలని దేశీయ రేటింగ్ సంస్థలను సెబీ ఆదేశించిందని సమాచారం. ఈ పరిణామానికి తోడు ఇప్పటికే హిండెన్‌బర్గ్ రిపోర్ట్‌తో ప్రారంభమైన అదాని సంపద పతనం.. తాజాగా వికీపీడియా ఆరోపణలతో మరింత క్షీణించింది.

చెల్లింపు ఎడిటర్లను పెట్టుకుని అదాని గ్రూపు తనకు అనుకూలంగా వ్యాసాలు రాయించుకున్నారని వికీపీడియా ఆరోపణలు ఆ కంపెనీ షేర్లను మరింత ఒత్తిడికి గురి చేశాయి. ఈ పరిణామాలతో బుధవారం అదాని గ్రూపు కంపెనీల మార్కెట్ కాపిటలైజేషన్ రూ.51,000 కోట్లు ఆవిరయ్యింది. గౌతం అదాని కీలక కంపెనీ అయినా అదాని ఎంటర్‌ప్రైజెస్ షేర్ బిఎస్ఇలో ఏకంగా 10.43 శాతం లేదా రూ.163.55 పతనమై రూ.1,404.85కు పడిపోయింది. ఉదయం రూ.1,539 వద్ద ప్రారంభమైన ఈ సూచీ తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొని.. ఇంట్రాడేలో ఏకంగా రూ.1,381 కనిష్ట స్థాయికి జారింది. నెల రోజుల్లో అదాని స్టాక్స్ 60 శాతం మేర పతనం కావడంతో గౌతం అదాని సంపద రూ.12 లక్షల కోట్ల మేర హరించుకుపోయింది. అదాని గ్రూపు సంస్థలు పలు మ్యూచువల్ ఫండ్స్ సంస్థలకు ముందస్తు చెల్లింపులు చేయడానికి ముందుకు వచ్చాయన్న వార్తలు ఆ స్టాక్స్ ఎలాంటి మద్దతును ఇవ్వకపోవడం గమనార్హం. ఇకపై కొత్త ప్రాజెక్టులను చేపట్టబోమని అదాని గ్రూపు సిఎఫ్ఒ జుగేశిందర్ సింగ్ వెల్లడించారు. ముంద్రాలో ఏర్పాటు చేయాలనుకున్న భారీ ప్లాంట్ నిర్మాణ ప్రణాళికలను పునర్ సమీక్షించుకోనున్నామన్నారు. ఎలాంటి కొత్త రోడ్డు ప్రాజెక్టులకు బిడ్లు దాఖలు చేమని ఆ కంపెనీ తెలిపింది.

వైసిపి పాలనలో అరాచకం

- ప్రశ్నిస్తే దాడులు, కేసులు, పోలీస్ టార్చర్
- ప్రజలకు చంద్రబాబు బహిరంగ లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వ అరాచక, విధ్వంసకర పాలనలో ఆగడాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు విమర్శించారు. ముఖ్యమంత్రి జగన్ నియంత పోకడలు ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టుగా మారాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజావ్యతిరేక పాలనను ప్రశ్నిస్తే ప్రజలు, ప్రతిపక్షాలపై దాడులు, కేసులు, హింసాత్మక ఘటనలు, పోలీస్ టార్చర్ అన్నట్లుగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందుకు గన్నవరం విధ్వంసం ఒక తాజా ఉదాహరణ అని పేర్కొన్నారు. చంద్రబాబు బుధవారం ప్రజలకు బహిరంగ లేఖ రాశారు. గన్నవరంలోని టిడిపి కార్యాలయం, పార్టీ నేతల ఇళ్లు, కార్యకర్తలపై దాడులు చేసి ఆస్తులు ధ్వంసం చేశారని తెలిపారు. బాధితులనే పోలీస్ టార్చర్‌కు గురిచేసి నిందితులుగా మార్చి, జైలుకు పంపుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో దారుణ పరిస్థితులపై ప్రజలను చైతన్యవంతులను చేయడానికి తాను చేపట్టిన పర్యటనలకు అన్ని తరగతుల ప్రజల నుంచి విశేష స్పందన కనిపిస్తోందన్నారు. ఆంక్షలు, నిర్బంధాలు ఉన్నా అద్భుతంగా జరిగిన అనపర్తి సభతో జగన్ ఉలిక్కిపడి గన్నవరం విధ్వంసానికి పాల్పడ్డారని, స్థానిక ఎమ్మెల్యే దీనికి వ్యూహరచన చేశారని విమర్శించారు. కొంతమంది పోలీసు అధికారుల సహకారంతో వైసిపి గూండాలు ప్రణాళికా బద్ధంగా టిడిపి నేతలపై దాడులు, పార్టీ కార్యాలయంలో విధ్వంసం సృష్టించారని పేర్కొన్నారు. దీనిపై జిల్లా ఎస్‌పి ఫోన్ చేసినా స్పందించలేదని విమర్శించారు. నియంతృత్వ ధోరణులకు నిలువెత్తు నిదర్శనం సిఎం జగన్ అని, అంబేద్కర్ రాజ్యాంగాన్ని పక్కనపెట్టి, తన సొంత రాజ్యాంగాన్ని అమలు పరుస్తున్నారని అన్నారు. ప్రేరేపిత ఉగ్రవాద విధానాన్ని విస్తృత పరచడం ద్వారా వచ్చే ఎన్నికల్లో ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయాలనేది కుట్ర అని పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ధర్మానికి, అధర్మానికి, ప్రజాస్వామ్యానికి, నియంత పోకడలకు మధ్య యుద్ధం జరుగుతోందని తెలిపారు. సమిష్టి తిరుగుబాటుతో ప్రభుత్వ ఉగ్రవాదాన్ని ఎదుర్కొందామని కోరారు.

ఎన్నికల విధుల నుండి తహశీల్దార్ తొలగింపు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

ఎమ్మెల్సీ ఎన్నికల విధుల నుండి చిత్తూరు తహశీల్దార్ పార్వతిని తొలగిస్తూ ఎన్నికల రిటర్నింగ్ అధికారి హరినారాయణ తొలగించారు. ఎమ్మెల్సీ ఓటర్ల జాబితాలో తన ఓటును ఉద్దేశపూర్వకంగా చిత్తూరు తహశీల్దార్ తొలగించారంటూ చిత్తూరుకు చెందిన రంగారావు ఎన్నికల కమిషనుకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపిన ఎన్నికల రిటర్నింగ్ అధికారి చిత్తూరు తహశీల్దార్ పార్వతిని ఎన్నికల విధుల నుండి తొలగిస్తూ, మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఇ-క్రాప్ తప్పుల తడక

- ర్యాండమ్ తనిఖీల్లో భారీగా లోపాలు గుర్తింపు
- సరి చేయకపోతే రైతులకు నష్టం

లోపలి పేజీలో..

ఇ-క్రాప్ తప్పుల తడక

- ర్యాండమ్ తనిఖీల్లో భారీగా లోపాలు గుర్తింపు
- సరి చేయకపోతే రైతులకు నష్టం



ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి


ఇ-క్రాప్ నమోదులు తప్పుల తడకలుగా తయారవుతున్నాయి. రైతులకు అందించే అన్ని పథకాలు, సహాయాలు, చివరికి పంటల అమ్మకానికి సైతం ప్రభుత్వం ఇ-క్రాప్‌ను తప్పనిసరి చేయగా సాగుల నమోదులో తప్పులు దొర్లడం వలన రైతులు అవస్థలపాలవుతున్నారు. ఇ-క్రాప్ నమోదుల్లో లోపాల కారణంగా నష్టపోతున్నామని అన్నదాతలు ఆవేదన చెందుతుండగా, పక్కాగా నమోదులు చేస్తున్నామని ప్రభుత్వం చెబుతోంది. కాగా వివిధ స్థాయిల్లోని పర్యవేక్షణాధికారులు ర్యాండమ్‌గా (మచ్చుకు/లాటరీ) తమకు నిర్దేశించిన పరిమాణంలో చేసిన తనిఖీల్లో పెద్ద ఎత్తున లోపాలు చోటు చేసుకున్నాయి. నిర్దేశిత స్వల్ప నిష్పత్తిలో అధికారులు చేసిన తనిఖీల్లో అన్నేసి తప్పులు కనిపిస్తుంటే, మొత్తం సాగు నమోదులను తనిఖీ చేస్తే ఇంకెన్ని తప్పులు బయట పడతాయోనన్న ఆందోళన నెలకొంది. లోపాలపై రైతుల ఆక్రందన నిజమేనని సూపర్‌వైజరీ అధికారుల ర్యాండమ్ చెక్ రిపోర్ట్ తేటతెల్లం చేసింది. సదరు నివేదికపై బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన వ్యవసాయ కమిషనర్ అధికారులపై సీరియస్ అయ్యారు. తప్పులు చేసిన వారిపై చర్యలు తీసుకొని రిపోర్టు పంపాలని ఆదేశించారు.

బాధ్యులెవరు?

రైతులు వారి పొలాల్లో ఏ పంట వేశారో ఆన్‌లైన్‌లో రైతుల సమక్షంలో రికార్డు చేసే ప్రక్రియ ఇ-క్రాప్. రెవెన్యూ, వ్యవసాయ, హార్టికల్చర్, సెరికల్చర్ డిపార్టుమెంట్లు ప్రతి ఏటా ఖరీఫ్, రబీలో ఇ-క్రాప్ నమోదు చేస్తున్నాయి. రెవెన్యూ సిబ్బంది సహకారంతో గ్రామాల్లో రైతు భరోసా కేంద్రం (ఆర్‌బికె) సిబ్బంది చేలు తిరిగి సాగులు నమోదు చేయాలి. ఈ ప్రక్రియలో లోపాలు జరక్కుండా, పారదర్శకంగా ఉండేందుకు ఆర్‌బికెలలో జాబితాలు ప్రదర్శించాలి. గ్రామసభలు నిర్వహించి అభ్యంతరాలను సేకరించాలి. దాంతోపాటు ఆర్‌బికె సిబ్బంది చేసే నమోదులను రెవెన్యూ, అగ్రికల్చర్, హార్టికల్చర్, సెరికల్చర్ డిపార్టుమెంట్‌లకు చెందిన వివిధ స్థాయి అధికారులు సూపర్‌వైజరీ చెకింగ్ చేయాలి. ఆయా శాఖల మండల, డివిజన్, జిల్లా అధికారులతో పాటు జాయింట్ కలెక్టర్, కలెక్టర్ సైతం తనిఖీలు చేయాలి. కమిషనర్లు సైతం తనిఖీ చేయాలి.

అన్నేసి లోపాలు

ప్రస్తుతం రబీ పంటల ఇ-క్రాప్ జరుగుతోంది. ఈ నెలాఖరుతో ముగించనున్నారు. సూపర్‌వైజరీ అధికారుల ర్యాండమ్ తనిఖీల్లో ఎంతగా తప్పులు కనుగొంటున్నారో తాజా నివేదిక తెలుపుతోంది. శ్రీకాకుళం జిల్లాలో ఎక్కువ తప్పులు గుర్తించారు. మొత్తం 4,213 తప్పులు కనుగొన్నారు. డిఎఒ స్థాయిలో 3 శాతం సాగులను తనిఖీ చేయాలని నిర్దేశించగా ఆ స్వల్ప పరిమాణంలో 80 తప్పులు దొర్లాయి. జెసి 2 శాతం తనిఖీ చేయాల్సి ఉండగా 23 లోపాలు గుర్తించారు. కలెక్టర్ 1 శాతం తనిఖీ చేయాల్సి ఉండగా వాటిలోనే 39 తప్పులు, కమిషనర్ చేసిన తనిఖీలో 39 తప్పులు దొరికాయి. మొత్తంగా రాష్ట్రంలో 16,136 తప్పులు గుర్తించారు. డిఎఒల తనిఖీల్లో 398, జెసిల చెకింగ్‌లో 287, కలెక్టర్ల తనిఖీలో 172, హెచ్ఒడి తనిఖీలో 177 తప్పులు గుర్తించారు. క్షేత్ర స్థాయి అధికారులైన ఎంఎఒ, ఆర్ఐ, తహశీల్దార్, ఎ.డి, ఆర్‌డిఒల తనిఖీల్లో వందలు, వేల తప్పులు దొర్లాయి. ఇ-క్రాప్ బుకింగ్ లోపభూయిష్టంగా ఉందనడానికి ఈ తప్పులే ఉదాహరణ. అందుకే రైతులు పంటల బీమా, పావలావడ్డీ, ఇన్‌పుట్ సబ్సిడీ కోల్పోతున్నారు. చివరికి తాము పండించిన పంటలను సైతం అమ్ముకోలేకపోతున్నారు.



వృత్తిలో ఊతమిచ్చేందుకే

- వైఎస్ఆర్ లా నేస్తం విడుదలలో సిఎం జగన్
- ఇక నుంచి ఏడాదికి రెండుసార్లు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కొత్త న్యాయవాదులకు వృత్తిలో ఊతం ఇచ్చేందుకు వైఎస్ఆర్ లా నేస్తం కింద నగదు జమచేస్తున్నామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 2011 మంది అర్హులైన జూనియర్ న్యాయవాదుల ఖాతాల్లో సుమారు రూ.కోటి 55 వేలను తాడేపల్లిలోని సిఎం క్యాంపు కార్యాలయం నుంచి బుధవారం బటన్ నొక్కి ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ.. మూడేళ్లుగా 4,248 మంది న్యాయవాదులకు రూ.35 కోట్లు అందించామని పేర్కొన్నారు. 2011 మంది అర్హులైన వారు ఈ పథకంలో కొనసాగుతున్నారని వివరించారు. ప్రభుత్వం ఇచ్చే నిధులు అంతో ఇంతో అదుకుంటే వృత్తిలో రాణించి మెరుగైన న్యాయవాదులుగా తయారవుతారని పేర్కొన్నారు. ప్రభుత్వం తోడుగా ఉందన్న భావన వారిలో కలిగేందుకు ఇక నుంచి ఏడాదికి రెండుసార్లు జమచేస్తామని చెప్పారు. ఒకేసారి పెద్దమొత్తంలో వస్తే వారి అవసరాలకూ ఉపయోగపడుతుందనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నామని వివరించారు. అలాగే రూ.100 కోట్లతో న్యాయవాదుల కోసం కార్పస్‌ఫండ్ ఏర్పాటు చేశామని వివరించారు. దీని ద్వారా కోవిడ్ సమయంలో రూ.25 కోట్ల వరకూ సాయం అందించామని చెప్పారు. ఎజి ఆధ్వర్యంలో లా, ఫైనాన్స్ సెక్రటరీలు సభ్యులుగా ఉంటూ అడ్వకేట్ వెల్ఫేర్ ట్రస్టీని నిర్వహిస్తున్నారని వివరించారు. సాయం పొందుతున్న వారందరూ గుర్తుంచుకుని పేదవాడిపట్ల అంకితభావాన్ని చూపాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో లా సెక్రటరీ సత్య ప్రభాకరరావు, బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలకు ఫైబర్ నెట్

- విశాఖ, విజయవాడ, తిరుపతిలో సర్వీస్ సెంటర్లు
- ఎపిఎస్ఎఫ్ఎల్ ఛైర్మన్ గౌతమ్‌రెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా నిర్మిస్తున్న జగనన్న కాలనీలు, టిడ్కో గృహాల్లో కూడా ఎపి ఫైబర్ నెట్ వాడేలా కీలక నిర్ణయం తీసుకున్నామని, ఎపిఎస్ఎఫ్ఎల్ ఛైర్మన్ పి గౌతమ్‌రెడ్డి తెలిపారు. ఆయా కాలనీల్లో ఫైబర్ నెట్‌ను తొలగించి బయట నెట్‌వర్క్‌లను వినియోగిస్తే ఎపిఎస్ఎఫ్ఎల్ ఆధ్వర్యంలో చర్యలు ఉంటాయన్నారు. ఐదేళ్లు దాటిన సెటప్ బాక్సుల రిపేర్ల కోసం విశాఖ, విజయవాడ, తిరుపతి ప్రాంతాల్లో సర్వీస్ సెంటర్లు ఏర్పాటు చేయబోతున్నామన్నారు. విజయవాడలోని ఎపిఎస్ఎఫ్ఎల్ ఫైబర్‌నెట్ కార్యాలయంలో బుధవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. బోర్డు మీటింగ్ తీర్మానాలు, నిర్ణయాలు, భవిష్యత్తు కార్యాచరణను ఛైర్మన్ వివరించారు. ఎపి ఫైబర్ నెట్ 15 లక్షల కనెక్షన్ల నెట్ వర్క్ అని, ప్రస్తుతం 6 లక్షల కనెక్షన్లకు పైగా సేవలు అందిస్తోందని పేర్కొన్నారు. సిఎం జగన్ ఆలోచనలకు అనుగుణంగా 55 వేల కిలోమీటర్ల వరకు ఎపి ఫైబర్‌నెట్ విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు, ప్రస్తుతం 33 వేల కిలోమీటర్లలో పనులు జరుగుతున్నాయన్నారు. ఇప్పటికే 27 వేల కిలోమీటర్లలో ఎపి ఫైబర్‌నెట్ ట్రెండింగ్‌లో ఉందన్నారు. ఫైబర్‌నెట్ బాక్సుల సర్వీస్‌కు, కొత్త బాక్సుల ఆర్డర్లకు ఇకపై టెండర్ల విధానం అవలంభించాలని, రాష్ట్రంలో సొంతంగా ఫైబర్‌నెట్ బాక్సుల మ్యానుఫ్యాక్చరింగ్ చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు ఛైర్మన్ వెల్లడించారు.

ఇందులో భాగంగా ఎవరైనా ఔత్సాహికులు ఉంటే ముందుకు రావచ్చన్నారు. త్వరలో హాట్‌స్టార్, ఆహా తరహాలో ఎపిఎస్ఎఫ్ఎల్ ద్వారా సొంతంగా యాప్ లాంచ్ చేయబోతున్నట్లు గౌతమ్‌రెడ్డి తెలిపారు. ఎపి ఫైబర్ నెట్ బేసిక్ ప్లాన్ ధరలు పెంచే ప్రసక్తే లేదన్నారు. బిబిఎన్ఎల్ ప్రాజెక్టులో భాగంగా రాష్ట్రానికి రూ.500 కోట్లు వచ్చాయని, మరో రూ.500 కోట్లు రావాల్సి ఉందన్నారు. రాష్ట్రంలో కొత్తగా 50 లక్షల వరకు బాక్సులు అవసరమని, ప్రస్తుతానికి 20 లక్షల బాక్సులకు టెండర్లు కోరనున్నట్లు గౌతమ్‌రెడ్డి తెలిపారు.

ప్రశ్నించే గొంతుకలను గెలిపించాలి

- ఉత్సాహపూరితంగా పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థుల నామినేషన్

ప్రజాశక్తి- అనంతపురం, చిత్తూరు ప్రతినిధులు

ప్రశ్నించే గొంతులకు గెలిపించాల్సిన అవసరం ఉందని ప్రోగ్రసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (పిడిఎఫ్) ఎమ్మెల్సీలు పిలుపునిచ్చారు. పిడిఎఫ్ తరుపున పోటీ చేస్తున్నది పదవుల కోసం, హోదా కోసం కాదని అన్నారు. ప్రజాసమస్యలపై చట్టసభల్లో పాలకులను నిలదీసేందుకే పోటీ చేస్తున్నారని తెలిపారు. పిడిఎఫ్ తరుపున తూర్పు రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గ అభ్యర్థిగా మీగడ వెంకటేశ్వరరెడ్డి, ఉపాధ్యాయ నియోజకవర్గ అభ్యర్థిగా పి.బాబురెడ్డి చిత్తూరు కలెక్టరేట్‌లోనూ, పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గ అభ్యర్థిగా పోతుల నాగరాజు, ఉపాధ్యాయ నియోజకవర్గ అభ్యర్థిగా కత్తి నరసింహారెడ్డి అనంతపురం కలెక్టరేట్‌లోనూ బుధవారం నామినేషన్లు దాఖలు చేశారు. ఈ సందర్భంగా పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులు మాట్లాడుతూ తమను గెలిపిస్తే ప్రశ్నించే గొంతుకవుతామని తెలిపారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పట్టభద్రుల సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. అనంతపురంలోని గుత్తిరోడ్డులోని చలమారెడ్డి ఫంక్షన్ హాలులో జరిగిన ప్రజా సంఘాల సమావేశంలో పిడిఎఫ్ ఎమ్మెల్సీలు ఐ.వెంకటేశ్వరరావు, షేక్ సాబ్జి మాట్లాడుతూ మాట తప్పను, మడమ తిప్పనని చెప్పి అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలు అమలు చేయలేదని విమర్శించారు. సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్ అమలు చేస్తామని ఇచ్చిన హామీని పట్టించుకోవడం లేదన్నారు. ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు ఇచ్చిన హామీలు అటకెక్కాయని తెలిపారు. పైగా, వైసిపి ప్రభుత్వం సమస్యలపై ప్రశ్నించే వారి గొంతు నొక్కుతోందని, అక్రమ కేసులు బనాయిస్తోందని అన్నారు. వీటిపై పిడిఎఫ్ ఎమ్మెల్సీలమంతా శాసన మండలిలో గట్టిగా నిలదీస్తున్నామని, బయట కూడా పోరాటాలు నిర్వహిస్తున్నామని గుర్తు చేశారు. శాసన మండలిలో పిడిఎఫ్ ఎమ్మెల్సీల బలం పెరిగితే మరింతగా పోరాడే, ప్రభుత్వ మెడలు వంచే శక్తి వస్తుందన్నారు. ఈ సభకు మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ అధ్యక్షత వహించారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థుల నామినేషన్ సందర్భంగా చిత్తూరులోని నాగయ్య కళాక్షేత్రంలో జరిగిన విద్యా సదస్సులో పిడిఎఫ్ ఫ్లోర్ లీడర్ విఠపు బాలసుబ్రమణ్యం, ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ వైసిపి ఏ ముఖం పెట్టుకుని ఉపాధ్యాయులను, ఉద్యోగులను ఓట్లు అడుగుతుందని ప్రశ్నించారు. నాలుగేళ్లుగా పిఆర్‌సి ఇవ్వలేదని, డిఎలు ఇవ్వలేదని, కనీసం జీతాలు కూడా ఒకటో తేదీ వచ్చే పరిస్థితి లేకుండా పోయిందని తెలిపారు. ఉపాధ్యాయులను భర్తీ చేయకపోగా, నూతన విద్యా విధానం పేరుతో పాఠశాలల సంఖ్యను కుదించిందన్నారు. ఉపాధ్యాయ పోస్టులకు ఎసరు పెడుతోందని విమర్శించారు. యుటిఎఫ్, ఎస్‌టియు, సిఐటియు, ఎపి రైతు సంఘం, ఐద్వా, డివైఎఫ్ఐ, ఎఐవైఎఫ్, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ తదితర ప్రజా సంఘాల నాయకులందరూ పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

బిజెపి కక్ష సాధింపు చర్యలు

- రానున్న ఎన్నికల్లో 175 స్థానాల్లో పోటీ
- బిఆర్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు తోట చంద్రశేఖర్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి/తాడేపల్లి

ప్రశ్నించే పార్టీలను ఐటి, ఇడి, సిబిఐ వ్యవస్థలతో కేంద్ర ప్రభుత్వం ప్రతిపక్షాలను వివిధ రూపాల్లో దెబ్బతీస్తోందని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు తోట చంద్రశేఖర్ విమర్శించారు. బిఆర్ఎస్ రాష్ట్ర అధ్యక్షులుగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన బుధవారం తొలిసారిగా గుంటూరుకు వచ్చారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో 175 ఎమ్మెల్యే, 25 ఎంపి స్థానాల్లో బిఆర్ఎస్ పోటీ చేస్తోందని తెలిపారు. అధికారంలోకి వచ్చిన మూడేళ్లలో రాజధానిని నిర్మిస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో పెట్టుబడులు, ఐటి పరిశ్రమలు రావడంలేదని తెలిపారు. తెలంగాణ వృద్ధి చెందుతున్నా ఎపి తిరోగమనంలో పయనిస్తోందని విమర్శించారు. రాజధాని నిర్మించుకోవడంలో విఫలమయ్యాయని తెలిపారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలన్న విజన్ ఉన్న నేతలు లేకపోవడం మన దౌర్భాగ్యమని అన్నారు. జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్‌కు తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు రూ.వెయ్యి కోట్లు ఆఫర్ చేశారని కొన్ని రాజకీయ పార్టీలు ప్రచారం చేస్తున్నాయని, ఇలాంటి దిగజారుడు ప్రచారాలు చేయడం సరికాదన్నారు. ఈ సందర్భంగా మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షులు జి.చిట్టి బాబు, బిజెపి ఎస్‌సి మోర్చా నగర అధ్యక్షులు ప్రకాష్, విశాఖ తూర్పు కాపు నాయకులు శ్రీనివాస్, మంగళగిరి నియోజకవర్గ ఎస్‌సి నాయకులు ఎన్.శ్రీకాంత్, దీప, కనకవల్లి.. తోట చంద్రశేఖర్ సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరారు.

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించండి

- అగ్రికల్చర్ కో-ఆపరేటివ్ సొసైటీస్ ఎంప్లాయిస్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మార్చిలో జరగనున్న శాసనమండలి ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని ఎపి స్టేట్ అగ్రికల్చర్ కో-ఆపరేటివ్ సొసైటీస్ ఎంప్లాయిస్ యూనియన్ కోరింది. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పివి సత్యనారాయణరాజు, పి సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉత్తరాంధ్ర, తూర్పు రాయలసీమ, పశ్చిమ రాయలసీమ పట్టభద్ర నియోజకవర్గాల నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థులు కె రమాప్రభ, మీగడ వెంకటేశ్వరరెడ్డి, పి నాగరాజును, తూర్పు, పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ నియోజకవర్గాల నుంచి పోటీ చేస్తున్న పి బాబురెడ్డి, కత్తి నరసింహారెడ్డికి పిఎసిఎస్ ఉద్యోగులంతా ఓటువేసి గెలిపించాలని కోరారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీలు 2005 నుంచి పిఎసిఎస్ ఉద్యోగుల ఉద్యమాలకు అండగా నిలిచారని, సమస్యలను ప్రభుత్వం వద్దకు తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేశారని వివరించారు. జిఒ 94 నిలిపివేయించడంలో ముఖ్యపాత్ర పోషించారని తెలిపారు. సహకార సంఘాలను విలీనం చేసినప్పుడు ఉద్యోగులను తొలగించకుండా అడ్డుపడ్డారని పేర్కొన్నారు. జిఒ 151 సాధించి, అమలు చేయించడంలో దగ్గరుండి కృషి చేశారని వివరించారు. వారి అండదండల వల్లే డిసిసిబిలలో 25 శాతం ప్రమోషన్లు, 151 అమలు మినిట్స్ రూపంలోకి వచ్చాయని తెలిపారు.

2019లో జిఒ 36 సాధన కోసం కృషి చేశారన్నారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం సహకార సంఘాల వాటాలను 50 శాతం ప్రైవేట్ వ్యక్తులకు, సంస్థలకు ఇచ్చే విధంగా అసెంబ్లీలో బిల్లు పాస్ చేసిందని తెలిపారు. మరో పక్క కేంద్ర ప్రభుత్వం సహకార సంఘాలను తన ఆధీనంలోకి తెచ్చుకునేందుకు అనునిత్యం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వం వ్యాపారం చెయ్యకూడదని, కేంద్ర బిజెపి ప్రభుత్వ వైఖరిగా, ప్రభుత్వ రంగాన్ని మొత్తం ప్రైవేటీకరిస్తోందని తెలిపారు. ఇటువంటి సమయంలో సహకార రంగాన్ని కాపాడుకునేందుకు, పిఎసిఎస్ ఉద్యోగుల ప్రయోజనాలను కాపాడుకునేందుకు ఉద్యోగులు చేసే కృషిలో పిడిఎఫ్ ఎమ్మెల్సీల సహకారం అవసరమని తెలిపారు.

స్థానిక సంస్థల ఎన్నికకు ఏడు నామినేషన్లు

ప్రజాశక్తి - యంత్రాంగం

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి బుధవారం ఏడు నామినేషన్లు దాఖలయ్యాయి. శ్రీకాకుళం నుంచి వైసిపి అభ్యర్థి నర్తు రామారావు, కడప నుంచి వైసిపి అభ్యర్థిగా మాజీ మంత్రి పి.రామసుబ్బారెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానాలకు వైసిపి తరపున కవురు శ్రీనివాస్, తణుకుకు చెందిన వంకా రవీంద్రనాథ్, వంకా రాజకుమారి, టిడిపి తరపున వీరవాసరానికి చెందిన వీరవల్లి చంద్రశేఖర్ నామినేషన్ వేశారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్థానిక సంస్థల స్థానాలకు ఇప్పటి వరకు మొత్తం ఐదు నామినేషన్లు దాఖలయ్యాయి. నెల్లూరు నుంచి వైసిపి అభ్యర్థి మురళీధర్ నామినేషన్ వేశారు.

సజ్జలకు ఏంటి ఇబ్బంది : మాజీమంత్రి దేవినేని

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

చంద్రబాబు ప్రజలకు లేఖ రాస్తే సజ్జల రామకృష్ణారెడ్డికి ఇబ్బంది ఏంటని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ప్రశ్నించారు. లేఖపై సమాధానం చెప్పాల్సింది ముఖ్యమంత్రి, హోంమంత్రి అని పేర్కొన్నారు. టిడిపి కార్యాలయం ఎన్‌టిఆర్ భవన్‌లో మాజీమంత్రి కొల్లు రవీంద్రతో కలిసి బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గన్నవరం ఘటనలో ఎంతమంది వైసిపి వారిని పోలీసులు అరెస్టు చేశారో చెప్పాలని సజ్జలను ప్రశ్నించారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

ఎస్‌కెయులో మృత్యుంజయ హోమాన్ని ఆపండి

- ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

మూఢ నమ్మకాలను ప్రేరేపించేలా అనంతపురం శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీలో నిర్వహించ తలపెట్టిన మృత్యుంజయ హోమాన్ని వెంటనే ఆపాలని ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. నగరంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. హోమానికి డబ్బులు వసూలు చేసేలా రిజిస్ట్రార్ సర్క్యులర్ విడుదల చేయడం శోచనీయమన్నారు. యూనివర్సిటీల్లో మతపరమైన యాగాలను నిర్వహించడం లౌకిక స్ఫూర్తికి విరుద్ధమని తెలిపారు. మృత్యుంజయ హోమాన్ని వెంటనే ఆపాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీలు అందరూ డిమాండ్ చేస్తున్నట్లు చెప్పారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించి హోమాన్ని నిలిపివేసేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతురు పరమేష్, డివైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహారెడ్డి, విజయ్ పాల్గొన్నారు.

పవన్ రూ.కోటి విరాళం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు, ప్రమాదబీమా చేయించేందుకు ఆ పార్టీ అధ్యక్షులు పవన్ కల్యాణ్ రూ.కోటి విరాళం ప్రకటించారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్, పార్టీ కోశాధికారి ఎవి రత్నంకు రూ.కోటి చెక్కును పవన్ కల్యాణ్ అందజేశారు.

ఉద్రిక్తతల మధ్య బాలకోటిరెడ్డి అంతిమయాత్ర

- స్వగ్రామంలో అంత్యక్రియలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రత్యర్థుల కాల్పుల్లో మృతి చెందిన పల్నాడు జిల్లా రొంపిచర్ల మాజీ ఎంపిపి వెన్నా బాలకోటిరెడ్డి అంత్యక్రిలు ఉద్రిక్తల మధ్య బుధవారం పూర్తయ్యాయి. ఆయన స్వగ్రామమైన అలవాలలో కుటుంబ సభ్యులు అంత్యక్రియలు పూర్తి చేశారు. బాలకోటిరెడ్డి భౌతికాయాన్ని గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రి నుంచి నరసరావుపేటకు తీసుకొస్తుండగా మార్గమధ్యలో పోలీసులు అడ్డుకున్నారు. నర్సరావుపేట తీసుకురాకుండా స్వగ్రామానికి వెళ్లాలని సూచించారు. దీంతో టిడిపి నాయకులు కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. పోలీసులు సర్దిచెప్పడంతో ఆందోళన విరమించారు. అనంతరం అలవాల గ్రామంలో బాలకోటిరెడ్డి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. అంతకు ముందు గుంటూరు మార్చురి వద్ద టిడిపి నాయకులు ఆందోళన చేశారు. మృతదేహాన్ని అప్పగించడంలో పోలీసుల జాప్యం చేస్తున్నందుకు నిరసనగా ఆస్పత్రి ఎదుట బైఠాయించారు. గుంటూరు ఆస్పత్రి వద్ద బాలకోటిరెడ్డి మతదేహానికి మాజీ మంత్రి నక్కా ఆనంద బాబు నివాళులర్పించారు.

ఎటువంటి విచారణకైనా సిద్ధం : గోపిరెడ్డి

బాలకోటిరెడ్డిపై దాడి, మృతికి టిడిపిలో నెలకొన్న అంతర్గత విభేదాలే కారణమని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. దాడి తన కనుసన్నల్లో జరిగినట్లు, దాడి చేసిన వారికి తాను ఆశ్రయం ఇచ్చినట్లు టిడిపి నేతలు ఆరోపించడం దారుణమన్నారు. తనపై వచ్చిన ఆరోపణ లను నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానని అన్నారు.



దీక్షలో కూర్చున్న పోరాట కమిటీ చైర్మన్ ఆదినారాయణ, రామారావు తదితరులు

కేంద్రం దిగొచ్చేవరకూ పోరాటం

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి-ఉక్కునగరం, విశాఖ

కేంద్ర ప్రభుత్వం దిగొచ్చేవరకూ పోరాటం చేస్తామని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నేతలు స్పష్టం చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చ్ వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారంనాటికి 741వ రోజుకు చేరాయి. ఈ దీక్షల్లో స్టీల్‌ప్లాంట్ బ్లాస్ట్ ఫర్నేష్ విభాగం కార్మికులు కూర్చున్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ.. విశాఖ ఉక్కును పరిరక్షించుకునేందుకు చేపట్టిన ఈ పోరాటాన్ని మరింత ఉధృతం చేసేందుకు కార్యచరణ రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. కార్మికులు, ప్రజాసంఘాలను కలిపి ఈ పోరాటాన్ని ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోరాట కమిటీ ఛైర్మన్ డి.ఆదినారాయణ, నాయకులు ఎన్.రామారావు, జె.రామకృష్ణ, వైటి.దాస్, చిత్రాడ సన్యాసిరావు, బ్లాస్ట్ ఫర్నేష్ విభాగ నాయకులు సిహెచ్.సాయిరామ్, తుమ్మిగుంట ఈశ్వరరావు, ఎమ్.రవికిరణ్, పెంటారావు, పాల అప్పలరెడ్డి, ఆర్.వెంకట్రావు, మధు తదితరులు పాల్గొన్నారు.

వివాదం సృష్టించేందుకే అక్కడకు పట్టాభి

- సజ్జల రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

శాసనమండలిలో బిసిలకు అగ్రపీఠం కల్పించిన అంశాన్ని పక్కదారి పట్టించేందుకే టిడిపి ఒక పథకం ప్రకారం పట్టాభి అంశాన్ని తెరపైకి తెచ్చిందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి విమర్శించారు. గన్నవరం రాజకీయాలతో ఏ మాత్రం సంబంధం లేని పట్టాభి అక్కడకు ఎందుకు వెళ్లారో చెప్పాలని డిమాండ్ చేశారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఒక ఆంబోతులా పట్టాభిని ప్రజల మీదకు టిడిపి వదిలిందని విమర్శించారు. రోడ్లపై బూతులు తిడుతూ అధికారులపై దాడులు చేస్తే కేసులు పెట్టకుండా వదిలేయాలా? అని ప్రశ్నించారు. అబద్ధాలు ఎలా చెప్పాలో టిడిపి తమ కార్యకర్తలకు శిక్షణ కూడా ఇస్తోందని విమర్శించారు. 2014-19 మధ్య రాష్ట్రంలో వ్యవస్థలను పూర్తిగా నాశనం చేసింది చంద్రబాబేనని అన్నారు. 2014లో తమ ఎమ్మెల్యే ముస్తఫాను ఎత్తుకెళ్లి బెదిరించారన్నారు. చెరుకులపాడు నారాయణరెడ్డిని ఏకంగా హత్య చేయించారని పేర్కొన్నారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు రోజాను ఏవిధంగా వేధించారో అందరికీ తెలుసన్నారు. పోలీసు వ్యవస్థను దుర్వినియోగం చేసిన చరిత్ర చంద్రబాబుదేనని అన్నారు.

బాలికపై అత్యాచారం !

- పోలీసుల అదుపులో అనుమానితులు

ప్రజాశక్తి-మార్కాపురం (ప్రకాశం జిల్లా)

మత్తు మందు కలిపిన పానీయం ఇచ్చి.. ఓ బాలికపై అత్యాచారానికి పాల్పడినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రకాశం జిల్లా మార్కాపురం పట్టణంలోని కొండారెడ్డి కాలనీలో మంగళవారం చోటు చేసుకున్న ఈ ఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. బాలిక బంధువులు తెలిపిన సమాచారం మేరకు.. కొండారెడ్డి కాలనీకి చెందిన 15 ఏళ్ల బాలిక చదువు మానేసి తన తల్లిదండ్రులతో కలిసి కూలి పనులకు వెళుతోంది. తనకు కళ్లు తిరుగుతున్నాయని, నీరసంగా ఉందని, ఇంటికి తీసుకెళ్లాలని అదే కాలనీకి చెందిన ఓ మహిళ బాలికను కోరింది. ఇంటికి చేర్చిన బాలికకు తాగేందుకు ఆ మహిళ మంచి నీళ్లు ఇచ్చింది. నీటిని తాగిన అనంతరం ఆ బాలిక మత్తులోకి జారుకుంది. ఆ తరువాత ఏమి జరిగిందో తనకు తెలియదని, రాత్రి ఎనిమిది గంటల సమయంలో కొండారెడ్డి కాలనీకి దూరంగా పడి ఉన్నానని జరిగిన ఉదంతాన్ని తల్లిదండ్రులకు బాలిక వివరించింది. దీంతో ఆ మహిళను బాలిక బంధువులు నిలదీశారు. ఆమెతో సన్నిహితంగా మెలిగే షేక్ సలాం దీనంతటికీ కారణమని స్థానికులు భావించారు. షేక్ సలాంకు దేహశుద్ధి చేసి పోలీసులకు సమాచారం అందించారు. వైద్య పరీక్షల నిమిత్తం బాధితురాలితో పాటు అనుమానితుడు సలాంను మార్కాపురంలోని ప్రభుత్వ జిల్లా వైద్యశాలకు తరలించారు. అత్యాచారం జరిగిందా? లేదా? అనే విషయం పోరోనిక్స్ ల్యాబ్ నివేదికపై ఆధారపడి ఉందని, కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

సర్వీస్ కండీషన్లు ఏర్పాటు చేయాలి

- సిఎంకు, ఎపి గ్రామ, వార్డు సచివాలయ వాలంటీర్స్ యూనియన్ లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సచివాలయ వాలంటీర్లకు సర్వీస్ కండీషన్లు ఏర్పాటు చేయాలని, ఇదే అంశంపై హైకోర్టు సూచనల మేరకైనా పటిష్టమైన సర్వీస్ కండీషన్లతో ఉత్తర్వులివ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ వాలంటీర్స్ యూనియన్ (సిఐటియు) డిమాండ్ చేసింది. ఈ మేరకు సిఎం వైఎస్ జగన్‌కు యూనియన్ కన్వీనరు నూర్ మహ్మద్ బుధవారం లేఖ రాశారు. సచివాలయ వాలంటీర్ల అధికారాల గురించి రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించిందని, సర్వీస్ కండీషన్లు ఉంటేనే అధికారాలుంటాయని, రాష్ట్ర ప్రభుత్వం సర్వీస్ కండీషన్లు లేకుండా 50 కుటుంబాలకు ఒక వాలంటీర్‌ను మూడేళ్ల క్రితం నియమించిన సంగతిని లేఖలో ప్రస్తావించారు. ఇప్పటికే కొన్ని రాజకీయ పార్టీలు ఈ వాలంటీర్ వ్యవస్థను రద్దు చేస్తామని బహిరంగంగానే ప్రకటిస్తున్నాయని, వాలంటీర్స్ చేసిన సేవలకు గుర్తించి వారిని పర్మినెంట్ చేయాలని సిఎంకు విజ్ఞప్తి చేశారు.

చంద్రబాబు కుట్రల పట్ల అప్రమత్తం : సజ్జల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఎన్నికలు దగ్గరపడుతున్న నేపథ్యంలో చంద్రబాబు కుట్రల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. తాడేపల్లిలోని ఓ హోటల్‌లో ఎపి విశ్వ బ్రాహ్మణ సంఘం విస్తృతస్థాయి సమావేశం బుధవారం జరిగింది. దీనికి సజ్జల ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తను పదవిలో ఉన్నన్ని రోజులు బిసిలకు ద్రోహం చేసిన చంద్రబాబు మళ్లీ మరోసారి మోసం చేసేందుకు జనంలోకి వస్తున్నారన్నారు. రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ.. బిసిల అభివృద్ధికి కృతనిశ్చయంతో నిలిచిన వ్యక్తిగా జగన్ చరిత్రలో నిలిచిపోతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు డొక్కా మాణిక్యవరప్రసాద్, లేళ్ల అప్పిరెడ్డి, ఎపి విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి హనుమంతరావు, కార్యదర్శి డి నరసింహాచారి, మారేష్ తదితరులు పాల్గొన్నారు.

పయ్యావుల కేశవ్ భద్రతపై ఉత్తర్వులిస్తాం : హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

టిడిపి ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్‌కు భద్రత తగ్గింపు నిర్ణయం సరైనది కాదని హైకోర్టు అభిప్రాయపడింది. కేశవ్‌కు తొలగించిన భద్రత పునరుద్ధరణకు ఉత్తర్వులు ఇస్తామని ప్రకటించింది. ఐదారుగురు భద్రతా పోలీసుల పేర్లను నివేదించాలని, అందులోని ఇద్దరిని నియమిస్తూ ఆదేశాలు జారీ చేస్తామని వెల్లడించింది. విచారణను గురువారానికి వాయిదా వేస్తూ జస్టిస్ కె శ్రీనివాసరెడ్డి బుధవారం ఉత్తర్వులిచ్చారు. భద్రత పునరుద్ధణ చేయాలంటూ కేశవ్ వేసిన పిటిషన్ తరపున సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు వాదించారు.

రఘురామ పిటిషన్లపై విచారణ నుంచి తప్పుకున్న న్యాయమూర్తి

పశ్చిమ గోదావరి జిల్లాలో తనపై ఉన్న రెండు కేసుల్ని కొట్టేయాలంటూ ఎంపి కె రఘురామ కృష్ణరాజు దాఖలు చేసిన పిటిషన్‌ను మరో న్యాయమూర్తికి నివేదించాలని జస్టిస్ కె శ్రీనివాసరెడ్డి హైకోర్టు రిజిస్ట్రీకి ఆదేశాలు జారీ చేశారు. దీనికి చెందిన ఫైళ్లను చీఫ్ జస్టిస్‌కు నివేదించాలన్నారు. రఘురామ పిటిషన్ విచారణ నుంచి తప్పుకుంటున్నట్లు చెప్పారు. కుల, మత విద్వేషాలను రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తున్నారంటూ ఆ జిల్లాలోని పెనుమంట్ర, కాళ్ల పోలీస్ స్టేషన్లలో భూపతి వెంకట శ్రీనివాసరాజు, నాగేశ్వరరావు అనే వ్యక్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసులు నమోదు చేశారు. వీటిని కొట్టేయాలని కోరుతూ రఘురామ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ భానుమతి విచారణ చేయనున్నారు.

ఆడిట్‌పై నో ఆన్సర్

- రాష్ట్రంలో వైద్యశాఖ తీరు ఇది
- 159 అంశాలకు జవాబివ్వని అధికారులు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

అనేక అంశాలపై అకౌంటెంట్ జనరల్ కార్యాలయం సంధిస్తున్న ప్రశ్నలకు వైద్యారోగ్యశాఖ నుంచి స్పందన కరువవుతోంది. వీటిపై ఎజి కార్యాలయం కూడా వైద్యశాఖలకు అనేక లేఖలు రాసినట్లు తెలిసింది. అయినా ఇంకా 159 అంశాలపై సమాధానాలు రాలేదని ఎజి కార్యాలయం చెబుతోంది. దీనిపై తాజాగా మరో లేఖ కూడా వైద్య శాఖకు రాయడం గమనార్హం. శాఖకు సంబంధించి ఎజి కార్యాలయం ఆడిట్ నిర్వహించి పలు కోణాల్లో వివరణలు కోరింది. ఇందులో మొత్తం 449 వివరణలు కోరగా, ఆ శాఖ నుంచి 290కి మాత్రమే వివరణలు వెళ్లాయి. ఇంకా 159 అంశాలకు వివరణలు రాలేదని ఎజి అధికారులు అంటున్నారు. వైద్య మౌలికాభివృద్ధి సంస్థ నుంచి 25 వివరణలు, వైద్య విద్యాశాఖ నుంచి 36, వైద్య ఆరోగ్యం, కుటుంబ సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి నుంచి 19, అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రి నుంచి తొమ్మిది, గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రి నుంచి ఐదు, వైద్య ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ కమిషనరు కార్యాలయం నుంచి మూడు, వైద్య విధాన పరిషత్ నుంచి ఆరు, ప్రజారోగ్యం శాఖ నుంచి 31 వివరణలు పెండింగ్‌లో ఉండగా, నేషనల్ హెల్త్ మిషన్ నుంచి 25 వివరణలు ఎజి కార్యాలయానికి వెళ్లాల్సి ఉంది. తాము నివేదిక సిద్ధం చేయాల్సి ఉన్నందున వీలైనంత త్వరగా వీటిపై వివరణలు పంపించాలని ఎజి కార్యాలయం తన లేఖలో కోరింది.

నేటి నుంచి తిరుమలలో 'శ్రీవాణి' టికెట్లు

ప్రజాశక్తి - తిరుమల

గురువారం నుంచి తిరుమలలో శ్రీవాణి టికెట్లను జారీ చేయనున్నట్లు టిటిడి అధికారులు తెలిపారు. గురువారం నుంచి మార్చి ఒకటి వరకు రోజుకు 150 చొప్పున ఈ తర్వాత రోజుకు 400 టికెట్లను జారీ చేయనున్నట్లు తెలిపారు. తిరుపతిలో ఆఫ్‌లైన్‌లో శ్రీవాణి టికెట్లను బ్లాక్‌లో విక్రయిస్తుండటంతో గతేడాది డిసెంబర్ 29 నుంచి కరెంటు బుకింగ్ కౌంటర్‌ను టిటిడి మూసివేసిన విషయం తెలిసిందే. అయితే భక్తుల నుంచి వస్తున్న వినతుల మేరకు తిరిగి తిరుమలలో ఆఫ్‌లైన్‌లో శ్రీవాణి దర్శన టికెట్ల కేటాయింపును ప్రారంభించింది. రేణిగుంట ఎయిర్‌పోర్టులో ప్రస్తుతం నిత్యం 250 టికెట్లను కేటాయిస్తుండగా... గురువారం నుంచి 100 టికెట్లను మాత్రమే జారీ చేయనున్నట్టు టిటిడి అధికారులు తెలిపారు.

దళితుల భూములను కబ్జా చేసిన
బిజెపి నేతలను అరెస్టు చేయాలి

- వరప్రసాద్‌కు రక్షణ కల్పించాలి
- కెవిపిఎస్, వ్యవసాయకార్మిక సంఘం డిమాండ్



బిజెపి నేతలు కబ్జా చేసిన భూములపై క్షేత్రస్థాయి నివేదిక విడుదల చేస్తున్న కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దళితుడైన వరప్రసాద్‌ను తుపాకితో బెదిరించి భూకబ్జాకు పాల్పడిన బిజెపి రాష్ట్ర అధ్యక్షులు సోమువీర్రాజు, నాయకులు లక్ష్మీపతిరాజుపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటి కేసు నమోదు చేసి తక్షణమే అరెస్టు చేయాలని కెవిపిఎస్, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేశాయి. రాష్ట్ర ప్రభుత్వం సోమువీర్రాజు నుంచి వరప్రసాద్‌కు రక్షణ కల్పించి భూమిని విడిపించాలని కోరాయి. ఎపి వ్యవసాయకార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు, నాయకులు బి కోటేశ్వరి, కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి తదితరులు నిజనిర్ధారణ కమిటీగా మంగళగిరిలోని జాతీయ రహదారికి ఆనుకుని ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజీ సమీపంలోని వరప్రసాద్ భూమిని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు డాక్యుమెంట్లను పరిశీలించి స్థానికులతో మాట్లాడారు. అనంతరం విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో వి వెంకటేశ్వర్లు, అండ్ర మాల్యాద్రి మీడియాతో మాట్లాడారు. చిరుద్యోగి, దళితుడైన వరప్రసాద్ 2014లో షేక్ మగ్బూల్ అనే వ్యక్తి నుంచి 4404 చదరపు గజాల స్థలాన్ని కొనుగోలు చేసి రిజిస్టర్ కూడా చేయించుకున్నారని తెలిపారు. అయితే ఆ భూమి గతంలో ఎసిసి సిమెంట్ కంపెనీకి లీజులో ఉండేదని పేర్కొన్నారు. షేక్ మగ్బూల్‌కు చెందిన భూమితోపాటు మొత్తం 500 ఎకరాలు సిమెంట్ కంపెనీ లీజ్‌లో ఉండేవని అన్నారు. ఆ భూములకు సంబంధించిన లీజును సిమెంట్ కంపెనీ రద్దుచేసి ఎవరి భూమి వారికి ఇచ్చిందని అన్నారు. అలా క్లియర్ చేసుకున్నాకే షేక్ మగ్బూల్ నుంచి వరప్రసాద్ భూమిని కొనుగోలు చేశారని తెలిపారు. ఆ సిమెంట్ కంపెనీకి పవర్ ఆఫ్ అటార్నీ ఉన్న బద్రిరెడ్డి వెంకటరెడ్డి, డాక్యుమెంట్ రైటర్ బిజెపి నాయకుడు లక్ష్మీపతిరాజు తప్పుడు డాక్యుమెంట్లతో ఈ భూములను కబ్జా చేసేందుకు పూనుకున్నారని పేర్కొన్నారు. సోమువీర్రాజు ఈ భూమిని రూ.5 కోట్లకు ఇచ్చేయాలని, దళితునికి ఇంత విలువైన భూమి ఎందుకు అంటూ తుపాకితో బెదిరించారని తెలిపారు. ఇదే అంశాన్ని బిజెపికి చెందిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విజయవాడకు వచ్చినపుడు బాధితుడు ఫిర్యాదు చేస్తే దళితుల భూములను దౌర్జన్యంగా తీసుకుని తమ పార్టీ కార్యాలయం కట్టబోమని, భూమిని తీసుకోబోమని ఆయన భరోసా ఇచ్చారన్నారు. అయినా వరప్రసాద్‌ను భూమిపైకి రాకుండా సోమువీర్రాజు దౌర్జన్యం చేస్తున్నారని తెలిపారు. దొంగ రిజిస్ట్రేషన్‌లతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న వెంకటరెడ్డిపై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వరప్రసాద్‌కు రక్షణ కల్పించి, ఆయన భూమిని తిరిగి ఇప్పించకపోతే ప్రజా సంఘాలు, దళిత సంఘాలను కలుపుకుని పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని వారు హెచ్చరించారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కె కల్యాణ్, సమతాసైనిక్ దళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లి సురేంద్రబాబు, కెవిపిఎస్ రాష్ట్ర నాయకులు నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

చక్కెర పరిశ్రమలకు పూర్వవైభవం

- 'యువగళం' పాదయాత్రలో నారా లోకేష్ హామీ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

రాష్ట్రవ్యాప్తంగా మూసివేసిన చక్కెర పరిశ్రమలను తెరచి పూర్వవైభవం తీసుకొస్తామని టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ హామీ నిచ్చారు. రైతు పక్షపాతి ప్రభుత్వామంటూ గొప్పలు చెప్పుకుంటున్న సిఎం జగన్ ఏటా ఒక్కొక్క రైతుపై రూ.2.50 లక్షల తలసరి అప్పును మోపుతున్నారని విమర్శించారు. లోకేష్ చేపట్టిన 'యువగళం' పాదయాత్ర 24వ రోజైన బుధవారం తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి నియోజకవర్గం పరిధిలోని ఏర్పేడు మండలంలో కొనసాగింది. మడిబాక, మునగలపాలెం, వికృతమాల, పాపానాయుడుపేట గ్రామాల రైతులతో లోకేష్ ముఖాముఖి నిర్వహించారు. పలు సమస్యలను లోకేష్ దృష్టికి రైతులు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగిస్తే రైతులకు ఉరి తప్పదన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ఆరు చక్కెర పరిశ్రమలకు పూర్వ వైభవం తెస్తామని హామీ ఇచ్చిన జగన్, అధికారం చేపట్టాక ఐదింటిని మూసివేయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో చెరకు రైతులకు రూ.63కోట్ల బకాయిలు ఉన్నాయని తెలిపారు. ఈ చక్కెర పరిశ్రమలను శాశ్వతంగా మూసివేసి, ఆ భూములను అమ్మేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందని విమర్శించారు. టిడిపి అధికారంలోకి వస్తే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న చక్కెర పరిశ్రమలకు పూర్వ వైభవం తెస్తామన్నారు. రైతులకు చెల్లించాల్సిన బకాయిలను వడ్డీతో సహా యాజమాన్యం నుంచి చెల్లిస్తామనిహామీ ఇచ్చారు. యాత్ర రేణిగుంట మండలం జిపాలెం గ్రామానికి చేరుకుంది. గురువారం జి పాలెం నుంచి యాత్ర ప్రారంభం కానుంది.

యువగళంలో కరపత్రాల వివాదం

యువగళం పాదయాత్రలో కరపత్రాల వివాదం రాజుకుంది. ఏర్పేడు మండలం మర్రిమందకు యాత్ర చేరుకోగానే కొందరు వైసిపి కార్యకర్తలు టిడిపికి వ్యతిరేకంగా ముద్రించిన కరపత్రాలను పైకి వెదజల్లారు. దీంతో ఇరుపార్టీలకు చెందిన కార్యకర్తల మధ్య వివాదం జరిగింది. పోలీసులు వెంటనే జోక్యం చేసుకుని కరపత్రాలన వెదజల్లిన వైసిపి కార్యకర్తలను సమీపంలోని పాఠశాల గదిలోకి తీసుకెళ్లి తాళాలు వేశారు. అక్కడకు వెళ్లకుండా టిడిపి కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వివాదం సద్దుమణిగింది.

అనారోగ్యంతో పసిబిడ్డ మృతి

ప్రజాశక్తి-రోలుగుంట(అనకాపల్లి జిల్లా)

అనకాపల్లి జిల్లా రోలుగుంట మండలంలో అనారోగ్యంతో ఓ పసిబిడ్డ మృతి చెందింది. గ్రామస్తులు డోలీలో పసిబిడ్డను, బాలింతను మూడు కిలో మీటర్లు మోసుకెళ్లి ఆస్పత్రికి తరలించినా శిశువు ప్రాణాలు దక్కలేదు. బాధితుల కథనం మేరకు... రోలుగుంట మండలం ఆర్ల పంచాయతీ పెదగరువు కొండశిఖర గ్రామంలో 80 కొంద పిటిజికి చెందిన ఆదివాసి గిరిజన కుటుంబాలు నివసిస్తున్నాయి. గ్రామానికి చెందిన కిల్లో కమల (20) నిండు గర్భిణి. మంగళవారం సాయంత్రం ఆమెకు నొప్పులు రావడంతో ఇంటి వద్దే బిడ్డను ప్రసవించింది. బుధవారం ఉదయం ఏడు గంటల సమయంలో బిడ్డకు ఆరోగ్యం బాగోలేకపోవడంతో బుచ్చింపేట పిహెచ్‌సికి తీసుకొచ్చేందుకు డోలి కట్టుకొని మూడు కిలోమీటర్లు ఎత్తైన కొండల మధ్య రాళ్లు రప్పలు దాటుకుంటూ ఆర్ల గ్రామం వరకు వచ్చారు. అక్కడి నుంచి 108 వాహనంలో బుచ్చింపేట పిహెచ్‌సికి తరలించారు. అప్పటికే శిశువు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘం 5వ షెడ్యూల్ సాధన కమిటీ జిల్లా గౌరవాధ్యక్షులు కె.గోవిందరావు మాట్లాడుతూ.. భారీ వర్షాల కారణంగా రోడ్డు కొట్టుకుపోవడంతో డోలిలో తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పటికైనా రోడ్డును బాగుచేసి డోలి కష్టాలు తీర్చాలని డిమాండ్ చేశారు.



కోర్టు భవనం ప్రారంభోత్సవంలో దుర్గాప్రసాదరావు, తదితరులు

తెనాలిలో పోక్సో కోర్టు ప్రారంభం

ప్రజాశక్తి-తెనాలి (గుంటూరు జిల్లా)

ప్రత్యేక కోర్టుతో కేసులు విచారణ వేగవంతమవు తుందని, బాధితులకు సత్వర న్యాయం జరుగుతుందని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యు.దుర్గాప్రసాదరావు తెలిపారు. గుంటూరు జిల్లా తెనాలి కొత్తపేటలోని కోర్టు భవనాల ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన స్పెషల్ కోర్టు ఫర్‌ది అఫెన్సెన్ అండర్ పోక్సో యాక్ట్ కోర్టు భవనాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోక్సో కోర్టులు అవకాశం మేరకు విస్తరిస్తున్నాయన్నారు. తెనాలి చుట్టుపక్కల మండలాలకు సంబంధించి దాదాపు 200 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, ప్రత్యేక కోర్టు ద్వారా విచారణ వేగవంతమౌతుందన్నారు. ఆయన వెంట హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బి.కృష్ణమోహన్, జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, జస్టిస్ వడ్డిబోయిన సుజాత, జస్టిస్ వెంకటజ్యోతిర్మయి ప్రతాప, ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి వైవిఎస్‌బిజి పార్థసారధి, సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ ఉన్నారు.

రాజమండ్రి సెంట్రల్ జైలుకు పట్టాభి

ప్రజాశక్తి - గన్నవరం



టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్‌కు 14 రోజులపాటు రిమాండ్ విధిస్తూ గన్నవరం అదనపు మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి శిరీష బుధవారం తీర్పునిచ్చారు. కృష్ణా జిల్లా గన్నవరంలో టిడిపి కార్యాలయంపై దాడికి పట్టాభి చేసిన వ్యాఖ్యలే కారణమంటూ పోలీసుల కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఆయనపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ యాక్ట్‌తోపాటు వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. తనను పోలీసులు కొట్టారని చెప్పడంతో న్యాయమూర్తి ఆదేశం మేరకు పట్టాభికి మంగళవారం రాత్రి విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యపరీక్షలు పూర్తయ్యేసరికి కోర్టు సమయం ముగియడంతో పోలీసులు తమ కస్టడీలోనే ఉంచుకున్నారు. బుధవారం ఉదయం తిరిగి గన్నవరం అదనపు మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో పట్టాభిని హాజరుపరిచారు. వైద్య పరీక్షల నివేదికను పరిశీలించిన న్యాయమూర్తి ఆయనకు రిమాండ్ విధిస్తూ గన్నవరం సబ్ జైలుకు పంపాలని ఆదేశించారు. శాంతి భద్రతల దృష్ట్యా వేరే జైలుకు తరలించాలని న్యాయమూర్తిని పోలీసులు కోరగా.. వారి అభ్యర్థనను న్యాయస్థానం తిరస్కరించింది. దీంతో ఆయనను గన్నవరం సబ్‌జైలుకు తరలించారు. ముందస్తు అనుమతి కోరితే పరిశీలిస్తామని న్యాయమూర్తి తెలిపారు. గన్నవరం సబ్‌జైలులో ఖాళీ లేకపోవడం, సౌకర్యాలు తగినంత లేకపోవడం, ఇతర ఇబ్బందుల దృష్ట్యా టిడిపి నేతలను వేరే జైలుకు తరలించాలనే మరో అభ్యర్థనను పోలీసులు కోర్టు ముందు ఉంచారు. వారి అభ్యర్థనను న్యాయమూర్తి పరిగణనలోకి తీసుకుని పట్టాభితోపాటు పది మందిని రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించాలని ఆదేశించారు. దీంతో వారిని రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు. పట్టాభికి ఎటువంటి గాయాలు లేవని వైద్యులు తెలిపినట్లు సమాచారం.

లాభం రూ.21 కోట్లు

- 2023-24లో జెన్‌కో అంచనా

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

లాభనష్టాలపై జెన్‌కో అంచనాలను సిద్ధం చేసింది. ఈ ఏడాది కన్నా వచ్చే ఏడాది రూ.కోటి అదనంగా లాభం వస్తుందని అంచనాకు అధికారులు వచ్చారు. ఆదాయం, వ్యయం లాభ నష్టాలతో కూడిన నివేదికను కూడా జెన్‌కో అధికారులు సిద్ధంచేసి ప్రభుత్వానికి పంపించారు. ఈ నివేదిక ఆధారంగా 2023-24 ఆర్థిక సంవత్సరంలో 21.28 కోట్లు ఆదాయం సమకూరుతుందని అంచనాకు వచ్చారు.

వచ్చే ఏడాది రూ.13,677.68 కోట్లు ఆదాయంగా సమకూరుతుందని చెబుతున్నారు. ఇందులో విద్యుత్ అమ్మకాల ద్వారా రూ.13,624.89 కోట్లు, ఇతర మార్గాల ద్వారా రూ.52.79 కోట్లు సమకూరుతుందని అంచనా. వ్యయానికి సంబంధించి మొత్తం రూ.13,649.47 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేస్తున్నారు. ఇందులో అంతర్రాష్ట్ర విద్యుత్ కింద రూ.67.86 కోట్లు, ఇంధన వ్యయం కింద రూ.8,247.70 కోట్లు, నిర్వహణకు రూ.1653.67 కోట్లు, తరుగు కింద రూ.663 కోట్లు, అప్పుల చెల్లింపులు, వడ్డీలకు రూ.3,027.24 కోట్లు అవసరమవుతుందని భావిస్తున్నారు.

ఈ గణాంకాల నేపథ్యంలోనే మొత్తం ఏడాదికి రూ.21.28 కోట్లు లాభంగా మిగులుతుందని అంచనా వేస్తున్నట్లు నివేదికలో పేర్కొన్నారు. వచ్చే నెలాఖరుతో ముగుస్తున్న ఆర్థిక సంవత్సరానికి రూ.20.06 కోట్ల లాభంతో ముగియనున్నట్లు నివేదికలో పేర్కొన్నారు. ఈ ఏడాది ఆదాయం రూ.12,948.59 కోట్లుగా, వ్యయం రూ.12,921.86 కోట్లుగా గుర్తించారు.

విద్యుత్ ఉత్పత్తిపైనా..

ఈ ఏడాది 23,735 మిలియన్ కిలోవాట్ల విద్యుత్ ఉత్పత్తి జరగ్గా, వచ్చే ఏడాది 29,920 మిలియన్ కిలోవాట్ల విద్యుత్ ఉత్పత్తిని అంచనా వేశారు. ఇందులో థర్మల్ విద్యుత్ ద్వారానే 25,916 మిలియన్ కిలోవాట్ల విద్యుత్ ఉత్పత్తి సాధ్యమవుతుందని చెబుతున్నారు. 2019-20 ఆర్థిక సంవత్సరంలో 21,762 మిలియన్ కిలోవాట్ల విద్యుత్ ఉత్పత్తి జరగ్గా, నాలుగేళ్లలోనే అది 29,920 మిలియన్ కిలోవాట్లకు చేరుకుంటుండడం గమనార్హం. ఇందులో 27,566 మిలియన్ కిలోవాట్ల విద్యుత్ అమ్మకానికి అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. ఒక్కో కిలోవాట్‌పై రూ.4.94 వరకు ఆదాయం వస్తుందని కూడా అంచనా వేశారు.

'బేర్'మన్న మార్కెట్లు

- సెన్సెక్స్ 928 పాయింట్లు ఫట్
- రూ.4 లక్షల కోట్ల సంపద ఆవిరి
- బోరుమన్న మదుపర్లు
- పాతాళం వైపు అదాని స్టాక్స్



ముంబయి : భారత స్టాక్ మార్కెట్లు అమ్మకాల ఒత్తిడితో కుప్పకూలాయి. అంతర్జాతీయ ప్రతికూలాంశాలకు తోడు ఆర్థిక కార్యకలాపాల్లో అనిశ్చిత్తి, ఎఫ్ఐఐలు తరలిపోవడం, రూపాయి విలువ పతనం తదితర అంశాలు వరుసగా నాలుగు రోజూ సూచీల పతనానికి ప్రధాన కారణమయ్యాయి. బుధవారం ప్రారంభం నుంచి తుది వరకు సూచీలు ఒత్తిడిలోనే కొనసాగాయి. బిఎస్ఇ సెన్సెక్స్ 1000 పాయింట్ల మేర క్షీణించి.. 60వేల మార్క్ దిగువకు చేరడంతో.. మదుపర్ల సంపద లక్షల కోట్లు ఆవిరయ్యింది. బిఎస్ఇ సెన్సెక్స్ తుదకు 928 పాయింట్లు లేదా 1.53 శాతం పతనమై 59,745కు జారింది. ఇదే బాటలో నిఫ్టీ 274 పాయింట్ల నష్టంతో 17,553 వద్ద ముగిసింది. అన్ని రంగాలు నేల చూపులు చూశాయి. లోహ సూచీ అత్యధికంగా 2.5 శాతం నష్టపోయింది. ఒక్క పూటలోనే మదుపర్లు రూ.3.9 లక్షల కోట్ల సంపద కోల్పోయారు. గడిచిన నాలుగు సెషన్లలో బిఎస్ఇ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ కాపిటలైజేషన్ రూ.7 లక్షల కోట్ల మేర పతనమై రూ.261.3 లక్షల కోట్లకు పరిమితమయ్యింది.

ప్రధాన కారణాలు..

ముఖ్యంగా ఉక్రెయిన్ అంశంలో అమెరికా-రష్యా మధ్య మళ్లీ మదురుతున్న ఆవేశాలు ప్రపంచ స్టాక్ మార్కెట్లను ఆందోళనకు గురి చేశాయి. అమెరికా మార్కెట్లు 2023లో అతిపెద్ద ఒక రోజు నష్టాన్ని మంగళవారం చవి చూశాయి. ఈ ప్రభావం భారత మార్కెట్‌లు సహా ఆసియా- పసిఫిక్, ఐరోపా మార్కెట్లపై పడింది. ఫిబ్రవరిలో జరిగిన ద్వైమాసిక ద్రవ్య పరపతి విధాన సమావేశానికి సంబంధించిన మినెట్స్‌ను ఇటు ఆర్‌బిఐ, అటు అమెరికా ఫెడరల్ రిజర్వ్ విడుదల చేయనున్నాయి. ఈ క్రమంలో అధిక ధరలపై ఆయా రెగ్యూలేటరీ సంస్థల వైఖరీ ఎలా ఉండనుందనే అంచనాలు సూచీలను ఒత్తిడికి గురి చేశాయని నిపుణులు భావిస్తున్నారు. కొత్త ఏడాది జనవరిలో భారత్‌లో వినియోగదారుల ద్రవ్యోల్బణం సూచీ 6.5 శాతంపైన నమోదయిన విషయం తెలిసిందే. దీంతో వడ్డీ రేట్ల పెంపు కొనసాగొచ్చనే అంచనాలు పలు స్టాక్స్‌పై ఒత్తిడిని పెంచాయి. డాలర్‌తో రూపాయి మారకం విలువ తగ్గుదల అంశాలు ఇన్వెస్టర్లను ఆందోళనకు గురి చేశాయి. ఉదయం సెషన్ ప్రారంభంలోనే డాలర్‌తో రూపాయి మారకం విలువ 4 పైసలు కోల్పోయి 82.83 కనిష్ఠ స్థాయి వద్ద ట్రేడింగ్ అయ్యింది.

అదాని స్టాక్స్‌కు మరింత గడ్డుకాలం

మూలిగే నక్కపై తాటిపండు పడిన చందంగా అదాని స్టాక్స్ పరిస్థితి చోటు చేసుకుంది. ఇప్పటికే తీవ్ర నష్టాల్లో ఉన్న అదాని గ్రూపు షేర్లపై మార్కెట్ల భారీ పతనం మరింత ఒత్తిడిని పెంచింది. అదాని గ్రూపు తమకు అనుకూల వ్యాసాలను రాయించుకుందన్న వికీపీడియా విమర్శలు అదాని సూచీల్లో అమ్మకాలు వెల్లువెత్తేలా చేశాయి. అదానీ గ్రీన్ ఎనర్జీ, అదాని పవర్, అదాని టోటల్ గ్యాస్, అదాని ట్రాన్స్‌మిషన్, అదాని విల్మర్ షేర్లు 5 శాతం మేర నష్టపోయి లోయర్ సర్క్యూట్‌ను తాకాయి. గౌతం అదాని కీలక కంపెనీ అయినా అదాని ఎంటర్‌ప్రైజెస్ షేర్ బిఎస్ఇలో ఏకంగా 10.43 శాతం లేదా రూ.163.55 పతనమై రూ.1,404.85కు పడిపోయింది. ఉదయం రూ.1,539 వద్ద ప్రారంభమైన ఈ సూచీ తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొని.. ఇంట్రాడేలో ఏకంగా రూ.1,381 కనిష్ఠ స్థాయికి జారింది. నెల రోజుల్లో అదాని స్టాక్స్ 60 శాతం మేర పతనం కావడంతో గౌతం అదాని సంపద రూ.12 లక్షల కోట్ల మేర హరించుకుపోయింది.

చిట్టీ డబ్బు ఇవ్వలేదని ఆత్మహత్య

- పరారీలో తిరుచానూరు అర్చకుడు

ప్రజాశక్తి - తిరుచానూరు (తిరుపతి)

చిట్టీ డబ్బులు ఇవ్వకుండా ఏళ్ల తరబడి వేధిస్తున్న నిర్వాహకుడి తీరుతో మనస్తాపం చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన తిరుపతి జిల్లాలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల మేరకు.. తిరుచానూరు పంచాయతీ ఎస్‌విపి కాలనీకి చెందిన నితిన్ స్థానికంగా ప్రొవిజన్ దుకాణం నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో చిట్టీ నిర్వహిస్తున్న వాణి, ఆమె భర్త ప్రతాప్ స్వామి అలియాస్ బాబు స్వామి (తిరుచానూరు అమ్మవారి ఆలయం ప్రధాన అర్చకులు) వద్ద పెద్ద మొత్తంలో చిట్టీ వేశారు. చిట్టీ గడువు ముగిసి మూడేళ్లు అవుతున్నా తనకు రావాల్సిన డబ్బులు ఇవ్వకుండా దంపతులిద్దరూ రోజుకో మాట చెబుతుండేవారు. దీంతో విసిగిపోయిన నితిన్ మనస్తాపంతో తన చావుకు చిట్టీ నిర్వహకులే కారణమని లేఖ రాసి ఆదివారం ఇంటిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. కుటుంబ సభ్యుల సమాచారం మేరకు సోమవారం తిరుచానూరు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయాకు తరలించారు. నితిన్ చావుకు కారణమైన చిట్టీ నిర్వాహకులపై బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులు పరారీలో ఉన్నారని, కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

మావోయిస్టు నేత అరెస్టు

- కిడారి సర్వేశ్వరరావు, సివేరి సోమ హత్య కేసు ప్రధాన నిందితుడు

ప్రజాశక్తి పాడేరు, అల్లూరి సీతారామరాజు జిల్లా

ఆంధ్ర -ఒడిశా సరిహద్దు స్పెషల్ జోన్ కమిటీకి చెందిన కీలక మావోయిస్టు నేత, డివిజనల్ కమిటీ సభ్యుడు జనుమూరి శ్రీనుబాబు అలియాస్ రైను అలియాస్ సునీల్‌ను బుధవారం పోలీసులు అరెస్టు చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా సీలేరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆంధ్ర -ఒడిశా సరిహద్దు అటవీ ప్రాంతంలో ఈ నెల 21న మావోయిస్టులకు, పోలీసులకు మధ్య జరిగిన ఎదురు కాల్పుల సమయంలో రైనును అరెస్టు చేసినట్లు జిల్లా పోలీసు అధికారులు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆయన నుంచి ఒక తుపాకీ, పేలుడు సామాగ్రి, విప్లవ సాహిత్యం, నగదు, ఇతర వస్తువులు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. 2018లో అరకు ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే సోమ హత్య కేసులో ఇతను ప్రధాన నిందితుడుగా ఉన్నట్లు వెల్లడించారు. ఆంధ్ర, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు నేతగా ఉన్నాడని పేర్కొన్నారు. గతంలో ప్రభుత్వం ఇతనిపై రూ.5 లక్షల రివార్డు ప్రకటించిందని తెలిపారు. రైను 2000లో మావోయిస్టు పార్టీలో చేరి ఎల్లవరం, గుర్తేడు, నందపూర్ దళాల్లో పనిచేశాడని తెలిపారు. ఎఒబి టెక్నికల్ టీమ్‌లో, సిఆర్‌సి 3వ కంపెనీలో కమాండర్‌గా, ఆర్‌కె ప్రొటెక్షన్ స్క్వాడ్ కమాండర్‌గా, ఎఒబి మిలిటరీ ప్లటూన్ కమాండర్‌గా వివిధ హోదాల్లో పనిచేసినట్లు పేర్కొన్నారు.

ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి దరఖాస్తులు

- కల్నల్ వినయ్ కుమార్

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ



ఇండియన్ ఆర్మీలో చేరేందుకు దేశవ్యాప్తంగా 176 చోట్ల రిక్రూట్‌మెంట్ ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు ఆర్మీ రిక్రూటింగ్ విశాఖపట్నం డైరెక్టర్ కల్నల్ వినయ్‌కుమార్ తెలిపారు. ఈ నెల 16 నుంచి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైందని, వచ్చే నెల 15వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. విశాఖ డాబాగార్డెన్స్‌లోని విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. దేశంలోని 176 చోట్ల ఆర్మీ ర్యాలీలు జరుగుతాయని తెలిపారు. వీటిలో ఏ ఒక్కచోటనైనా పాల్గొనవచ్చని చెప్పారు. ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తులు నమోదు చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలకు యశీఅఅఱఅఎఱఖుఖుఱఱీఎ.ఎ.అఱఎ.అఅ వెబ్‌సైట్‌లో చూడాలని సూచించారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఈసారి మూడు పద్ధతుల పరీక్ష ఎదుర్కోవాల్సి ఉంటుందని చెప్పారు. అభ్యర్థులను ఎఆర్‌ఒలు నిర్ణయించిన ప్రాంతాల్లో రిక్రూట్‌మెంట్ ర్యాలీకి ఆహ్వానిస్తారని తెలిపారు. ఫిజికల్ టెస్టులు, కొలతల అనంతరం ర్యాలీ ప్రదేశంలో మెడికల్ టెస్ట్ చేయించుకోవాల్సి ఉంటుందన్నారు. నియామక ర్యాలీ అత్యంత పారదర్శకంగా జరుగుతుందని, అభ్యర్థులు మధ్యవర్తులను, ఏజెన్సీలను నమ్మవద్దని సూచించారు. మెరిట్ ఆధారంగా ఎంపిక ఉంటుందని తెలిపారు. సమావేశంలో ఆర్మీ మెడికల్ ఆఫీసర్, పిఆర్‌ఒ పాల్గొన్నారు.

బిఎండబ్ల్యు మోటోరడ్ నుంచి కొత్త బైకులు

- ప్రారంభ ధర రూ.24 లక్షలు

న్యూఢిల్లీ : బిఎండబ్ల్యు మోటోరడ్ తన 100 ఏళ్ల వార్షికోత్సవం సందర్భంగా స్పెషల్ ఎడిషన్‌లో రెండు కొత్త వేరియంట్ బైకులను ఆవిష్కరించింది. ఆర్ నైన్‌టి 100 హియర్స్, ఆర్ 18 100 హియర్స్ మోడళ్లను విడుదల చేసింది. ఈ బైకులను 1923 చొప్పున మాత్రమే తయారు చేసి విక్రయించనున్నట్లు ఆ కంపెనీ ప్రకటించింది. 1923లో ఈ కంపెనీ ప్రారంభించిన సందర్భంగా.. చరిత్రలో మిగిలిపోయేలా వీటిని డిజైన్ చేసినట్లు తెలిపింది. భారత్‌లో ఆర్‌నైన్ టి ఎక్స్‌షోరూం ధరను రూ.24 లక్షలుగా, ఆర్ 18 100 ధరను రూ.25,90,000గా నిర్ణయించింది. "100 ఏళ్ల క్రితం బిఎండబ్ల్యు ఆర్ 32 కిక్‌తో ప్రారంభమైన తమ ప్రయాణం ఇప్పుడు ఓ విజయవంతమైన స్టోరీగా నిలిచింది. ఈ రెండు కొత్త వేరియంట్లను 1,923 యూనిట్ల చొప్పున మాత్రమే విడుదల చేస్తున్నాము." అని బిఎండబ్ల్యు గ్రూపు ఇండియా ప్రెసిడెంట్ విక్రమ్ పావ్ పేర్కొన్నారు.

మెకిన్సీలో 2వేల మందిపై వేటు

న్యూయార్క్ : ఆర్థిక మాంద్యం భయాలు టెక్ కంపెనీలను గడగడలాడిస్తున్నాయి. భవిష్యత్తు రోజులు ఎలా ఉంటాయోననే భయాల్లో పొదుపు చర్యలకు దిగుతున్నాయి. ఈ క్రమంలో అనేక టెక్నలాజీ కంపెనీలు వేల సంఖ్యలో ఉద్యోగులను తొలగిస్తున్నాయి. తాజాగా గ్లోబల్ కన్సల్టెంగ్ సంస్థ మెకిన్సీ ఏకంగా 2,000 మంది ఉద్యోగులకు ఉద్వాసన పలుకుతుందని బుధవారం బ్లూమ్‌బర్గ్ వెల్లడించింది. మెకిన్సీలో ప్రపంచ వ్యాప్తంగా 45వేల మంది పైగా ఉద్యోగులు పని చేస్తున్నారు. తొలుత క్లయింట్స్‌తో నేరుగా సంబంధాలు లేని ఉద్యోగులపై వేటు వేయనుందని తెలుస్తోంది. 100 ఏళ్ల క్రితం చికాగోలో ఏర్పాటైన ఈ కంపెనీ ప్రస్తుతం 130 దేశాల్లో కార్యకలాపాలు సాగిస్తుంది. వచ్చే రెండు వారాల్లో తొలగింపులపై ఆ కంపెనీ అధికారికంగా ప్రకటన చేయనుందని బ్లూమ్‌బర్గ్ పేర్కొంది. అమెరికా ఆర్థిక వ్యవస్థలో రోజు రోజుకు మాంద్యం చాయలు పెరగడంతో ఇప్పటికే ట్విట్టర్, మెటా, అమెజాన్, గూగుల్, గోల్డ్‌మాన్ సాక్స్, మోర్గాన్ స్టాన్లీ తదితర కంపెనీలు వేల సంఖ్యలో తమ ఉద్యోగులను ఇంటికి పంపిస్తున్నాయి. టెక్, ఫైనాన్స్, రిటైల్ తదితర అన్ని రంగాల్లో కోతలు చోటు చేసుకుంటున్నాయి.

ఒకాయ ఇవి నుంచి ఫాస్ట్ ఎఫ్2ఎఫ్

- ఒక్క సారి ఛార్జ్‌తో 80 కిలోమీటర్లు



న్యూఢిల్లీ : విద్యుత్ వాహన బ్రాండ్ ఒకాయ ఇవి మార్కెట్లోకి కొత్తగా ఫాస్ట్ ఎఫ్2ఎఫ్‌ను విడుదల చేసినట్లు ప్రకటించింది. ఈ వాహనాన్ని ఒక్క సారి ఛార్జింగ్ చేస్తే 70-80 కిలోమీటర్లు ప్రయాణించడానికి వీలుందని ఆ సంస్థ పేర్కొంది. గంటకు గరిష్టంగా 55 కిలోమీటర్ల వేగంతో వెళ్తుందని తెలిపింది. ఆరు రంగుల్లో లభించే దీని ఎక్స్‌షోరూం ధరను రూ.83,999గా నిర్ణయించినట్లు ఒకాయ ఎలక్ట్రిక్ వెహికల్స్ వెహికల్స్ ఎండి అన్షుల్ గుప్తా పేర్కొన్నారు. అత్యుత్తమ నాణ్యత, విశ్వసనీయమైన ఇవిల కోసం అనేక ఉన్నత ప్రమాణాలను పాటించామని ఆయన తెలిపారు.



విప్రో అనైతిక చర్య

- 'సగం జీతం'పై ఆందోళనలు

బెంగళూరు : ప్రముఖ ఐటి సంస్థ విప్రో తమ ఫ్రెషర్స్‌కు తొలుత ఆఫర్ చేసిన జీతంలో సగానికి పని చేయాలని కోరడంపై ఆ వర్గాల్లో తీవ్ర ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. విప్రో చర్య చాలా అనైతికమని ఐటి సెక్టార్ ఎంప్లాయిస్ యూనియన్ ఎన్ఐటిఇఎస్ విమర్శించింది. విప్రో నిర్ణయం అన్యాయమని, ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేసింది. విప్రో తన నిర్ణయంపై మరోసారి పునరాలోచించాలని కోరింది. విప్రో నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తోన్నామని ఎన్ఐటిఇఎస్ అధ్యక్షుడు హర్ప్రీత్ సింగ్ సలౌజా పేర్కొన్నారు. తమ సభ్యులకు నష్టం వాటిల్లితే ఊరుకోబోమన్నారు. ఇటీవల విప్రో తన ఫ్రెషర్లకు వేతన ప్యాకేజీని రూ.6.50 లక్షల నుంచి రూ.3.5 లక్షలకు తగ్గించుకుని విధుల్లో చేరాల్సిందిగా కోరినట్లు రిపోర్టులు వచ్చాయి.

సంపాదకీయం

ఎంఎస్‌సిఎస్ మరో జిఎస్‌టి!

బహుళ రాష్ట్ర సహకార సంఘాల (ఎంఎస్‌సిఎస్) పేరిట వివిధ రాష్ట్రాల్లోని సహకార సంఘాలపై పెత్తనం చలాయించాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నించడం దారుణం. వాస్తవానికి సహకార సంఘాలు రాష్ట్ర జాబితాలోని అంశం. భారత రాజ్యాంగంలోని ఏడో షెడ్యూల్‌లో రాష్ట్ర జాబితాలోని 32 అంశాల్లో సహకార సంఘాలు ఒకటి. అయినా, కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయడం రాష్ట్రాల హక్కుల్లోకి చొరబడడమే. ఫెడరల్ స్ఫూర్తికి విఘాతం కలిగించడమే! ఆ శాఖ మంత్రిగా కేంద్ర కేబినెట్‌లో సర్వ శక్తిమంతుడైన అమిత్ షా ను నియమించడం కూడా సహకార సంఘాలను కేంద్రం అజమాయిషీ లోకి, ఆ తరువాత బిజెపి రాజకీయ ప్రభావం లోకి లాక్కోవాలని మోడీ సర్కారు యోచిస్తున్నదన్న విమర్శ సత్యదూరం కాదు.

కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ ఏర్పాటుపై 2021 జులైలో ప్రకటన చేసినప్పటినుండి అనేక రాష్ట్రాలు వ్యతిరేకిస్తున్నాయి. ముఖ్యంగా వందేళ్ళ పైబడి సహకార సంఘాలను విజయవంతంగా నడుపుతున్న కేరళ రాష్ట్రం మోడీ సర్కారు ఎత్తులను ఆది నుంచీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది. సహకార వ్యవస్థను విస్తారంగావించిన రాష్ట్రాల్లో మహారాష్ట్ర ప్రముఖమైనది. చక్కెర రంగంలో అద్భుత ఫలితాలు సాధించింది. అలాగే పాడి రంగంలో గుజరాత్, ఆ తరువాత కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ వంటివి సహకార వ్యవస్థ ద్వారా అటు పాల ఉత్పత్తిదార్లకు, ఇటు వినియోగదార్లకు ప్రయోజనకరంగా నిర్వహించాయి. అయితే, గ్రామ సీమల్లో సహకార సొసైటీల విస్తరణ, నిర్వహణ ద్వారా ఆయా రాష్ట్రాల్లోని కొన్ని ప్రధాన రాజకీయ పార్టీలు తమ ప్రభావాన్ని పెంచుకున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో బిజెపి రాజకీయ పట్టు సాధించడానికి సహకార రంగాన్ని సాధనంగా చేసుకోవాలన్న ఎత్తుగడను అమలు చేయడానికే ఈ ఎంఎస్‌సిఎస్ తీసుకొచ్చారన్నది విశ్లేషకుల అంచనా. ఇప్పటికే గుజరాత్ వారి వశమైంది. మహారాష్ట్ర, కర్ణాటకల్లో ప్రయత్నిస్తున్నా అక్కడి ప్రతిపక్షాల పట్టు నుండి తప్పించలేకపోతున్నారు. కేరళలో అది అసాధ్యంగా ఉంది. అందుకనే సహకారాన్ని కేంద్రం పరిధికి తీసుకొచ్చే ఈ కొత్త యత్నం.

బహుళ రాష్ట్ర సహకార సంఘాల (సవరణ) బిల్లు, 2022 ను లోక్‌సభలో గతేడాది డిసెంబర్ 7న ప్రవేశపెట్టారు. రానున్న బడ్జెట్ సెషన్ రెండో భాగంలో జాయింట్ పార్లమెంటరీ కమిటీ నివేదికను ప్రవేశపెట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఏదైనా సహకార సంఘం ప్రస్తుతం ఉనికిలో ఉన్న ఎంఎస్‌సిఎస్‌లో కలిసేలా ఈ బిల్లు అవకాశం కల్పిస్తుంది. తద్వారా కొన్ని సహకార సంఘాలను ఎంఎస్‌సిఎస్ పరిధిలోకి తీసుకొస్తారు. అలాగే సహకార ఎన్నికల యంత్రాంగాన్ని కూడా కేంద్రం ఏర్పాటు చేస్తుంది. ఆ విధంగా ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వాల అజమాయిషీలోనున్న సహకార వ్యవస్థ కేంద్రం పరిధికి క్రమంగా పోతుందన్నమాట. ఇది రాష్ట్రాల అధికారాల్లో కేంద్రం జోక్యం చేసుకోవడమే. 'ఒకే దేశం- ఒకే భాష', 'ఒకే దేశం- ఒకే పన్ను' లాగే 'ఒకే దేశం- ఒకే రిజిస్ట్రేషన్' విధానాన్ని తీసుకురావాలని యోచిస్తోంది. అంటే ఇది మరో జిఎస్‌టి లాంటిదే! సహకార రంగం అనేది రాష్ట్ర జాబితాలో ఉన్న అంశమైనప్పటికీ కేంద్రం రాష్ట్రాలను కనీసం సంప్రదించకుండా సమాఖ్య స్ఫూర్తికి, రాజ్యాంగ సూత్రాలకు విరుద్ధంగా కేంద్ర మంత్రి రాష్ట్రాల సహకార శాఖ కార్యదర్శులకు, సొసైటీల రిజిస్ట్రార్లకు నేరుగా ఆదేశాలు జారీ చేయడం నిరంకుశత్వానికి నిదర్శనం.


బహుళ రాష్ట్ర సహకార సంఘాలు ఇతర విధులతో పాటు నిధులను సేకరించేందుకు, వడ్డీ రేట్లను స్వతంత్రంగా నిర్ణయించడానికి అధికారం కలిగి ఉంటాయి. ఏ ఒక్క రాష్ట్ర ప్రభుత్వం లేదా సహకార విభాగం ఇలాంటి సొసైటీలను నియంత్రించలేవు కనుక అవి తప్పుడు నిర్వహణకు దారి తీయవచ్చు. అటువంటి పరిస్థితి ఏర్పడితే ప్రజలు తమ కష్టార్జితాన్ని కోల్పోతారు. మరోవైపు అవి పోటీ వ్యవస్థగా మారవచ్చు. వివిధ రాష్ట్రాల్లో ప్రజల భాగస్వామ్యంతో సమర్థవంతంగా నడుస్తున్న సహకార వ్యవస్థను దెబ్బ తీయాలని, అక్కడ తన రాజకీయ ప్రయోజనాలు నెరవేర్చుకోవాలని చూస్తున్న కేంద్రం కుట్రను తిప్పికొట్టాలి. సహకార రంగాన్ని, ఫెడరల్ స్ఫూర్తిని కాపాడుకోవాలి.

మహనీయుల మాట



నేను మట్టిగావడం కంటే బూడిదగావడానికే ఇష్టపడతానను. కుళ్లి కృశించి నశించడానికి బదులు నాలోని ప్రతి అణువూ భగభగ మండే మంటల్లో ఆహుతి అవ్వాలనుకుంటాను. మందకొడిగా, ఒక శాశ్వత గ్రహంగా వుండడం కంటే దేదీప్యమానంగా వెలిగి పతనమయ్యే అద్భుతమైన ఉల్కగా మారాలనుకుంటాను. మనిషన్నవాడు జీవించాలి. బతుకీడ్చడం కాదు.

- జాక్ లండన్,
అమెరికన్ రచయిత,
సామాజిక కార్యకర్త.



'మోదానీ' సినిమాలో ఒక రైల్వే పోర్టర్ సంచలనం!

విశ్లేషణ

సత్య



అదానీ కంపెనీ అక్రమాలంటూ హిండెన్‌బర్గ్ వెల్లడించిన నివేదిక, దానిమీద తలెత్తిన ప్రశ్నలకు విదేశీ మదుపుదార్లకు, స్వంత పార్లమెంటుకు నరేంద్రమోడీ సమాధానం చెప్పాలంటూ ప్రపంచ మదుపుదారు జార్జి సోరస్ ఒక అంతర్జాతీయ వేదిక మీద చేసిన వ్యాఖ్య సంచలనం కలిగించింది. ఆ సభలో ప్రపంచదేశాల ప్రతినిధులందరూ ఉన్నారు. చిత్రం ఏమంటే బిబిసి డాక్యుమెంటరీ గురించి స్పందించాల్సిందేమీ లేదని విదేశాంగశాఖ ప్రతినిధి చెప్పారు. సామాజిక మాధ్యమంలో వాటిని చూడకుండా లింకుల మీద నిషేధం విధించి తొలగించారు. హిండెన్‌బర్గ్ మీద అసలు నోరెత్తటానికే సిద్ధపడలేదు. జార్జి సోరస్ ప్రకటన మీద మాత్రం... బిజెపి మంత్రులు, నేతలు స్పందిస్తున్నారు.

లాహిరి లాహిరి లాహిరిలో...ఓహో జగమే ఊగెనుగా ఊగెనుగా... అంటూ సాగిపోతున్న నరేంద్ర మోడీ నౌకకు నెల రోజుల్లో మూడు కుదుపులు. అదానీకి నాలుగు. అదానీ మాయలోకం సినిమా విడుదలై త్వరలో మాసోత్సవం జరుపుకోనుంది. కంపెనీల వాటాల ధరలనే కాదు, వికీపీడియా సమాచారాన్ని కూడా స్వంత మనుషులతో అనుకూలంగా మలుచుకున్నట్లు తాజాగా తేలింది. వికీపీడియా నడిపే సైన్ పోస్ట్ అనే పత్రిక అదానీ కిరాయి రాతగాళ్ల బండారాన్ని ఫిబ్రవరి 20వ తేదీన వెల్లడించింది. అనూహ్యమైన ఈ పరిణామాలు ప్రధాని నరేంద్రమోడీ, బిజెపిని ఇరకాటంలోకి నెట్టాయి. అర్ధంగాని అంశం ఏమంటే మొదటి మూడింటిని తప్పుడు ప్రచారం, ఆధారం లేని, పథకం ప్రకారం దేశం మీద, ప్రజాస్వామ్యం మీద దాడిగా, నరేంద్ర మోడీ సర్కార్‌ను దెబ్బతీసేవిగా చిత్రిస్తూ పెద్ద ఎత్తున ప్రచారం సాగుతోంది. వికీపీడియా వెల్లడించిన అక్రమంతో తమకు సంబంధం లేదని తప్పించుకుంటారో ఏం చేస్తారో చూడాలి. వికీపీడియాలో అదానీ కంపెనీలు, కుటుంబానికి చెందిన వివరాలను దొంగ పేర్లతో అదానీ కంపెనీ సిబ్బంది, కిరాయి సంపాదకులు అదానీకి అనుకూలగా పోస్టులను దిద్దినట్లు తేలింది. సోషల్ మీడియాలో ఇలాంటి ఖాతాలను కోకొల్లలుగా తెరిచి కొందరు నరేంద్ర మోడీ గొప్పతనాన్ని పొగిడితే మరికొందరు ఇతర పార్టీల నేతల మీద తప్పుడు ప్రచారాలకు దిగుతున్న సంగతి తెలిసిందే.

గుజరాత్ మారణకాండ మీద బిబిసి నిర్మించిన రెండు భాగాల డాక్యుమెంటరీ వివాదం ఇంకా సద్దుమణగలేదు. అదానీ కంపెనీ అక్రమాలంటూ హిండెన్‌బర్గ్ వెల్లడించిన నివేదిక, దానిమీద తలెత్తిన ప్రశ్నలకు విదేశీ మదుపుదార్లకు, స్వంత పార్లమెంటుకు నరేంద్రమోడీ సమాధానం చెప్పాలంటూ ప్రపంచ మదుపుదారు జార్జి సోరస్ ఒక అంతర్జాతీయ వేదిక మీద చేసిన వ్యాఖ్య సంచలనం కలిగించింది. ఆ సభలో ప్రపంచదేశాల ప్రతినిధులందరూ ఉన్నారు. చిత్రం ఏమంటే బిబిసి డాక్యుమెంటరీ గురించి స్పందించాల్సిందేమీ లేదని విదేశాంగశాఖ ప్రతినిధి చెప్పారు. సామాజిక మాధ్యమంలో వాటిని చూడకుండా లింకుల మీద నిషేధం విధించి తొలగించారు. హిండెన్‌బర్గ్ మీద అసలు నోరెత్తటానికే సిద్ధపడలేదు. జార్జి సోరస్ ప్రకటన మీద మాత్రం అసలు ఎవడీ సోరస్, ఈ ముసలోడికి అంత ధైర్యం ఎక్కడి నుంచి వచ్చింది, సమాధానం చెప్పాలని నరేంద్రమోడీనే అడుగుతాడా అన్నట్లుగా బిజెపి మంత్రులు, నేతలు స్పందిస్తున్నారు. జనవరి 25 నుంచి అదానీ కంపెనీల వాటాల విలువ పడిపోతూనే ఉంది. అధిక ధరల్లో వాటాలు కొనుగోలు చేసిన వారు ఎంత సొమ్ము పోగొట్టుకున్నారు అన్నది ఇంకా స్పష్టంగా చెప్పలేము. ఇది రాసినపుడు ఆ మొత్తం రూ. 11 లక్షల కోట్లని వార్త. మొత్తంగా చూసిన కంపెనీల వాటాల విలువ సగానికి సగం పతనమైంది. దీంతో కంపెనీల మార్కెట్ విలువ 120 బిలియన్ డాలర్ల వరకు పతనమైనట్లు ఇండియా టుడే ఫిబ్రవరి 20న తెలిపింది. ఒక్కో సంస్థ ఒక్కో పద్ధతిలో ఈ అంకెలను చెబుతున్నాయి. గతంలో గరిష్ట విలువ 147 బి.డాలర్లు కాగా ఇప్పుడు 47.9 బి.డాలర్లకు తగ్గినట్లు ఫోర్బ్స్ చెప్పగా 49.1 బి.డాలర్లని బ్లూమ్ బెర్గ్ పేర్కొన్నది. జనవరి 20న అదానీ టోటల్ గ్యాస్ కంపెనీ వాటా ధర రూ. 3,618 ఉండగా నెల తరువాత రూ. 922కు తగ్గింది.

ఐరోపా లోని మ్యూనిచ్ నగరంలో జరిగిన సమావేశంలో జార్జి సోరస్ మాట్లాడుతూ అదానీపై తలెత్తిన ప్రశ్నలకు మోడీ సమాధానం చెప్పాలని అన్నాడు. నలభై రెండు నిమిషాల పాటు చేసిన ప్రసంగంలో అదానీ-మోడీ బంధంతో పాటు ఇతర అనేక అంశాలను ప్రస్తావించాడు. "మోడీ, వాణిజ్య దిగ్గజం అదానీ సన్నిహితులు. వారి విధి విడదీయ లేనిది. వాటాలను తిమ్మిని బమ్మిని చేసినట్లు అదానీ మీద ఆరోపణలు రావటంతో అవి పేకమేడల్లా కుప్పకూలాయి. మోడీ దీని మీద మౌనంగా ఉన్నారు. కానీ ఆయన విదేశీ మదుపుదార్లకు, పార్లమెంటుకు సమాధానం చెప్పాలి. ఈ పరిణామంతో భారత కేంద్ర ప్రభుత్వం మీద నరేంద్ర మోడీకి ఉన్న గట్టి పట్టు గణనీయంగా బలహీనపడుతుంది. సంస్థాపరమైన సంస్కరణలకు ద్వారాలను తెరుస్తుంది. నేను అమాయకుడిని కావచ్చు, కానీ భారత్‌లో ప్రజాస్వామ్య పునరుద్ధరణ జరుగుతుందని భావిస్తున్నా" అన్నాడు. ప్రపంచ ఆధిపత్యం కోసం రెండు రకాల పాలనా వ్యవస్థలు పోటీ పడుతున్నాయి. గుట్టుగా ఉండే దేశాల కంటే బహిరంగ మైనవి నైతికంగా ఉన్నతంగా ఉంటాయని వాటి మధ్య తేడాలను వివరిస్తూ భారత్ ఒక ఆసక్తి కలిగించే అంశమన్నాడు. అది ప్రజాస్వామికమే గాని దాని నేత నరేంద్రమోడీ ప్రజాస్వామికవాది కాదన్నాడు. భారత్ 'క్వాడ్' సభ్యురాలు, అదే సమయంలో రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకొని సొమ్ము చేసుకుంటున్నది అన్నాడు. ఈ మాటలు బిజెపి నేతలకు ఆగ్రహం తెప్పించాయి. కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ అగ్గి మీద గుగ్గిలం మాదిరి మండిపడ్డారు. ఇది నరేంద్ర మోడీ మీదనే కాదు భారత ప్రజాస్వామిక వ్యవస్థ మీద కూడా దాడి అంటూ దీన్ని అందరూ ఏక కంఠంతో ఖండించాలని అన్నారు. అదానీ లేదా అతని కంపెనీల గురించి దేశంలో గగ్గోలు ఏర్పడితే పార్లమెంటులో చేసిన ప్రసంగంలో నరేంద్ర మోడీ ఒక్కసారి కూడా ఆ ప్రస్తావన లేకుండా మాట్లాడిన సంగతి తెలిసిందే. అలాంటి నేత గురించి అందరూ కలసి ఖండించాలని చెప్పటానికి ఎవరికైనా నోరెలా వస్తుంది?. అదానీ కంపెనీల వాస్తవాల నిర్ధారణకు పార్లమెంటరీ కమిటీని మాత్రమే వేయాలని ప్రతిపక్షాలు కోరాయి. దానికి కూడా నోరు రాలేదు.

భారత్‌తో సహా ప్రపంచంలోని ప్రజాస్వామిక వ్యవస్థలలో జోక్యం చేసుకొనేందుకు జార్జి సోరస్ ఒక బిలియన్ డాలర్లు పక్కన పెట్టాడని (మన కరెన్సీలో రూ.8,200 కోట్లు), మన దేశంలో తాను ఎంపిక చేసిన వారు ప్రభుత్వ నేతలుగా ఉండాలని కోరుకున్నట్లు స్మృతి ఇరానీ ఆరోపించారు. ఆమె చెప్పినట్లు ఆ మొత్తాన్ని ఒకవేళ ఇక్కడే ఖర్చు చేసినప్పటికీ కుప్పకూలేంత బలహీనంగా మోడీ సర్కార్ ఉన్నదా ? అంత మొత్తానికి బిజెపి ఎంపీలందరూ అమ్ముడుపోతారా ? కేంద్ర సమాచార, ప్రసార శాఖ సలహాదారు కాంచన్ గుప్తా దీని గురించి స్పందిస్తూ పాలకుల మార్పు కావాలని కోరుతున్న శక్తుల వెనుక ఉన్నదెవరో తేలిపోయిందన్నారు. వారికి జార్జి సోరస్ నడిపే ఓపెన్ సొసైటీ ఫౌండేషన్ నుంచి నిధులు అందచేస్తున్నట్లు ఆరోపించారు. భారత్‌కు అనేక మంది శత్రువులుండగా వారందరినీ సోరస్ నడిపిస్తున్నాడని ఆరోపించారు. భారత్‌లో ప్రజాస్వామ్యం బలంగా ఉందని, 2024 ఇంకా ఎంతో దూరం లేదని మరోసారి ఆశాభంగం చెందక తప్పదని అన్నారు. మోడీ గురించి సోరస్ చేసిన వ్యాఖ్యలపై మన విదేశాంగశాఖ మంత్రి ఎస్.జైశంకర్ స్పందిస్తూ ఒక ముసలోడు, ధనికుడు, మొండిమనిషి న్యూయార్క్‌లో కూర్చొని ప్రపంచమంతా ఇంకా తాను చెప్పినట్లు నడుస్తున్నదని అనుకుంటున్న మనిషి అన్నారు. అతని గురించి మరోవిధంగా చెప్పాలంటే ప్రమాదకారి కూడా అన్నారు. తాను అభిమానించిన వారు గెలిస్తే సోరస్ వంటి వారికి అది మంచిది. లేకపోతే ప్రజాస్వామ్యం లోపభూయిష్టమంటాడు అన్నారు. రైతుల ఆందోళన, సిఎఎ, ఎన్ఆర్‌సి లపై సాగిన ఆందోళనల వెనుక సోరస్ హస్తం ఉన్నట్లు బిజెపి ప్రచారం చేసిన సంగతి తెలిసిందే.

తొంభై రెండు సంవత్సరాల జార్జి సోరస్ గురించి ఆరోపణలు కొత్తవేమీ కాదు, అవి నరేంద్రమోడీతో ప్రారంభం కాలేదు. ఎక్కడా ఏ దేశమూ అతని మీద ఉన్న ఆరోపణలను విచారించి రుజువు చేసి జైల్లో పెట్టలేదు. ఇప్పుడు బిజెపి నేతల ఆయాసపడటం తప్ప చేసేదేమీ లేదు. తాను నివశిస్తున్న అమెరికా అధినేతల గురించే బహిరంగంగా సవాలు చేశాడు. 2003 నవంబరు 11వ తేదీ వాషింగ్టన్ పోస్టు పత్రిక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ తన జీవిత కేంద్రీకరణ అధ్యక్షుడు జార్జి డబ్ల్యు బుష్‌ను పదవి నుంచి తొలగించటమని, అది తనకు జీవన్మరణ సమస్య అన్నారు. బుష్‌ను ఓడిస్తానని ఎవరైనా హామీ ఇస్తే తన దగ్గర ఉన్న సంపదనంతా ఇస్తానని కూడా చెప్పాడు. మరుసటి ఏడాది జరిగిన ఎన్నికల్లో బుష్ ఓటమి కోసం డెమోక్రటిక్ పార్టీకి సోరస్ వివిధ సంస్థల పేరుతో రెండున్నర కోట్ల డాలర్ల మేర విరాళం కూడా ఇచ్చాడు. పెద్ద ఎత్తున ప్రచారం కూడా చేశాడు. సంపాదించినదాన్లో వెనకేసిందానికన్నా దాన ధర్మాలకే ఎక్కువ ఇచ్చాడు. అతను కూడా షార్ట్ సెల్లింగ్ పద్ధతుల్లో లాభాలు గడించిన స్టాక్ మార్కెట్ జూదగాడే. ఆ జూదాన్ని చట్టపరంగానే అన్ని దేశాలూ అనుమతిస్తున్నాయి.

హంగరీలో నాజీ మూకల దాడి నుంచి మారుపేర్లతో తప్పించుకున్న యూదు కుటుంబాలలో సోరస్‌ది ఒకటి. నాజీలతో చేతులు కలిపాడనే విమర్శలకు కూడా అతని మీద ఉన్నాయి. బుడాపెస్ట్‌లో 1930లో జన్మించిన సోరస్ రెండవ ప్రపంచ యుద్ధం తరువాత లండన్ చేరుకున్నాడు. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్‌లో చదువు కొనేందుకు కొంతకాలం రైల్వే కూలీగా, కొంత కాలం హోటళ్లలో సర్వర్‌గా పని చేశాడు (నరేంద్ర మోడీ రైల్వే స్టేషన్లో టీ అమ్మినట్లు ప్రచారం చేశారు గానీ దానికి ఎక్కడా రుజువుల్లేవు.). 1956లో అమెరికా చేరుకొని అక్కడ సంపాదన ప్రారంభించాడు. అనేక దేశాల్లో అనేక మందికి గిట్టని పనులు చేసి ప్రమాకరమైన మనిషిగా పేరు తెచ్చుకున్నాడు. పచ్చి మితవాద శక్తులను కూడా భయపెట్టే మనిషి అని 2019లో బిబిసి వర్ణించింది. డోనాల్డ్ ట్రంప్ అంటే అసలు పడదు. ట్రంప్-మోడీ జిగినీ దోస్తులు కనుక జార్జి సోరస్ చేసిన విమర్శలు, ప్రశ్నలు సహజంగానే మోడీ భక్తగణాన్ని కూడా భయపెట్టి ఉండాలి. సోరస్ వివాదాస్పద నేపథ్యం కారణంగా నరేంద్ర మోడీ, అదానీ మీద అతని విమర్శలను కొట్టివేస్తే కుదరదు. వివిధ సంస్థల్లో పెట్టుబడులు పెట్టటం, అవి లాభాల బాటలో ఉన్నపుడు వాటినుంచి తప్పుకోవటం, షార్ట్ సెల్లింగ్ వంటి పనులకు సోరస్ పాల్పడతాడు. గతంలో లండన్ బ్యాంకు షేర్లు, అలాగే షార్ట్ సెల్లింగ్ చేసి వాటాల ధరలు పతనం కాగానే పెద్ద ఎత్తున కొని లబ్ధి పొందాడు. గొర్రెల గోత్రాలు కాపరులకు ఎరుక అన్నట్లు నడమంత్రంగా దూసుకు వచ్చిన కంపెనీల వెనుక ఏం జరిగేదీ అతనికి తెలిసినంతగా మరొకరికి తెలియదంటే అతిశయోక్తి కాదు. అనేక దేశాలు అతన్ని నిషేధించాయి. సోరస్‌కు అనేక ప్రభుత్వాల్లో కీలకమైన చోట్ల ఉప్పందించేవారు ఉన్నారు. 1992లో బ్రిటన్ ప్రభుత్వం పౌండ్ విలువను తగ్గించాలని తలపెట్టింది. దాన్ని పసిగట్టిన సోరస్ అప్పులు చేసి మరీ పెద్ద మొత్తంలో పౌండ్లను సేకరించి వాటిని మార్కెట్లో విక్రయించాడు. ఆ లావాదేవీల్లో వందకోట్ల డాలర్ల మేర లబ్ధి పొందాడు. తన కంపెనీలు అక్రమాలకు పాల్పడలేదనే ప్రచారం చేసేందుకు అదానీ ఒక అమెరికా కంపెనీని ఆశ్రయించినట్లు వార్తలు.దానికి ఉన్న విశ్వసనీయత ఏమిటి ? ఒక జాతీయ వాదిని, దేశభక్తుడిని అని చెప్పుకున్న పెద్దమనిషి విదేశీ కంపెనీల కోసం ఎందుకు ఆరాటపడుతున్నట్లు ? నెల రోజులు కావస్తున్నా రోజురోజుకూ అదానీ కంపెనీల వాటాల ధర పతనమవుతూనే వుంది తప్ప ఆగలేదు. అంతా బాగుంది అని చెప్పిన దానిని ఎవరూ నమ్మటం లేదు. ప్రస్తుతం ట్రెండింగ్‌గా ఉన్న మోదాని (మోడీ + అదానీ = మోదాని) సినిమాలో జార్జి సోరస్ సంచలన ప్రవేశం. ఆ సినిమా చివరకు ఏమౌతుంది. అదానీ అక్రమాల చిట్టా రాజకీయంగా నరేంద్రమోడీ మెడకు చుట్టుకుంటుందా?


★

జి.యం ఆవాలు: కంపెనీలకు కాసులు - రైతుకు కన్నీరు

సమస్య


జన్యుమార్పిడి ఆవాలను (జి.యం మస్టర్డ్) ప్రవేశపెట్టటానికి ప్రభుత్వం రంగం సిద్ధంచేసింది. కేంద్ర పర్యావరణ శాఖ కింద పని చేసే జెనిటెక్ ఇంజనీరింగ్ మదింపు కమిటీ జన్యుపరంగా మార్పు చేసిన బి.టి ఆవాలకు 2022 అక్టోబర్ 25న అనుమతించింది. భారతదేశ శాస్త్రవేత్త దీపక్ పెంటేల్ ప్రభుత్వ నిధుల సహాయంతో 'ధారా మస్టర్డ్ హైబ్రిడ్-డిఎంహెచ్-11' విత్తనాలను అభివృద్ధి చేశారు. వీటిని బహిరంగంగా పొలాలలో ప్రయోగాత్మకంగా సాగు చేయటానికి, ప్రదర్శనకు, విత్తనాల ఉత్పత్తికి అనుమతించారు.

జన్యుపరంగా మార్పు చెందిన ఆవాల పంట మన దేశంలో తేనె ఉత్పత్తిని ప్రభావితం చేస్తుందని జన్యుమార్పిడి పంటలో వచ్చిన తేనెను విదేశాలు కొనవనీ, విదేశీ మారకద్రవ్యం రాదనీ గ్లూఫోసినేట్ హెర్బిసైడ్ కలుపు మందు ఆవ పంటలో వాడితే, ఎవరూ కొననందున తమ బతుకులు బజారున పడతాయని తేనె సాగుదారులు ఆందోళనకు దిగారు. రైతులు 150,000 టన్నుల తేనెను తీసి విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. ఇది మనకు రూ.75,000 కోట్లు ఆర్జించే తేనె ఎగుమతులపై ప్రభావం చూపుతుంది. జి.యం ఆవాలతో తేనెటీగ జనాభా నశిస్తుంది. నేడు, తేనెటీగల రైతులు ఆధారపడిన ఏకైక సహజ పంట ఆవాలు.



డా॥ కొల్లా రాజమోహన్

ప్రజాప్రయోజనాల దృష్ట్యా సామాజిక కార్యకర్తలు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ జన్యుమార్పిడి పంటల సమస్యను పరిశీలించేందుకు సుప్రీంకోర్టు సాంకేతిక నిపుణుల కమిటీని ఏర్పాటు చేసిన విషయాన్ని కోర్టుకి గుర్తు చేశారు. సుప్రీంకోర్టు సాంకేతిక నిపుణుల కమిటీ (2013), జన్యు మార్పిడి పంటలను పరిశీలించిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీల నివేదికలు ఏకగ్రీవంగా జన్యుమార్పిడి పంటలపై పూర్తి నిషేధాన్ని సిఫార్సు చేశాయి. మానవ ఆరోగ్యం, జంతు ఆరోగ్యం, జీవ వైవిధ్యంపై దీర్ఘకాలిక ప్రభావం గురించి ఎటువంటి అధ్యయనాలు నిర్వహించనందున హెర్బిసైడ్ (కలుపు మందులు) వాడే పంటలపై పూర్తి నిషేధాన్ని విధించాలని సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన కమిటీ సిఫార్సు చేసిందని కోర్టుకు గుర్తుచేశారు. జన్యుమార్పిడి పంటలపై స్వతంత్ర అధ్యయనం చేయకుండా స్వంత ఆర్థిక ప్రయోజనాలున్న కంపెనీలే ప్రయోగాలు, అధ్యయనాలు చేయటం, ఆ రిపోర్టులపై ఆధారపడి పర్యావరణ అనుమతులివ్వడం తగదని ప్రశాంత్ భూషణ్ నివేదించారు. జన్యుమార్పిడి ఆవాల విత్తనాలపై యథాస్థితిని కొనసాగించాలని కేంద్రాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది.



ఆహారంలో జన్యుమార్పిడి పదార్థాలను ప్రవేశపెట్టే ముందు అందరికీ తెలిసేటట్లుగా క్షేత్ర ప్రయోగాలు భారీ ఎత్తున పారదర్శకంగా జరగాలి. కానీ జరగలేదు. తేనెటీగలు, తేనెపై బతికే వారి సమస్యలే కాకుండా ఆవాలు తిన్నందువలన, ఆవ నూనె వాడినందువలన మనుషులపై, తాగే నీటిపై, పశు వులపై, భూమిపై, పర్యావరణంపై ప్రభావం ఏమిటో తెలుసుకునేందుకు తాత్కాలిక, దీర్ఘకాలిక పరిశోధనలు జరగాలి. ఆహార భద్రత అంశాన్ని శాస్త్రీయంగా పరిశోధనలతో నిర్ణయించాలి. అలాంటిది రాజకీయ ప్రయోజనాలను, వ్యాపార ప్రయోజనాలను, విదేశీ పెట్టుబడులను దృష్టిలో పెట్టుకుని అగ్ర రాజ్యాల ఒత్తిడికి లొంగి నిర్ణయం చేయటమంటే మన దేశ స్వతంత్ర్యాన్ని అమ్ముకోవటమే.

ఆహారంలో జన్యుమార్పిడి పదార్థాలను ప్రవేశపెట్టే ముందు అందరికీ తెలిసేటట్లుగా క్షేత్ర ప్రయోగాలు భారీ ఎత్తున పారదర్శకంగా జరగాలి. కానీ జరగలేదు. తేనెటీగలు, తేనెపై బతికే వారి సమస్యలే కాకుండా ఆవాలు తిన్నందువలన, ఆవ నూనె వాడినందువలన మనుషులపై, తాగే నీటిపై, పశువులపై, భూమిపై, పర్యావరణంపై ప్రభావం ఏమిటో తెలుసుకునేందుకు తాత్కాలిక, దీర్ఘకాలిక పరిశోధనలు జరగాలి. ఆహార భద్రత అంశాన్ని శాస్త్రీయంగా పరిశోధనలతో నిర్ణయించాలి. అలాంటిది రాజకీయ ప్రయోజనాలను, వ్యాపార ప్రయోజనాలను, విదేశీ పెట్టుబడులను దృష్టిలో పెట్టుకుని అగ్ర రాజ్యాల ఒత్తిడికి లొంగి నిర్ణయం చేయటమంటే మన దేశ స్వాతంత్ర్యాన్ని అమ్ముకోవటమే. కలుపు నివారణ మందులను, జన్యుమార్పిడి హైబ్రిడ్ విత్తనాలను అమ్ముకోవాలనీ, లాభాలను దండుకోవాలనీ కంపెనీలు తహతహలాడుతున్నాయి. ఒక పక్క ప్రకృతి వ్యవసాయానికి ప్రోత్సాహం అంటూ ప్రచారం చేస్తూ మరోపక్క భూమిని, భూసారాన్ని, ప్రజారోగ్యాన్ని నాశనం చేసే జన్యుమార్పిడి పంటలకు, కలుపు మందుల పంటలకు అనుమతులనిస్తున్నది. భూమికి, ప్రజల ఆరోగ్యానికి ప్రమాదమన్న రుజువుల కారణంగా గ్లైఫోసేట్ కలుపు నివారణ మందులను నిషేధించక తప్పలేదు. ప్రభుత్వ వైఫల్యం వలన ప్రమాదకరమైన నిషేధిత మందులు కూడా మార్కెట్లో అమ్ముతున్నారు. కలుపు మందులు అమ్ముకోవటానికి వీలుగా విత్తనాలనే జన్యుమార్పిడి చేశారు. కలుపు మందులతో భూమికి, మనిషికి, పశువులకు, వాతావరణానికి ప్రమాదమని నిర్ధారించి నిషేధించారు. మరోపక్క హెర్బిసైడ్ టాలరెంట్ జన్యుమార్పిడి ఆవాల పంటలకు అనుమతించి హెర్బిసైడ్ కలుపు నివారణ మందులను యథేచ్ఛగా వాడుకోమంటున్నారు. బిజెపి ఎన్నికల ప్రణాళికలలో ఆహారంలో జన్యుమార్పిడి పంటలను, హెర్బిసైడ్ కలుపు నివారణ మందులకు అనుమతులు ఇవ్వమన్నారు. ఆచరణలో జన్యుమార్పిడి పంటలకు హెర్బిసైడ్ కలుపు నివారణ మందుల వ్యాపార కంపెనీలకు స్వేచ్ఛనిచ్చి ప్రజలను మోసంచేస్తున్నారు.

జన్యుమార్పిడి పంటలతో పాటుగా, హెర్బిసైడ్స్ వాడకం వలనభూమి నాశనమవటం వలన ఏ మందులకూ లొంగని "సూపర్ వీడ్స్" వృద్ధి చెందుతున్నాయి. ఇంకా ఎక్కువగా పురుగు మందులు వాడాల్సిన అవసరం పెరిగి భూమి, పర్యావరణం మరింతగా నాశనమై...క్యాన్సర్ లాంటి జబ్బులతో మానవుని మనుగడ ప్రశ్నార్థకమౌతుంది. జన్యుమార్పిడి ఆవాల పంటవలన ఆవాల దిగుబడి పెరిగి ఆవనూనె దిగుమతులను తగ్గించవచ్చనీ, విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేయవచ్చనీ ప్రభుత్వం అసత్య ప్రచారం చేస్తోంది. ఎన్‌డిడిబి-డిఎంహెచ్-1 సాంప్రదాయ విత్తనంతో 2924 కేజీల దిగుబడిని, ఎన్‌డిడిబి-డిఎంహెచ్-4 సాంప్రదాయ విత్తనంతో 3012 కేజీల దిగుబడిని సాధించారు. ప్రభుత్వం ఆర్భాటంగా ప్రచారం చేస్తున్న జన్యుమార్పిడి హెర్బిసైడ్ టాలరెంటు విత్తనం జి.ఎం ఆవాల వలన 2626 కేజీల దిగుబడి మాత్రమే వచ్చింది. అదేమంటే మీరు సైన్సుకు వ్యతిరేకం అని దబాయిస్తున్నారు.

ఆవనూనెను దక్షిణ భారతదేశంలో వాడరు. ఆవ నూనెను ఉత్తర భారతదేశంలో విరివిగా వాడతారు. విస్తారంగా పండిస్తారు. మన దేశంలో వంటనూనెల ఉత్పత్తిలో 40 శాతం ఆవనూనెదే. ఆవపంటను 80 లక్షల ఎకరాలలో 60 లక్షల మంది రైతులు సాగు చేస్తున్నారు. 1993-1994 లోనే, ఆవనూనెలో స్వయం సమృద్ధిని సాధించారు. విదేశాల నుండి దిగుమతి చేస్తున్న పామాయిల్, సన్‌ఫ్లవర్ వంటనూనెలకు దిగుమతి సుంకాలను తగ్గించి సింగపూర్, ఇండోనేషియా, ఉక్రెయిన్ ప్రభుత్వాలకు సహాయం చేస్తున్నారు. మన దేశంలోని పామాయిల్, వేరుశనగ, నువ్వుల నూనె, కొబ్బరినూనె రైతులకు కనీస మద్దతు ధరకు చట్టపరమైన గ్యారంటీ లేదు. లాభసాటి ధర, గిట్టుబాటు ధరల మాటే లేదు. ప్రకృతి వైపరీత్యాలలో రైతుకు దిక్కే లేదు. 2022 సంవత్సరానికి రైతు ఆదాయం రెట్టింపు చేస్తామన్న వాగ్దానాన్ని మరిచారు.

యూరప్ దేశాలు జి.ఎం పంటలను గట్టిగా వ్యతిరేకించాయి. యూరప్ ప్రజలు తినని ఆహారం మనం ఎందుకు తినాలో ప్రభుత్వం చెప్పాలి. తినే ఆహారంలో విషతుల్యమైన జన్యుమార్పిడి పదార్థాలు వున్నాయేమోనని అమెరికా ప్రజలు అనుమానిస్తున్నారు. ఆహార పదార్థాలపై జి.యం లేబుళ్ల అతికించమని ప్రజలు ఆందోళన చేస్తున్నారు. శక్తివంతమైన విత్తన సంస్థల ఒత్తిడికి లొంగి మాన్సాంటో, బేయర్స్ కంపెనీలకు అనుమతులు, పేటెంట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. మన దేశంలో జన్యుమార్పిడి పంటలను, ఆహారాన్ని అనుమతించబోమని ఎన్నికల ప్రణాళికలో స్పష్టంగా చెప్పిన బీజేపీ, అధికారంలోకి వచ్చిన తర్వాత పంథా మార్చుకుంది. బహుళజాతి సంస్థల ఒత్తిడికి ప్రభుత్వం లొంగిపోయింది. విత్తన కార్పొరేట్ కంపెనీలు ధారా మస్టర్డ్ హైబ్రిడ్ డిఎంహెచ్-11 అమ్మకాలకు అనుమతులు పొందాయి.

అమెరికాలో "లైబిలిటీ లా" వుంది. పరిశోధనల ఫలితాలకు భిన్నంగా దుష్ట పరిణామాలు సంభవిస్తే ఎవరు బాధ్యులో నిర్ణయించి తగిన చర్యలు చేపడ్తారు. మన దేశంలో, మీకేమీ కాదన్న ప్రభుత్వం, దిగుబడులు పెరుగుతాయన్న కంపెనీలు, ఆరోగ్యానికి ఢోకా లేదన్న జిఇఎసి సభ్యులు, ప్రభుత్వం - ఎవరిదీ బాధ్యత?

వివిధ వాతావరణ పరిస్థితులున్న భారతదేశం జీవ వైవిధ్యానికి ప్రసిద్ధి చెందింది. వైవిధ్యమైన జన్యు వనరులున్నాయి. మన విత్తనోత్పత్తి చాలా శక్తివంతమైనది. మన రైతులు ప్రపంచంలోనే అతిపెద్ద విత్తనోత్పత్తిదారులు. జీవ వైవిధ్యం మన గొప్ప బలాలలో ఒకటి. అది నాశనం చేసి ఒకటే దేశం, ఒకటే విత్తనం, ఒక్కటే పంట అంటూ విశాల భూక్షేత్రాలలో మోనోక్రాప్‌తో కార్పొరేట్ స్థాయి వ్యవసాయం వైపు నడిపిస్తున్నారు.

ఇప్పటికే 86 శాతం మంది చిన్న రైతులు ఒత్తిడిలో ఉన్నారు. జి.ఎం టెక్నాలజీ పేరున కంపెనీలు దారుణంగా పెంచుతున్న రేట్లలో ఖరీదైన జి.యం విత్తనాలను కొనుగోలు చేయలేని స్థితిలో ఉన్నారు. పెరుగుతున్న ధరలతో ఎరువులను కొనలేరు. పెంచనున్న విద్యుత్ చార్జీలను భరించలేరు. అప్పులను కట్టలేరు. కనీల ధరకు చట్టపరమైన గ్యారంటీ లేదు. వారేం చేయాలి. వారి పరిస్థితి ఏంటి? ఢిల్లీ సరిహద్దులలో సంవత్సరం పైగా సాగిన రైతాంగ పోరాటమే రహదారి. అదే స్ఫూర్తితో మరింత శక్తివంతంగా సాగించే రైతాంగ పోరాటాలే వ్యవసాయ సమస్యలన్నిటికీ పరిష్కారం.

(వ్యాసకర్త సెల్ : 9000657799)

★



విశ్వభూషణ్‌కు ఆత్మీయ వీడ్కోలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
గన్నవరం విమానాశ్రయంలో బుధవారం ఉదయం..గవర్నరు విశ్వభూషణ్ హరిచందన్‌కు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆత్మీయ వీడ్కోలు పలికారు. పోలీసుల గౌరవ వందనాన్ని గవర్నరు స్వీకరించారు. ఛత్తీస్‌గఢ్ గవర్నరుగా బదిలీ అయిన విశ్వభూషణ్..మూడున్నరేళ్ల పాటు ఆంధ్రప్రదేశ్ గవర్నరుగా సేవలందించారు. ఆయన స్థానంలో ఈ నెల 24న రాష్ట్ర గవర్నరుగా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ అబ్దుల్ నజీర్ బాధ్యతలు స్వీకరించనున్నారు.

గన్నవరం విమానాశ్రయంలో వీడ్కోలు పలుకుతూ గవర్నర్ విశ్వభూషణ్‌కు పాదాభివందనం చేస్తున్న జగన్

సిఫార్సులకే సాగుపట్టా..!

- భూ పంపిణీలో సాగుదారులకు అన్యాయం
- ప్రజాప్రతినిధులు చెప్పిన వారికే పట్టాలు
- ఏళ్లతరబడి సాగులో ఉన్నా ప్రయోజనం శూన్యం

ప్రజాశక్తి-బొమ్మనహాల్ (అనంతపురం)
ఏళ్ల తరబడి సాగులో ఉన్న పేద రైతులు భూమి పట్టాల కోసం వేచి చూస్తున్నారు. ఎప్పుడో ఒకసారి పట్టా వస్తుందని గంపెడు ఆశతో ఉన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్నోసార్లు అర్జీలు ఇచ్చారు. అయినా నేటికీ వారికి సాగు పట్టాలు చేతికందలేదు. ఈ సారి ప్రభుత్వం నిర్వహిస్తున్న భూ పంపిణీలో అయినా తమకు న్యాయం జరుగుతుందని రైతులు అధికారులకు అర్జీలను ఇచ్చారు. అయితే ఇక్కడ కూడా సిఫార్సులకు అనుకూలంగా జరుగుతోందని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. అనంతపురం జిల్లా బొమ్మనహాల్ మండలంలో ప్రస్తుతం ఇదే పరిస్థితి ఉన్నట్లు తెలుస్తోంది. మండలంలోని 15 రెవెన్యూ గ్రామాల పరిధిలో భూ పంపిణీ మొదటి విడత పంపిణీకి శ్రీకారం చుట్టారు. ఎంపిక చేసిన గ్రామాల్లో భూములకు సంబంధించి సాగులో ఉన్న రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు ఇచ్చేలా అధికారులు రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. ఇక్కడే కొందరు ప్రజాప్రతినిధులు, అధికారులు అవినీతికి తెరలేపినట్లు తెలుస్తోంది. సాగుచేస్తున్న వారిని కాకుండా అనర్హులను జాబితాలో చేరుస్తున్నట్లు సమాచారం. ప్రజా ప్రతినిధులు, అధికార పార్టీ నేతలకు అవసరమైన వారి బంధువులు, స్నేహితుల నుంచి మాత్రమే అర్జీలను సేకరించి పట్టాలు ఇచ్చే కార్యక్రమానికి తెరలేపారు. ఏళ్ల తరబడి సాగులో ఉన్న అర్హులైన వారు పట్టాలు పొందాలన్నా సంబంధిత నాయకులు, అధికారులకు డబ్బులు చెల్లించక తప్పడం లేదని రైతులు వాపోతున్నారు. ఇలా ఒక్కో రైతు ద్వారా రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం.

బొమ్మనహాల్ మండల పరిధిలోని నేమకల్ గ్రామం 85 సర్వేనెంబర్‌లో 282 ఎకరాలు అసైన్డ్ భూమి ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ భూమి పంపిణీ నిమిత్తం రైతుల నుంచి 142 అర్జీలు వచ్చాయి. అర్జీలు ఇచ్చిన వారిలో భూమి సాగు చేస్తున్న రైతులు కేవలం 24 మంది మాత్రమే ఉన్నారు. మిగిలిన వారు ఎవరో కూడా తెలియని పరిస్థితి ఉంది. శ్రీధరఘట్ట గ్రామ సర్వేనెంబర్ 265లో 27 ఎకరాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. కళ్యాణదేవనహళ్లి గ్రామంలోనూ అసైన్డ్ భూమిని గుర్తించి దీని పంపిణీ నిమిత్తం ఉన్నతాధికారులకు నివేదిక పంపారు. మండల వ్యాప్తంగా సుమారు 5000 మంది చిన్న, సన్నకారు రైతులు సాగుభూమిలో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీరందరికీ పట్టాలు ఇవ్వాల్సిన అధికారులు వారి అర్జీలను పక్కన పెట్టి సిఫార్సులు, డబ్బులు ఇచ్చిన వారికే భూ పంపిణీలో పేర్లు చేరుస్తున్నట్లు తెలుస్తోంది. ఇదే పరిస్థితి మండలంలోని గోవిందవాడ, బొల్లనగుడ్డం, సింగానహళ్లి, బండూరు, ఆరేసముద్రం, కురువళ్లి, ఉద్దేహాల్, దర్గాహొన్నూరు గ్రామాల్లో ఉన్నట్లు తెలుస్తోంది. సాగుదారులకు అన్యాయం చేసే, అనర్హుల పేర్లను జాబితాలో చేర్చడంపై నిరసన వ్యక్తం అవుతోంది. ఉన్నతాధికారులు స్పందించి భూ పంపిణీ జాబితాపై సమగ్ర విచారణ జరిపి అనర్హులను తొలగించి, అర్హులకు న్యాయం చేసేలా చర్యలు తీసుకోవాలని మండల రైతులు కోరుతున్నారు.

సముద్రంలో మత్స్యకారుడు మృతి

ప్రజాశక్తి - పూసపాటిరేగ (విజయనగరం)
విజయనగరంలోని పూసపాటిరేగ మండలం చింతపల్లికి చెందిన బెవర మహేష్ (24) కర్ణాటక రాష్ట్రంలోని మంగళూరు సముద్రంలో వేటాడుతూ ప్రమాదవశాత్తు సముద్రంలో పడి మృతి చెందాడు. ఈ విషయమై తోటి వేటగాళ్లు బుధవారం కుటుంబీకులకు సమాచారం అందించారు. సముద్రంలో వేటాడుతుండగా ప్రమాదవశాత్తు సముద్రంలో పడి మృతి చెందడంతో తోటి వేటగాళ్లు అతని మృతదేహాన్ని ఒడ్డుకి చేర్చారు. మృతదేహాన్ని అక్కడే పోస్టుమార్టం నిర్వహించి స్వగ్రామం చింతపల్లికి గురువారం తరలిస్తారని మత్స్యకార నాయకులు బర్రి చిన్నప్పన్న తెలిపారు. విషయం తెలుసుకున్న మృతుని కుటుంబీకులు తీవ్రంగా రోదిస్తున్నారు.

సుస్థిర అభివృద్ధి సాధనకు పని చేయాలి

- ప్రతి అర్జీని నిర్ణీత గడువులో పరిష్కరించాలి
- రాష్ట్ర ప్రణాళికా కార్యదర్శి విజయ్ కుమార్

ప్రజాశక్తి-విజయనగరం
మానవాభివృద్ధికి సంబంధించిన సుస్థిర అభివృద్ధి సూచీల సాధన కోసం ప్రతి ఒక్కరూ మనసు పెట్టి పని చేయాలని రాష్ట్ర ప్రణాళికా కార్యదర్శి విజయ్ కుమార్ తెలిపారు. ఏ పని ఎవరి కోసం చేస్తున్నాం, ఎందుకోసం చేస్తున్నాం అని ఆత్మావలోకనం చేసుకోవాలని అన్నారు. బుధవారం కలెక్టరేట్ ఆడిటోరియం లో విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల అధికారులకు సుస్థిర అభివృద్ధి, స్పందన కార్యక్రమాలపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రణాళిక కార్యదర్శి విజయకుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో 17 సుస్థిర అభివృద్ధి సూచీలను ప్రాధాన్యతలుగా తీసుకొని 2030 నాటికి శతశాతం సాధించే దిశగా లక్ష్యాలను నిర్ణయించుకున్నామని తెలిపారు. ఇందులో ప్రధానంగా సామజిక, ఆర్ధిక, పర్యావరణ, పీస్ అండ్ పార్టనర్‌షిప్ అంశాలు ఉన్నాయని తెలిపారు. నీతి అయోగ్ అమలు చేస్తున్న 115 ఎస్.డి.జి సుచీలలో జిల్లా స్థాయి లో 61 , గ్రామ, వార్డు స్థాయిలో 47 ప్రభుత్వ పథకాలను మాపింగ్ చేవామన్నారు. రాష్ట్రంలో నాణ్యమైన విద్య అందించడానికి అనేక సంస్కరణలను చేపట్టారని తెలిపారు. సూచీలన్నింటినీ నెరవేరిస్తే కొన్ని తరాల వరకు అభివృద్ధి చేసిన వారం అవుతామని అన్నారు. జాతి నిర్మాణం లో ఉద్యోగుల పాత్ర కీలకమని, మనసు పెట్టి పని చేస్తే సంతృప్తి మిగులుతుందని హితవు పలికారు.

నిర్ణీత గడువులో పరిష్కరించిన వారికి అభినందనలు

విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో అందిన స్పందన ఆర్జీలను నిర్ణీత గడువు లోగా పరిష్కరించినందుకు రెండు జిల్లాల కలెక్టర్లను , అధికారులను సెక్రటరీ అభినందించారు. ప్రజల అవసరాలను గుర్తించడంలో , వాటిని సకాలం లో నెరవేర్చడం లో ప్రభుత్వం చిత్త శుద్ధి తో ఉందని అన్నారు. అర్జీ సమాధానం పంపిన 24 గంటల్లో అర్జీ దారు నుండి ఫీడ్ బ్యాక్ తీసుకోవాలని, అర్జీదారు ఫోటో, సమస్య ముందు, తర్వాత ఫోటో ను, అర్జీదారుకు రాసిన సమాధానపు ప్రతిని సంబంధిత అధికారి అప్‌లోడ్ చేయాలని అన్నారు. జిల్లాలో 13 శాతం రీ ఓపెన్ అర్జీ లు ఉన్నాయని, 42 శాతం అర్జీదారులు సంతృప్తిగా ఉన్నారని తెలిపారు. ఎక్కువగా రెవిన్యూ, హౌసింగ్ , సచివాలయ సేవలు, సిబ్బందిపై అర్జీలు అందుతున్నాయని, ఆయా శాఖల అధికారులు క్షేత్ర స్థాయిలో కూడా ఎందుకు ఎక్కువగా వస్తున్నదీ పరిశీలించాలని తెలిపారు.

జగనన్న కాలనీలలో మౌలిక వసతుల అభివృద్ధి : కలెక్టర్

కలెక్టర్ సూర్య కుమారి మాట్లాడుతూ హౌసింగ్ కాలనీలలో మౌలిక వసతుల కల్పనలో జిల్లా ముందుందని తెలిపారు. ఎస్‌డిజి సూచీలలో మాతా, శిశు మరణాలను తగ్గించగలిగామని తెలిపారు. అయితే రక్త హీనత ఉందని, తగ్గించడానికి కృషి చేస్తున్నామని అన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లోనే తినిపించేలా ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే కౌమార బాలికల కోసం సఖి బృందాలను ఏర్పాటు చేసి వారికి ఆరోగ్య పరమైన అంశాల పై అవగాహన కలిగిస్తున్నామన్నారు. పార్వతీపురం మన్యం జాయింట్ కలెక్టర్ ఓ.ఆనంద్ మాట్లాడుతూ గిరిజన బాలికల్లో రక్త హీనత ఎక్కువగా ఉందని, తగ్గించడానికి చర్యలు చేపట్టామని తెలిపారు. కార్యకమం లో విజయనగరం సంయుక్త కలెక్టర్ మయూర్ అశోక్, డిఆర్ఒలు గణపతి రావు, వెంకటరావు, ఆర్‌డిఒలు, జిల్లా అధికారులు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు పాల్గొన్నారు.

ఎర్ర చందనం స్మగ్లింగ్ పై సిబిఐ విచారణ

కేంద్ర మంత్రులకు రామచంద్ర యాదవ్ వినతి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమస్యలపై కేంద్ర మంత్రులు నిర్మల సీతారామన్, గజేంద్ర సింగ్ షెకావత్, భూపేంద్ర యాదవ్ ను ఎపి యూత్ లీడర్ రామచంద్ర యాదవ్ కలిశారు. అనంతరం ఆయన ఎపి భవన్ వద్ద మీడియాతో మాట్లాడుతూ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ తో పోలవరం నిధులపై చర్చించినట్లు తెలిపారు. పోలవరానికి నిధులు విడుదల చేయాలని కోరినట్లు చెప్పారు. పోలవరం విషయంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయన్నారు. రాయలసీమ జిల్లాల్లో కేంద్రం తలపెట్టనున్న ఐకానిక్ బ్రిడ్జితో పాటు బ్యారేజ్ గా నిర్మాణం చేయాలని కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ ని కోరినట్లు చెప్పారు. బ్రిడ్జిగా మార్చే అంశంపై మంత్రి అన్ని విధాల సహకారం అందిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. శేషాచలం అడవుల్లో జరుగుతున్న ఎర్ర చందనం స్మగ్లింగ్ పై కేంద్ర అటవీ శాఖ మంత్రికి భూపేంద్ర యాదవ్ కి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం శ్రద్ధ చూపడం లేదని, ఎర్రచందనం స్మగ్లింగ్ పై సిబిఐ విచారణ జరిపించాలని కోరినట్లు చెప్పారు.

అయ్యో.. గొంతెండుతోంది..!

ప్రజాశక్తి - బాలాయపల్లి (తిరుపతి)

ఎండలు మండుతున్నాయి.. వేసవి రాకముందే గొంతెండుతుంది. తిరుపతి జిల్లా బాలాయపల్లి మండలంలోని మన్నారు గ్రామంలో కిలోమీటర్లు నడిచి మంచినీళ్లు తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ గ్రామంలో 320 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. మరమ్మతుకు గురైన బోర్లను అధికారులు పట్టించుకోకపోవడంతో తమకు తాగునీటి కష్టాలు తప్పడం లేదని మహిళలు వాపోతున్నారు. తాగునీటి సమస్య తమ దృష్టికి రాలేదని ఎంపిడిఒ సురపాక రాణి 'ప్రజాశక్తి'కి వివరణ ఇవ్వడం గమనార్హం.

అరుంధతి వాడ గ్రామ ప్రజలు గుక్కెడు నీటి కోసం అల్లాడిపోతున్నారు. ఎండాకాలం రాకముందే గొంతెండుతుండడంతో తల్లడిల్లిపోతున్నారు. పాలకులు, సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. నిత్యం ఒక్కొక్కరికి అన్ని అవసరాలు కలుపుకొని కనీసం 100 లీటర్ల నీరు అవసరం ఉంటుంది. కానీ సరిపడా నీరులేక ఇబ్బంది పడుతున్నారు. ఈ గ్రామంలో ఓవర్ హెడ్ ట్యాంకు ఉంది. మినీ మంచి నీటి పథకం ఉంది. అయితే ఓవర్ హెడ్ ట్యాంక్ అలంకారంగా ఉంది. 2014 నుంచి ఆ ట్యాంకు నుంచి నీళ్లు వచ్చిన దాఖలాలు లేదు. అరుంధతి వాడలో ఉన్న బోరు మరమ్మతులకు గురై ఉంది. దీంతో సమస్య జటిలంగా మారింది.

నెలరోజులుగా అవస్థలు : కొమ్మల లక్ష్మి

మంచినీటిపథకం మరమ్మతులకు గురై నెలరోజులు అయ్యింది. ఇంతవరకూ అధికారులు ఎవరూ పట్టించుకోలేదు. చేతిబోరు మరమ్మతులకు గురై ఏడాదయ్యింది. దీంతో తాగునీటికి ఎంతో అవస్థలు పడుతున్నాం.

రూ.10 ఇచ్చి క్యానిల్లు కొంటున్నాం : ఎం. రేణుక

కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాం. మంచినీటి పథకం మరమ్మతులు గురవడంతో ఒక్కో క్యాన్ 10 రూపాయలు ఇచ్చి కొనుక్కుంటున్నాం. ఈ కారణంగా ఒక్కో కుటుంబంపై నెలకు రూ.500-1000 భారం పడింది. తాగునీటికి అల్లాడుతున్నాం పట్టించుకునేవారు లేరు.

12 ఎర్రచందనం దుంగల స్వాధీనం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

గూడూరు మండలం తీపనూరు-మేకనూరు అటవీ ప్రాంతం పరిధిలో ఏడుగురు స్మగ్లర్లను అరెస్టు చేసి వారి నుండి 12 ఎర్రచందనం దుంగలను, ఎత్తియోస్ లివా కారు, మోటారు సైకిల్ ను స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు. పట్టుబడిన వారు పుత్తూరు మండలం డి.సుబ్రమణ్యం (60), నగరి ఎస్.పళనివేలు (50), ఎం.శేఖర్ (42), గూడూరు మండలం నేలటూరు గోరంల కృష్ణయ్య (42), దేవిపాలెం సిద్ధిపల్లెడి ప్రసాద్ (26), మండల మనోహర్ (57), వరదయ్యపాలెం సంతాల రవి (35)లుగా గుర్తించి అరెస్టు చేశామన్నారు. తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీసు స్టేషన్ లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కనీసం వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ కోరింది. ఈ మేరకు స్త్రీ, శిశు సంక్షేమశాఖ డైరెక్టరుకు యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి బేబీరాణి, కె సుబ్బరావమ్మ బుధవారం లేఖ రాశారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ ఇవ్వాలని కోరారు. ఫేస్ యాప్ రద్దు చేయాలని, పర్యవేక్షణ పేరుతో వేధింపులు ఆపాలని తెలిపారు. వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ మెనూ ఛార్జీలు పెంచాలని, గ్యాసును ప్రభుత్వమే సరఫరా చెయ్యాలని కోరారు. 2017 నుంచి పెండింగ్‌లో ఉన్న టిఎ బిల్లులు వెంటనే ఇవ్వాలన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.5 లక్షలు, వేతనంలో సగం పెన్షన్ చెల్లించాలని కోరారు. అంగన్వాడీలకు రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. హెల్పర్ల ప్రమోషన్‌లకు వయోపరిమితి 50 ఏళ్లకు పెంచాలని, ప్రమోషన్లలో రాజకీయ జోక్యం అరికట్టాలని కోరారు. 300 జనాభా దాటిన మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని పేర్కొన్నారు. వర్కర్లతో సమానంగా వేతనాలు ఇవ్వాలని, మినీ సెంటర్ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా తీసుకోవాలని కోరారు. అదనంగా హెల్పర్‌ను నియమించాలని, మినీ వర్కర్లకు వేసవి సెలవులు ఇవ్వాలని తెలిపారు. లబ్ధిదారులకు నాణ్యమైన ఆహారాన్ని సరఫరా చేయాలని, ఆయిల్, కందిపప్పు క్వాంటిటీ పెంచాలని కోరారు. సీనియార్టీ ప్రకారం వేతనాలు ఇవ్వాలని, గ్రేడ్, సూపర్ వైజర్ పోస్టులకు వయోపరిమితి తొలగించాలన్నారు. యూనిఫామ్ ఇవ్వాలని, వేతనంతో కూడిన మెడికల్ లీవ్ సౌకర్యం కల్పించాలని తెలిపారు. సర్వీసులో ఉండి చనిపోయిన కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, బీమా అమలు చేయాలని కోరారు. అంగన్వాడీ కేంద్రాలకు మౌలిక వసతులు కల్పించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలన్నారు.

మధ్యాహ్న భోజనంపై 'ఆధార్' అస్త్రం

- విద్యార్థి వివరాలు లింక్ చేసే యోచనలో కేంద్రం?
- పాఠశాలల నుంచి వివరాల కోరిన మోడీ ప్రభుత్వం
- ఇంకా ఆధార్‌కు నమోదు చేసుకోని బడుగుల బిడ్డలెందరో..
- ఆ ఆలోచనే విరమించుకోవాలి : సామాజిక కార్యకర్తలు

బతుకుబండి లాగటమే కష్టమవుతుంటే..సర్కారు బడుల్లో పెట్టే మధ్యాహ్న భోజనమైనా తిని బిడ్డలు బాగుపడతారు..అని అనుకుంటున్నారు పేదలు. కానీ మోడీ ప్రభుత్వానికి ఇవేం పట్టవు. పైసలుంటే కార్పొరేట్ బడుల్లో చదువుకోండి. అంతేకానీ మీకు సబ్సిడీలు,సంక్షేమ పథకాలు అమలు చేయటం అసాధ్యమంటూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అంటోంది. ఎన్నికలొచ్చినపుడు మాత్రం కటాఫ్ డేట్లు పెట్టి మరీ పేదలను ఓట్లేసుకోవటం కామన్ అయిపోయింది. తాజాగా ఆధార్ లింకు చేసి..మిడ్ డే మీల్సు వెళ్లేసే కుట్రలకు దిగుతోంది. ఇది పేద కుటుంబాలను చదువులనుంచి దూరం చేయటమే నని సామాజికవేత్తలు ఆక్షేపిస్తున్నారు.



న్యూఢిల్లీ : దేశంలోని అనేక ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం (మిడ్‌డే మీల్) అమలు ఇప్పటికే సమస్యగానే మిగిలి ఉన్నది. ఈ పథకం అమలులో అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. ఇలాంటి తరుణంలో ఈ పథకాన్ని ఆధార్‌కు ముడిపెడితూ కేంద్రం నిర్ణయం ఇప్పుడు కలవరానికి గురి చేస్తున్నది. ఈ పథకాన్ని ఆధార్‌తో అనుసంధానం చేసే యోచనలో కేంద్రం ఉన్నట్టు తెలుస్తున్నది.

దేశంలోని ప్రతి ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో ఆధార్‌తో ప్రామాణీకరించబడిన విద్యార్థుల సంఖ్య మరియు ప్రతి ఒక్కరికి అందించే భోజనాల సంఖ్యపై కేంద్రం నెలవారీ అప్‌డేట్‌లను కోరింది. ఇప్పుడిదే పేద వర్గాలకు చెందిన విద్యార్థులు, వారి కుటుంబాలలో భయాలను రేకెత్తిస్తున్నది. కేంద్రానికి చెందిన పీఎం పోషణ్ పోర్టల్‌లో తప్పనిసరిగా డేటాను అప్‌లోడ్ చేయాలని ప్రభుత్వ ఆదేశంతో ఆందోళనలు నెలకొన్నాయని నిపుణులు, సామాజిక కార్యకర్తలు అన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ) కింద ఆధార్ ఆధారిత వేతన చెల్లింపులపై ఇటీవల కేంద్రం తీరు నేపథ్యంలో మిడ్ డే మీల్‌పై ఈ అనుమానాలు బలపడుతున్నాయని తెలిపారు.

ఇటు ఆధార్ అనుసంధానంపై ఆందోళనలు వెలువడుతున్నప్పటికీ సంబంధిత విభాగాలు మాత్రం స్పష్టతను ఇవ్వడం లేదు. పాఠశాల విద్యా కార్యదర్శి సంజయ్ కుమార్‌కు ఈ విషయంలో ఈ-మెయిల్ పంపినా సమాధానం లేదని సామాజిక కార్యకర్తలు అన్నారు. మధ్యాహ్న భోజనానికి ఆధార్ లింక్ చేయడం వినాశకరమైనదని సామాజిక కార్యకర్త నిఖిల్ డే అన్నారు. దేశంలో చాలా మంది పిల్లలు ఇంకా ఆధార్ కోసం నమోదు చేసుకోలేదని తెలిపారు. ఉచిత పాఠశాల విద్య ఒక హక్కు అనీ, దాన్ని లాభదాయకంగా చూడొద్దని సుప్రీంకోర్టు స్పష్టం చేసిన విషయం విదితమే. అయినా మోడీ ప్రభుత్వం మిడ్ డే మీల్‌కు ఆధార్ లింక్ చేయటం లాంటి చర్య.. ఏదైనా చట్ట విరుద్ధం అని, ఏ పాఠశాల ప్రయోజనం అయినా ఆధార్‌పై షరతులు విధించబడదని ఆర్థికవేత్త, పబ్లిక్ పాలసీ నిపుణుడు జీన్ డ్రేజ్ అన్నారు.

ఆధార్-ప్రామాణీకరించబడిన విద్యార్థుల సంఖ్య, జిల్లా అధికారుల నుంచి ప్రతి పాఠశాలకు వచ్చిన నిధులు, నెలలో ఖర్చు చేసిన నిధులు, ఈనెలలో వడ్డించిన భోజనం గురించి నెలవారీ డేటాను కోరుతూ కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ గత నాలుగు నెలల్లో అన్ని రాష్ట్రాలకు రెండు లేఖలు రాసింది. ప్రతినెలా పది లోపు ప్రధాన మంత్రి పోషణ్ పోర్టల్‌లో డేటాను అప్‌లోడ్ చేయాలని జాయింట్ సెక్రెటరీ ప్రాచీ పాండే తన లేఖలో పేర్కొన్నారు. ప్రతి విద్యార్థికి ఆధార్ ఫీడ్ చేసిన తర్వాతే మధ్యాహ్న భోజనం పథకంలో ఆధార్ అనుసంధానం విజయవంతం అవుతుందని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో కనెక్టివిటీ , నెట్‌వర్క్ పనితీరు తక్కువగా ఉండటం, ప్రభుత్వ పాఠశాలల్లో సిబ్బంది కొరత కారణంగా చాలా పాఠశాలలు జిల్లా అధికారులకు డేటాను పంపడానికి ఇబ్బంది పడతాయని విశ్లేషకులు అన్నారు. ప్రధాన మంత్రి పోషణ్ పథకం 11 లక్షల ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో 1 నుంచి 8వ తరగతుల వరకు 11 కోట్ల మంది పాఠశాల విద్యార్థులకు ప్రతి రోజు మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్నట్టు ప్రభుత్వ గణాంకాలు తెలిపాయి. అయితే, వీరిలో పేద, అణగారిన వర్గాల ప్రజలు అధికంగా ఉంటారని, ఆధార్ అనుసంధాన ప్రక్రియ వారిని ఈ పథకం నుంచి దూరం చేస్తుందని సామాజిక కార్యకర్తలు, విశ్లేషకులు అన్నారు. ఈ ఆలోచనను కేంద్రం వెనక్కి తీసుకోవాలని సూచించారు.



ఢిల్లీ మేయరుగా షెల్లీ ఒబెరాయ్

న్యూఢిల్లీ : ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ మేయరుగా ఆప్ కు చెందిన షెల్లీ ఒబెరాయ్ ఎన్నికయ్యారు. బుధవారం జరిగిన ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి రేఖా గుప్తాపై 34 ఓట్ల తేడాతో షెల్లీ గెలుపొందారు. మొత్తం 266 ఓట్లలో షెల్లీ ఒబెరాయ్‌కు 150, రేఖా గుప్తాకు 116 ఓట్లు వచ్చాయి. కట్టుదిట్టమైన భద్రత మధ్య ఎన్నికలు జరిగాయి. షెల్లీ ఒబెరాయ్‌కు ఢిల్లీ సిఎం కేజ్రీవాల్ అభినందనలు తెలిపారు. గతేడాది డిసెంబరులో జరిగిన డిఎంసి ఎన్నికల్లో ఆప్ ఘన విజయం సాధించింది. మొత్తం 250 వార్డుల్లో మెజార్టీ మార్క్ (126)ను దాటి.. ఏకంగా 134 స్థానాలను కైవసం చేసుకుంది. మెజార్టీ ప్రకారం మేయర్ పదవి ఆప్‌కు దక్కాల్సి ఉన్నా బిజెపి అనేక అవాంతరాలు సృష్టించింది. దీంతో ఈ ఎన్నిక ప్రక్రియ మూడుసార్లు వాయిదా పడింది. దీనిపై షెల్లీ ఒబెరాయ్ సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారించిన సుప్రీం కోర్టు ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ సమావేశానికి తీర్పు ఇచ్చింది. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నరు వికె సక్సేనా బుధవారం ఈ సమావేశం నిర్వహించింది, ఎన్నికలు నిర్వహించారు.

కేంద్రంలో బిజెపిని ఓడించడమే ఏకైక లక్ష్యం

- ముఖ్యమంత్రి కావాలన్న తొందర లేదు
- ఆర్‌జెడి నేత, బీహార్ డిప్యూటీ సిఎం తేజస్వీ యాదవ్



పాట్నా : ముఖ్యమంత్రి కావాలనే ఆత్రుత తనకు లేదని, కేంద్రంలో బిజెపిని ఓడించడమే ఏకైక లక్ష్యమని రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్‌జెడి) నేత, బీహార్ ఉప ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్ బుధవారం తెలిపారు. జనతా దళ్ యునైటెడ్ (జెడియు) నేత, బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ వచ్చే మార్చి నెలలో తన కుర్చీని తేజస్వీ యాదవ్‌కు అప్పగించనున్నారని ఆర్‌జెడి ఎమ్మెల్యే ఒకరు పేర్కొన్న మరుసటి రోజే తేజస్వీ పై వ్యాఖ్యలు చేశారు. బోధ్‌గయలో ఆయన మీడియాతో మాట్లాడుతూ తమ కూటమి ముందున్న ఏకైక లక్ష్యం వచ్చే 2024 సార్వత్రిక ఎన్నికల్లో కేంద్రంలో బిజెపిని ఓడించడమేనని స్పష్టం చేశారు. 'నాకు ఆత్రుత లేదు (ముఖ్యమంత్రి కావడానికి). దాన్నెప్పుడూ మీకు (మీడియాకు) తెలుసు. మా ప్రధాన అజెండా 2024 సార్వత్రిక ఎన్నికల్లో బిజెపిని పదవి నుంచి గద్దె దింపడమే. ముఖ్యమంత్రి నితీష్ కుమార్ నేతృత్వంలో మహాఘట్బంధన్ (మహా కూటమి) ప్రభుత్వం బాగానే పనిచేస్తోంది. ఈ విషయంలో గందరగోళం అవసరం లేదు' అని చెప్పారు. 2025 ఎన్నికల్లో మహా కూటమి ముఖ్యమంత్రి అభ్యర్థి తేజస్వీ అని ఎవరూ నిర్ణయించలేదంటూ జెడియు నేత లలన్ సింగ్ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించగా..'లలన్ సింగ్ అన్నదాంట్లో తప్పేముంది? అసెంబ్లీ ఎన్నికలు వచ్చినపుడు ఆ సంగతి చూస్తాం. ఇప్పుడే ఎందుకు?' అని తేజస్వీ అన్నారు. ప్రస్తుతం తమ దృష్టి అంతా 2024 సార్వత్రిక ఎన్నికల్లో బిజెపిని ఓడించడమేనని ఆయన పునరుద్ఘాటించారు. హోలీ తర్వాత నితీష్ కుమార్ ముఖ్యమంత్రి పదవిని తేజస్వికి అప్పగిస్తారని రోహ్తాస్ జిల్లా దినారా ఎమ్మెల్యే విజయ్ కుమార్ మండల్ ఈ నెల 21న పేర్కొన్నారు. పలువురు ఆర్‌జెడి ఎమ్మెల్యేలు ఇదివరకు ఇదే విషయం చెబుతూవస్తున్న సంగతి విదితమే.

ఢిల్లీలో భూకంపం.. పరుగులు తీసిన ప్రజలు

న్యూఢిల్లీ : దేశ రాజధాని న్యూఢిల్లీ, పరిసర ప్రాంతాల్లో బుధవారం భూకంపం సంభవించింది. ఉత్తర ప్రదేశ్, ఉత్తరాఖండ్, హర్యానా, ఢిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతాల్లో బుధవారం మధ్యాహ్నం 1:30:23 గంటలకు భూకంపం ప్రభావం కనిపించినట్లు నేషనల్ సెంటర్ ఫర్ సీస్మాలజీ వెల్లడించింది. అకస్మాత్తుగా భూమి కంపించడంతో ప్రజలు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఇళ్లు, కార్యాలయాల నుంచి బయటకు పరుగులు తీశారు. నేపాల్ కేంద్రంగా సంభవించిన ఈ భూకంపం తీవ్రత భూకంప లేఖినిపై 4.8గా నమోదైంది. నేపాల్‌లో ఈ భూకంపం తీవ్రత 5.2గా నమోదైనట్లు అక్కడి జాతీయ మీడియా కథనాలను బట్టి తెలుస్తోంది. ఈ ప్రభావం ఉత్తర ప్రదేశ్‌లో కూడా కనిపించినట్లు నేషనల్ సెంటర్ ఫర్ సీస్మాలజీ వెల్లడించింది. నేపాల్‌లోని బజురలో బుధవారం మధ్యాహ్నం భూకంపం సంభవించినట్లు నేపాల్ జాతీయ భూకంప పర్యవేక్షక, పరిశోధన కేంద్రం వెల్లడించింది.



బీజింగ్‌లో భారత్, చైనా సరిహద్దు చర్చలు

బీజింగ్ : దాదాపు మూడున్నర ఏళ్ల తరువాత భారత అత్యున్నత అధికారిక బృందం చైనాలో పర్యటించింది. ఇరు దేశాల సంబంధాల్లో 'సాధారణస్థితిని పునరుద్ధరించడానికి' అనువైన పరిస్థితులను సృష్టించడానికి, వాస్తవ నియంత్రణ రేఖ(ఎల్‌ఎసి) వెంబడి ఉద్రిక్తతలను తగ్గించడానికి చైనాతో చర్చల్లో పాల్గొంది. కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖలోని సంయుక్త కార్యదర్శి (తూర్పు ఆసియా) శిల్పక్ అంబులే నేతృత్వంలోని భారత్ బృందం ఈ చర్చల్లో పాల్గొంది. ఈ మేరకు బుధవారం చైనా సరిహద్దు అధికారులతోనూ, అలాగే చైనా విదేశాంగ శాఖ సహాయ మంత్రి హువా చున్‌యింగ్‌తో చర్చల్లో పాల్గొంది. చైనా బృందానికి ఆ దేశ విదేశాంగ మంత్రిత్వ శాఖకు యొక్క సరిహద్దు, సముద్ర వ్యవహారాల విభాగం డైరెక్టర్ జనరల్ హాంగ్ లియాంగ్ నాయకత్వం వహించారు. 2019 జులై తరువాత భారత్, చైనా మధ్య జరిగిన తొలి వ్యక్తిగత చర్చలు ఇవి. ఈ చర్చల్లో ఎల్‌ఎసి వెంబడి పరిస్థితిని సమీక్షించారు. ఘర్షణ ప్రాంతాల్లో సైనిక ఉపసంహరణపైనా చర్చించారు.

లా కమిషన్ పదవీకాలం పొడిగింపు

- కేంద్ర మంత్రివర్గం నిర్ణయం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

22వ లా కమిషన్ ఆఫ్ ఇండియా పదవీకాలాన్ని ఆగస్టు 31 వరకు కేంద్ర మంత్రివర్గం పొడిగించింది. ఈ మేరకు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన బుధవారం జరిగిన కేంద్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. ప్రస్తుత లా కమిషన్ పదవీకాలం ఈ నెల 20న ముగిసింది. నవంబరు 2022లో ప్రభుత్వం జస్టిస్ (రిటైర్డ్) రితురాజ్ అవస్థిని కమిషన్ చైర్మన్‌గా నియమించింది. బిజెపికి కీలకమైన సైద్ధాంతిక సమస్య అయిన యూనిఫాం సివిల్ కోడ్ అంశాన్ని పరిశీలించాల్సిందిగా కమిషన్‌ను కోరే అవకాశం ఉన్నందున కొత్త చైర్మన్ నియామకం, పొడిగింపు ప్రాధాన్యత సంతరించుకుంది. యూనిఫాం సివిల్ కోడ్‌ను 22 లా కమిషన్ పరిశీలిస్తుందని ప్రభుత్వం గతంలో సుప్రీం కోర్టు, పార్లమెంటుకు తెలిపింది. '21వ లా కమిషన్ పదవీకాలం ఆగస్ట్ 31, 2018తో ముగిసింది. లా కమిషన్ నుండి అందిన సమాచారం ప్రకారం, యూనిఫాం సివిల్ కోడ్‌కు సంబంధించిన అంశాన్ని 22వ లా కమిషన్ పరిశీలనకు తీసుకోవచ్చు' అని న్యాయశాఖ మంత్రి కిరెన్ రిజిజు ఈ నెల 2న రాజ్యసభకు తెలిపారు. లా కమిషన్ ఆఫ్ ఇండియా అనేది చట్టబద్ధత లేని సంస్థ, ఇది ఎప్పటికప్పుడు కేంద్ర ప్రభుత్వంతో నియామకం జరుగుతుంది.

ఇండియా, గుయానా మధ్య విమాన సేవల ఒప్పందానికి ఆమోదం

ఇండియా, గుయానా మధ్య విమాన సేవల ఒప్పందాన్ని కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది. కేంద్ర ప్రభుత్వం, కో-ఆపరేటివ్ రిపబ్లిక్ ఆఫ్ గయానా ఎయిర్ సర్వీసెస్ ఒప్పందంపై సంతకం చేయడానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఆర్టికల్ 3, ఆర్టికల్ 50 (ఎ), ఆర్టికల్ 56పై మూడు ప్రొటోకాల్స్‌తో పాటు ఇంటర్నేషనల్ సివిల్ ఏవియేషన్ (చికాగో కన్వెన్షన్) 1944లో సవరణలను కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది.

మనీష్ సిసోడియాపై మరో కేసు...

న్యూఢిల్లీ : ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియాపై మరో కేసు నమోదైంది. తాజాగా స్నూపింగ్ కేసులో మనీష్ సిసోడియాను సిబిఐ విచారించేందుకు కేంద్ర హోం శాఖ అనుమతిచ్చింది. ఇప్పటికే సిసోడియా ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో విచారణను ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. మనీష్ సిసోడియాపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాల్సిందిగా సిబిఐని ఆదేశించింది. ప్రభుత్వంలోని వివిధ శాఖలు, అందులోని ఉద్యోగులు ఎలా పని చేస్తున్నారో సమాచారం సేకరించి.. తగిన చర్యలు తీసుకోవాలని సూచించేదే ఈ ఫీడ్‌బ్యాక్ యూనిట్ (ఎఫ్‌బియు). దీన్ని 2015లో ఢిల్లీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. రూ.కోటి నిధులతో 2016 నుంచి ఇది పని చేయడం ప్రారంభించింది. ఈ విభాగానికి మనీష్ సిసోడియా నేతృత్వం వహిస్తున్నారు. ఎఫ్‌బియు యూనిట్ మంత్రిత్వ శాఖలు, ప్రతిపక్ష పార్టీలు, సంస్థలు మరియు వ్యక్తులపై నిఘా పెట్టేందుకు వినియోగించారని సిబిఐ ఆరోపించింది. ఈ స్నూపింగ్ యూనిట్ అసెంబ్లీ లేదా న్యాయపరమైన పర్యవేక్షణ లేకుండా కేవలం సిఎం కేజ్రీవాల్ సన్నిహితులు, సలహాదారులే నిర్వహిస్తూ, నివేదికలను ఆయనకే సమర్పిస్తున్నారని పేర్కొంది. ఈ యూనిట్ కోసం సీక్రెట్ సర్వీస్ ఫండ్ పేరిట అక్రమంగా, అనధికారికంగా నిధులు కేటాయించారని ఆరోపించింది. రూ.36లక్షలు దీనికోసం దుర్వినియోగం చేసిందంటూ ఆరోపించింది.

ప్రత్యర్థులపై తప్పుడు కేసులు నమోదు చేయడం కేంద్రం బలహీనతకు, పిరికితనానికి నిదర్శనమని మనీష్ సిసోడియా మండిపడ్డారు. ఆప్ బలోపేతం అవుతున్న కొద్దీ ఇలాంటి కేసులు మరిన్ని నమోదవుతాయని అన్నారు.

కులవివక్షను నిషేధించిన సియాటెల్

స్థానిక కౌన్సిల్‌లో తీర్మానం ఆమోదం

వాషింగ్టన్ : అమెరికాలో కుల వివక్షను నిషేధించిన మొదటి నగరంగా సియాటెల్ నిలిచింది. భారతీయ -అమెరికన్ రాజకీయ వేత్త, ఆర్థికవేత్త క్షమా సావంత్ స్థానిక కౌన్సిల్‌లో ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ తీర్మానం ఆరు ఓట్లతో ఆమోదం పొందింది. ఇది అధికారికమని, దేశంలో తొలిసారిగా వివక్షపై నిషేధం విధించడం చారిత్రాత్మకమైన నిర్ణయమని సావంత్ తెలిపారు. దీనిని దేశమంతటా వ్యాపింపజేయడానికి ఓ ఉద్యమంగా ముందుకు తీసుకువెళ్లాల్సిన అవసరం ఉందని అన్నారు. కాంగ్రెస్ మహిళ పరిమళా జయపాల్ ఈ ఉద్యమానికి మద్దతు తెలిపారు. అమెరికా సహా ప్రపంచంలో ఎక్కడా వివక్షకు తావుండకూడదని పరిమళా జయపాల్ పేర్కొన్నారు. కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడుతున్న ఈక్వాలిటీ ల్యాబ్స్ ఈచర్యను స్వాగతించింది. దేశంలోనే సియాటిల్ మొదటిస్థానంలో నిలవడంతో ప్రేమ గెలిచిందని తెలిపింది.

ఉక్రెయిన్‌కు సైనిక మద్దతును వ్యతిరేకిస్తూ
అమెరికాలో భారీ ప్రదర్శన



వాషింగ్టన్ : ఉక్రెయిన్ యుద్ధానికి అమెరికా మద్దతును వ్యతిరేకిస్తూ మంగళవారం స్థానిక డిసిలోని లింకన్ మెమోరియల్ వద్ద భారీ ప్రదర్శన జరిగింది. "మార్చ్.. ఎగైనెస్ట్ ది వార్ మార్షెన్" పేరుతో జరిగిన ఈ ర్యాలీలో మాజీ రాజకీయ నేతలు, జర్నలిస్టులతో పాటు వందలాది మంది ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. దౌత్య సాయం కింద ఉక్రెయిన్‌కు అమెరికా అందిస్తున్న సైనిక మద్దతుకు ముగింపు పలకాలని డిమాండ్ చేశారు. పలు దేశీయ సమస్యలను పరిష్కరించే దిశగా అమెరికా బడ్జెట్‌ను తగ్గించాలని పేర్కొన్నారు. ఉక్రెయిన్‌పై రష్యా సైనిక చర్యలు ప్రారంభించి ఏడాది పూర్తైన సంగతి తెలిసిందే. "ప్రచ్ఛన్న యుద్ధం, అణ్వాయుధాల పోటీ" వంటి ప్రస్తుత పరిస్థితుల గురించి 2020 అధ్యక్ష ఎన్నికల బరిలో తాను తప్ప మరే అభ్యర్థి వ్యాఖ్యానించలేదని మాజీ కాంగ్రెస్ నేత, అధ్యక్ష అభ్యర్థి తులసి గబ్బార్డ్ గుర్తు చేశారు. రెండేళ్ల తర్వాత.. అప్పుడు తాను హెచ్చరించిన పరిస్థితులు ఇప్పుడు ఎదురయ్యాయని అన్నారు. ప్రస్తుతం రష్యాకు వ్యతిరేకంగా పోరాడుతున్న ఉక్రెయిన్ తరపున ప్రతినిధిగా పోరాడుతున్నామని.. ఏ క్షణంలోనైనా నాటో, అమెరికా, రష్యాల మధ్య ప్రత్యక్ష యుద్ధానికి దారితీయవచ్చని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రచ్ఛన్న యుద్ధం ఏ క్షణంలోనైనా దేశానికి వ్యతిరేకంగా అణ్వాయుధ యుద్ధంగా మారుతుందని కొంచెం జ్ఞానం ఉన్న వారెవరికైనా తెలుస్తుందని అన్నారు.

అమెరికా బడ్జెట్‌ను తగ్గించాలని గ్రీన్ పార్టీ మాజీ అధ్యక్ష అభ్యర్థి డా.జిల్‌స్టెయిన్ తెలిపారు. ఉక్రెయిన్ యుద్ధానికి మద్దతిచ్చేందుకు అమెరికా బడ్జెట్‌ను భారీగా పెంచారని.. బదులుగా బడ్జెట్ తగ్గింపుతో దేశంలో నెలకొన్న అనేక సమస్యలను పరిష్కరించేందుకు సహాయపడుతుందని అన్నారు. సైనిక వ్యయం పేరుతో హత్యాకాండ కొనసాగిస్తున్నారని మండిపడ్డారు. ఆరోగ్య బీమా లేకపోవడంతో దేశంలో ప్రతి ఏడాది 7వేల మంది మరణిస్తున్నారని, వారి కోసం ఆ వ్యయాన్ని ఖర్చు చేయవచ్చని అన్నారు. అలాగే వీధుల్లో నిరాశ్రయులుగా తిరుగుతున్న ఐదులక్షల మందికి ఆశ్రయం కల్పించవచ్చని, 33 మిలియన్ల మంది విద్యార్థుల చదువుకు రుణం అందించవచ్చని, పదికోట్ల మందికి వైద్య రుణాన్ని, 220 లక్షల మంది చిన్నారులను పేదరికం నుండి కాపాడవచ్చని పేర్కొన్నారు. నాటోను రద్దు చేయాలని, రష్యాతో శాంతియుత చర్చలు జరపాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ విజయాన్ని అడ్డుకోలేరు
మల్లికార్జున్ ఖర్గే

కొహిమా : వందమంది మోడీ, షాలు అడ్డుపడినా కాంగ్రెస్ విజయాన్ని అడ్డుకోలేరని ఆ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే పేర్కొన్నారు. తమ ప్రభుత్వం అందించే ప్రజాస్వామ్యయుత పాలనను నిరోధించలేని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నాగాలాండ్‌లోని చుమౌకెడిమాలో బహిరంగ సభలో ఖర్గే ఈ వ్యాఖ్యలు చేశారు. బిజెపి వరుస దాడులను చేస్తూ రాష్ట్రాలను దోచుకుంటోందని ధ్వజమెత్తారు. గత 20 ఏళ్లుగా నేషనల్ డెమోక్రటిక్ ప్రొగ్రెసివ్ పార్టీ (ఎన్‌డిపిపి), బిజెపి నాగాలాండ్‌ను దోచుకుంటున్నాయని మండిపడ్డారు. ప్రజలకు న్యాయం జరగాలని, ప్రజలకోసం పనిచేసే ప్రభుత్వం రావాల్సిన సమయం అసన్నమైందని అన్నారు. నాగాల విశిష్ట సంస్కృతిని నాశనం చేయడమే లక్ష్యంగా బిజెపి విద్వేష రాజకీయాలకు పాల్పడుతోందని అన్నారు. మీ సంస్కృతిపై జరుగుతున్న దాడిని, విద్వేషాన్ని ఎదుర్కొనేందుకు ప్రజలు పోరాటం చేయాలని సూచించారు. అలాగే ఆపరేషన్ కమలం పేరిట బిజెపి పలు రాష్ట్రాల్లో ప్రతిపక్ష ప్రభుత్వాలను కూల్చివేయడాన్ని కూడా ప్రస్తావించారు. బిజెపి ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన ప్రభుత్వాలను కూల్చివేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే కర్ణాటక, మధ్యప్రదేశ్, గోవా, మణిపూర్, ఉత్తరాఖండ్‌లలో ప్రభుత్వాలను కూల్చివేసిందని అన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ పూర్తి మెజారిటీ సాధించిందని, కానీ బిజెపి 17-18 మంది ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి ప్రభుత్వాన్ని కూల్చివేసిందని మండిపడ్డారు. అప్రజాస్వామ్య చర్యలు చేపడుతూ... బిజెపి ప్రజాస్వామ్యం, రాజ్యాంగం గురించి మాట్లాడటం హాస్యాస్పదమని అన్నారు. 2024లో ప్రజలు మోడీకి గుణపాఠం చెబుతారని, కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్ష కూటమి ప్రభుత్వం ఏర్పడుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ నెల 27న నాగాలాండ్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే.

బిజెపికి లబ్ధి కోసమే మేఘాలయలో టిఎంసి పోటీ

- రాహుల్ గాంధీ విమర్శలు

షిల్లాంగ్: ఈశాన్య రాష్ట్రాల్లో బిజెపి అధికారంలోకి తీసుకువచ్చేందుకే తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) ఇక్కడ పోటీ చేస్తోందని కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ బుధవారం విమర్శించారు. షిల్లాంగ్‌లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న రాహుల్ గాంధీ బిజెపి, టిఎంసిలపై తీవ్రస్థాయిలో ఆరోపణలు గుప్పించారు. తమకు అన్నీ తెలుసునని భావించే బిజెపి ఎవ్వరినీ గౌరవించదని అన్నారు. 'బిజెపి,ఆర్‌ఎస్‌ఎస్‌లు తమకు అన్ని తెలుసునని, అన్నీ అర్థం చేసుకుంటామని భావిస్తుంటాయి. కానీ, ఎవ్వరికీ గౌరవం ఇవ్వవు. మనమందరం వాటికి వ్యతిరేకంగా పోరాడాలి. తమ సొంత సిద్ధాంతాలతో దేశంలోని వ్యవస్థలపై బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ దాడులకు పాల్పడుతున్నాయి. తమిళనాడు, కర్ణాటక, జమ్ముకాశ్మీర్, హర్యానా ఇలా ప్రతి రాష్ట్రంలోనూ ఆర్‌ఎస్‌ఎస్ దాడులకు తెగబడుతోంది. ఒకే సిద్ధాంతాన్ని అన్ని రాష్ట్రాల్లో అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. పార్లమెంటు, మీడియా, ఎన్నికల సంఘం, న్యాయవ్యవస్థ.. ఇలా అన్ని వ్యవస్థలూ తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి' రాహుల్ గాంధీ తీవ్రంగా మండిపడ్డారు. పశ్చిమ బెంగాల్‌లో హింస, కుంభకోణాల చరిత్ర కలిగిన పార్టీ టిఎంసి అని రాహుల్ గాంధీ మండిపడ్డారు. గోవా ఎన్నికల కోసం టిఎంసి భారీగా ఖర్చుచేసిందని.. అది కూడా బిజెపికి ప్రయోజనం చేకూర్చేందుకేనని ఆరోపించారు. తాజాగా మేఘాలయాలోనూ అదే విధంగా టిఎంసి వ్యవహరిస్తోందని.. తద్వారా ఈశాన్య రాష్ట్రాల్లో బిజెపి అధికారంలోకి తీసుకువచ్చేందుకు దోహదం చేస్తుందన్నారు.

అమెరికా అధ్యక్ష అభ్యర్థి రేసులో వివేక్ రామస్వామి



వాషింగ్టన్ : వచ్చే ఏడాది అమెరికాలో జరగనున్న అధ్యక్ష ఎన్నికల కోసం భారతీయ సంతతికి చెందిన వివేక్ రామస్వామి(37) రిపబ్లికన్ పార్టీ తరుపున రేసులో ఉన్నారు. ఆ పార్టీ తరపున అధ్యక్ష రేసుకు సిద్ధమైన రెండవ ఇండియన్‌గా నిలిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమెరికా విదేశీ విధానాన్ని మార్చాలని ఆయన అభిప్రాయపడ్డారు. అలాగే, చైనా ఎయిర్ బెలూన్ అంశం గురించి మాట్లాడుతూ ఒకవేళ ఆ బెలూన్ రష్యాకు చెంది ఉంటే దాన్ని తక్షణమే పేల్చివేసేవాళ్లమని, కానీ చైనా విషయంలో ఆ పనిచేయలేకపోయినట్లు చెప్పారు. ఆధునిక జీవనంలో భాగంగా ఎక్కువ మనం చైనామీదే ఆధారపడుతున్నామని, ఎకనామిక్ కో డిపెండెంట్ బంధాన్ని తుంచుకోవాలని ఆయన అన్నారు. సెకండ్ జనరేషన్ ఇండో అమెరికన్ అయిన రామస్వామి.. 2014లో రోయివాంట్ సైన్సెస్ సంస్థను ఏర్పాటు చేశారు. అనేక వ్యాధులకు ఆ ఫార్మసీ కంపెనీ మందుల్ని తయారు చేస్తోంది. ఎఫ్‌డీఏ ఆమోదం పొందిన ఆ ఉత్పత్తులకు మార్కెట్లో మంచి గుర్తింపు ఉన్నది. 2022లో స్ట్రయివ్ అసెట్ మేనేజ్‌మెంట్ సంస్థను ఆయన లాంచ్ చేశారు. వివేక్ రామస్వామి తల్లిదండ్రులు కేరళ నుంచి అమెరికాకు వలస వెళ్లారు. ఫాక్స్ న్యూస్ ప్రైమ్ టైం షోలో వివేక్ తన అధ్యక్ష అభ్యర్థిత్వ రేసును ప్రకటించారు. ఇటీవల భారతీయ సంతతికి చెందిన నిక్కీ హేలీ కూడా తన ప్రచారాన్ని మొదలుపెట్టిన విషయం తెలిసిందే.

ఐఎస్ఐకు నిధుల కోత..
పాక్‌లో మినీ బడ్జెట్

ఇస్లామాబాద్ : పాకిస్థాన్‌లో బుధవారం మినీ బడ్జెట్‌ను ఆమోదించారు. ఆర్థిక సంక్షోభం నేపథ్యంలో పొదుపు చర్యలు చేపట్టింది. వీలైనంత ఖర్చులు తగ్గించుకొనేందుకు యత్నాలను మొదలుపెట్టింది. బుధవారం ఈ మేరకు ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఆదేశాలు జారీ చేశారు. దీనిలో భాగంగా విదేశీ దౌత్య కార్యాలయాల సంఖ్యను కుదించనున్నారు. దీంతో ఖర్చు 15శాతం వరకు తగ్గవచ్చని భావిస్తున్నారు. త్వరలో షరీఫ్ మరిన్ని కఠిన చర్యలు ప్రకటించవచ్చని పాక్ మీడియా పేర్కొంటుంది. వీటిల్లో ఆర్థిక విధానాల్లో మార్పులు, ప్రభుత్వ వ్యయంలో కోతలు, పన్ను పెంపులు, పింఛన్ సంస్కరణలు, కార్మిక రక్షణ తగ్గింపు వంటి నిర్ణయాలు ఉండొచ్చని భావిస్తున్నారు. అలాగే మంత్రి వర్గంలో సగం మంది ఎటువంటి వేతనాలు లేకుండా పనిచేసే అవకాశం ఉంది. మిగిలిన మంత్రుల జీతాల్లో కూడా 15 శాతం కోత విధించవచ్చు.

రాష్ట్ర విభజనపై విచారణ వాయిదా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్ర విభజనపై సుప్రీంకోర్టులో విచారణ వాయిదా పడింది. రాష్ట్ర విభజనపై ఉండవల్లి అరుణ్ కుమార్, తెలంగాణ వికాస్ కేంద్ర సహా పలువురు దాఖలు చేసిన పిటిషన్లను బుధవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కెఎం జోసెఫ్, జస్టిస్ నాగరత్న, జస్టిస్ పార్దీవాల ధర్మాసనం విచారించింది. రాజ్యాంగ ధర్మాసనాలు కొన్ని ప్రత్యేక కేసులపై విచారణ చేపట్టిన నేపథ్యంలో సుప్రీం ఈ కేసును వాయిదా వేసింది. బుధ, గురువారాల్లో కేవలం నోటీసులు ఇచ్చిన పిటిషన్లపై, తుది విచారణలో ఉన్న పిటిషన్లపై మాత్రమే వాదనలకు తీసుకోవాలని ఉన్నత న్యాయస్థానం ఇటీవల ప్రత్యేక నిబంధన తీసుకువచ్చింది. సుప్రీంకోర్టు తాజా నిర్ణయం, రాజ్యాంగ ధర్మాసనాల కారణంగా రాష్ట్ర విభజనపై దాఖలైన పిటిషన్లపై బుధవారం జరగాల్సిన విచారణ వాయిదా పడింది. సుప్రీంకోర్టు తాజా సర్క్యులర్, రాజ్యాంగ ధర్మాసనం కేసు విచారణ నేపథ్యంలో రాష్ట్ర విభజన కేసుపై తేదీ నిర్ణయించాలని ఉండవల్లి తరపు న్యాయవాది అల్లంకి రమేష్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. రాష్ట్ర విభజన సహేతుకంగా జరగలేదని దీనివల్ల రెండు రాష్ట్రాల మధ్య అనేక సమస్యలు తలెత్తుతున్నాయని ఉండవల్లి సహా పలువురు వ్యక్తులు పిటిషన్‌లో పేర్కొన్నారు. భవిష్యత్తులో రాష్ట్ర విభజన జరగాలంటే కొన్ని ప్రత్యేక పరిస్థితులు నియమ నిబంధనలు అవసరమని ఆ మేరకు కేంద్రానికి తగిన ఆదేశాలు ఇవ్వాలని పిటిషన్‌లో కోరారు. న్యాయవాది అల్లంకి రమేష్ విజ్ఞప్తితో పిటిషన్లపై విచారణను ధర్మాసనం ఏప్రిల్ 11కి వాయిదా వేసింది.

రష్యాకు చైనా దౌత్యవేత్త



మాస్కో : చైనా దౌత్యవేత్త వాంగ్ యీ తాజాగా మాస్కోలో పర్యటించారు. రష్యా, ఉక్రెయిన్ మధ్య ఉద్రికత్తలు మొదలైన తర్వాత చైనా నుంచి ఇంత అత్యున్నత స్థాయి అధికారి రష్యాను సందర్శించడం ఇదే తొలిసారి. గత నెలలోనే వాంగ్‌ను చైనా అధ్యక్షులు షీ జిన్‌పింగ్ విదేశీ వ్యవహారాల సలహాదారుగా ప్రకటించారు. దీంతో ఈ పర్యటనకు ప్రాధాన్యం లభిస్తోంది. వాంగ్ ఇప్పటికే ఎనిమిది రోజులుగా అంతర్జాతీయ పర్యటనలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే ఫ్రాన్స్, ఇటలీ, హంగేరిను సందర్శించారు. జర్మనీలోని మ్యూనిక్‌లో జరిగిన సదస్సులో కూడా పాల్గొన్నారు. ఈ పర్యటనల్లో చివరగా ఆయన మాస్కోకు వెళ్లారు. బుధవారం పుతిన్‌తో సమావేశం అయ్యారు. ఈ పర్యటనలో భాగంగా వాంగ్ రష్యా సెక్యూరిటీ కౌన్సిల్ చీఫ్ నికోలాయ్ పత్రుషేవ్‌తో మంగళవారం భేటీ అయ్యారు. ఈ విషయాన్ని చైనా విదేశాంగ శాఖ ఓ ప్రకటనలో పేర్కొంది. ఈ సందర్భంగా యుద్ధ మనస్తత్వం, కూటమి ఘర్షణలు, సైద్ధాంతిక విభేదాలను వ్యతిరేకించాలని ఇరువురు నేతలు అంగీకారానికి వచ్చినట్లు వెల్లడించింది. అలాగే అంతర్జాతీయంగా పాలన మెరుగుపడేందుకు మరిన్ని చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.

భారత్.. మీ మద్దతు కావాలి

- ఐరాసలో అనుకూల ఓటింగ్‌కు ఉక్రెయిన్ విజ్ఞప్తి

కీవ్: ఐరాసలో ప్రవేశపెట్టబోయే శాంతి ప్రణాళికకు భారత్ మద్దతు కోసం ఉక్రెయిన్ విజ్ఞప్తి చేసింది. తీర్మానానికి అనుకూలంగా ఓటు వేయాలని కోరింది. ఈ మేరకు ఉక్రెయిన్ అధ్యక్ష కార్యాలయం చీఫ్ యాండ్రీ యెర్మాక్ మన జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్‌కు ఫోన్ చేశారు. 'భారత్ సహకారం మాకు చాలా ముఖ్యం. మా శాంతి తీర్మానానికి మీరు మద్దతు ఇస్తారని విశ్వసిస్తున్నాం. అందులో ప్రాదేశిక సమగ్రత, సరిహద్దుల ఉల్లంఘన గురించి సరిగా వివరించాం. మా లక్ష్యాలు స్పష్టంగా ఉన్నాయి. రష్యా భూభాగానికి సంబంధించి ఒక్క సెంటీమీటర్‌కూడా మేం కోరుకోవడం లేదు. మా భూభాగం మాకు తిరిగి రావాలని కోరుకుంటున్నాం. మా శాంతి ప్రణాళికలో యుద్ధాన్ని ముగించడానికి ఏం చేయాలో వివరించాం. మేం కాల్పుల విరమణ వంటి తాత్కాలిక చర్యలను కోరుకోవడం లేదు. ఉక్రెయిన్ భూభాగం నుంచి రష్యా బలగాలు పూర్తిగా వెళ్లిపోవాలి' అని ఫోన్‌లో యెర్మాక్ వెల్లడించారు. అలాగే ఈ ఏడాదే యుద్ధం ముగుస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఐరాస ఛార్టర్ సూత్రాల ఆధారంగా తాము పది పాయింట్ల శాంతి ప్రణాళికను రూపొందించినట్లు ఉక్రెయిన్ వెల్లడించింది. దీనిని ఈ నెల 23న ఐరాస జనరల్ అసెంబ్లీలో ప్రవేశపెట్టనుంది.



మీకోసం

కోడిగుడ్డు ఫ్రై చేసేముందు పాన్‌లో కొద్దిగా ఉప్పు చల్లితే, గుడ్డు పాన్‌కి అంటుకోదు.

జీవన సౌరభం

లక్ష్యాన్ని చేరుకోవడానికి దారిని సొంతంగా ఏర్పరచుకోవాలి. ఇతరుల సహాయం ఆశిస్తే నిరాశే మిగులుతుంది.

'జూ' కెళదాం!



'జూ' అంటే మాకిష్టం
జంతువులంటే ఎంతో ఇష్టం!

పులులంటే మాకు భయం
సింహాలంటే మహా భయం
ఎలుగుబంట్లు ఎదురుగ నిలబడి
గుర్రు గుర్రుగా చూస్తాయి!

ఒంటెలు, ఏనుగు లుంటాయి
రైనో, హిప్పో లుంటాయి
దుప్పులు, లేళ్ళు పచ్చిక తింటూ
చెంగు చెంగున దూకుతాయి!

ఉరాంగుట్లను ఉరుముతాయి
చింపాంజీలు పళ్ళికిలిస్తాయ్
కోతులు దూకుతూ గెంతులు వేస్తూ
కిచ కిచమంటూ గోల చేస్తాయ్ !

మొసళ్ళు నోళ్ళు తెరుస్తాయి
పాములు పడగలు విప్పుతాయి
పిల్లులు, ఉడతలు, తెల్ల ఎలుకలు
భయపడి తుర్రుమంటాయి!


నెమళ్ళు నాట్యం చేస్తాయి
చిలుకలు అరుస్తూ పిలుస్తాయి
కలుగుల్లోంచి కుందేళ్ళొచ్చి
పలుకరించి పారిపోతాయ్ !

సెలవుల్లోన సరదాగా
అమ్మా, నాన్నా అంతా కలిసి
రైలు, బస్సు, ఆటోలెక్కి
నగరంలోని 'జూ' కెళ్ళొద్దాం!

- చైతన్యప్రసాద్
98496 51451

దారి చూపండి

చిన్నారులూ, బయట ఉన్న తాబేలు నీళ్ల మడుగులోకి వెళ్లాలి. మరి దారి చూపి సాయం చేయరూ!



నేను గీసిన బొమ్మ





- బి. శ్రీజ,
6వ తరగతి,
రాయిలాపూర్,
మెదక్ జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఉపాధి మార్గంగా.. వైద్య సేవే లక్ష్యంగా ...

ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టేవారు కొందరైతే.. ఆ ఆకలి తీరే మార్గం చూపేవారు మరికొంతమంది. ఆర్థికంగా కుదేలైన కుటుంబాలకు ఆదాయ వనరుగా, ఆరోగ్యం సరిగ్గా లేని వారి ముంగిట వైద్య సేవలందిస్తూ 20 ఏళ్లుగా అవిశ్రాంత కృషి చేస్తున్నారు చీరాలకు చెందిన హిమ బిందు. ఉన్నత విద్యావంతురాలైన ఈమె తనకు వచ్చిన ఉద్యోగ అవకాశాలను కూడా పక్కనబెట్టి ఓ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సమాజసేవలో భాగమయ్యారు.




హిమ బిందు

'నేను పుట్టి పెరిగిందంతా చీరాల. ఎంఎ పీజీ చేశాను. ఉద్యోగం కోసం అన్వేషించే సమయంలో జర్మన్ మహిళ మార్తా మన దేశంలో ముఖ్యంగా మన రాష్ట్రంలో స్వచ్ఛంద సేవ చేసేందుకు ముందుకువచ్చారని తెలిసింది. అప్పుడే ఆమె ఆధ్వర్యంలో నిర్వహించే షోషానా స్వచ్ఛంద సంస్థ కార్యనిర్వాహక బాధ్యతల్లో చేరాను. అప్పటికి నా వయసు 20 ఏళ్లే.. మహిళలు ఆర్థికంగా ఎదిగితేనే ఆ కుటుంబాల్లో సుఖసంతోషాలు వస్తాయి. ఒకప్పుడు ఇంటికి దీపం ఇల్లాలని, ఇల్లాలి విద్య ఇంటికి వెలుగని అనేవారు. కాని ప్రస్తుత పరిస్థితుల్లో ఆర్థికంగా మహిళలు ఎదగాలి. ఆరోగ్యంపై శ్రద్ధ పెరగాలి' అంటున్నారు బిందు.

స్వచ్ఛంద సంస్థ తరపున గుంటూరు, ప్రకాశం, కృష్ణా, బాపట్ల జిల్లాల్లో మొత్తం 26 కేంద్రాల్లో కమ్యూనిటీ డెవలపింగ్ సెంటర్ల పేరుతో 11 వైద్య, 15 కుట్టుమిషను కేంద్రాలను ఆమె నిర్వహిస్తున్నారు. కుట్టు మిషను కేంద్రాల నిర్వహణల వల్ల వందలాది మంది మహిళలు తమ జీవన ప్రమాణాలు మెరుగుపర్చుకుంటే వైద్య కేంద్రాల ఏర్పాటు వల్ల వేలాది మందికి ప్రాథమిక వైద్యం అందుతోంది.

వాంబే కాలనీలో ఉండే దీప భర్త ఆటో నడుపుతూ జీవించేవాడు. నాలుగేళ్ల క్రితం అతనికి గుండెపోటు వచ్చింది. ఏ పనీ చెయ్యకూడదని వైద్యులు చెప్పడంతో ఇంటికే పరిమితమయ్యాడు. ఈ పరిస్థితుల్లో దీప తనకు వచ్చిన కుట్టుమిషను పని చేయాలనుకుంది. అయితే మిషను కొనే ఆర్థిక స్థోమత ఆమెకు లేదు. అద్దెకు తెచ్చి కుట్టడం మొదలుపెట్టింది. 'మిషను కుట్టిన డబ్బులతోనే కుటుంబాన్ని నెట్టుకొచ్చేదాన్ని. ఆ ఆదాయంలో కుటుంబ పోషణ, పిల్లలకు చదువు, అద్దె కట్టుకోవడం చాలా కష్టంగా ఉండేది. అప్పుడు బిందు మేడమ్ కమ్యూనిటీ సెంటర్ ద్వారా మిషను ఇప్పించారు. ఇప్పుడు నాకు చాలా సంతోషంగా ఉంది' అని చెప్పింది.


భవన నిర్మాణ కార్మికురాలిగా జీవిస్తున్న మరియమ్మది మరో గాథ. భర్త వదిలేయడంతో ఇద్దరు పిల్లల బాధ్యత తీసుకుని ఒంటరితల్లిగా బతుకుతోంది. 'సిమెంటు పని చేయడం వల్ల ఒళ్లంతా పొక్కిపోయేది. సిమెంటు పడి ముఖమంతా ఇన్ఫెక్షన్ వచ్చింది. 'డాక్టరు దగ్గరికి వెళితే పని మానేయమన్నారు. కానీ అది తప్ప నాకు వేరే ఆధారం లేదు. దీంతో ఆరోగ్యం దెబ్బతింటున్నా పిల్లల కోసం పనికెళ్లేదాన్ని. అప్పుడే మా ప్రాంతంలో కమ్యూనిటీ సెంటర్ ద్వారా మిషను నేర్పుతున్నారని తెలిసింది. అక్కడికి వెళ్లి కుట్టుమిషను నేర్చుకున్నాను. కోర్సు పూర్తయ్యాక వాళ్లే నాకు మిషను ఇచ్చారు. ఇప్పుడు ఇంటిదగ్గరే మిషను కుట్టుకుంటూ నా బిడ్డలను పోషించుకుంటున్నాను.' అని మరియమ్మ వివరించింది.

కొమ్మూరుకు చెందిన ఆసిఫా. పొలం పనులు చేసుకుంటూ జీవిస్తోంది. ఆ ప్రాంతానికి దగ్గరగా నాలుగు కిలోమీటర్ల దూరంలో నందికొట్కూరులో ఏర్పాటు చేసిన కమ్యూనిటీ సెంటర్‌లో మిషను కుట్టడం నేర్చుకుంది. ఇప్పుడు మిషను కుట్టుకుంటూ ఉపాధి పొందడం చాలా ఆనందంగా ఉందని చెబుతోంది. గన్నవరం చెంచులకాలనీలో ఉండే ఫిజియోథెరపిస్ట్ జీవన బ్లెస్సీ ఆ ప్రాంతంలో ఏర్పాటు చేసిన కమ్యూనిటీ డెవలపింగ్ సొసైటీలో కుట్టు నేర్పిస్తున్నారు. 'ఇక్కడి పిల్లలూ, పెద్దలూ చెత్త ఏరుకుంటూ, సోది చెప్పుకుంటూ జీవించేవారు. పిల్లల పట్ల పెద్దలకు బాధ్యత ఉండేది కాదు. ఆ పరిస్థితి మార్చాలని నేను ఎన్నో ప్రయత్నాలు చేశాను. కమ్యూనిటీ సెంటర్‌లో ఏర్పాటైన శిక్షణలో 2021 నుండి మహిళలకు కుట్టు నేర్పించాను. ఇప్పుడు వారంతా మిషను కుట్టుకుంటూ జీవిస్తున్నారు. పిల్లల పట్ల బాధ్యతగా మెలగుతున్నారు.' అని చెబుతోంది జీవన.

గుంటూరు అప్పాపురానికి చెందిన శివకుమారిది వ్యవసాయ కుటుంబం. ఖాళీ సమయాల్లో మిషను కుట్టేవారు. 2006 నుండి కమ్యూనిటీ సెంటర్‌లో ట్రైనర్‌గా ఉన్నారు. 'ఇప్పటి వరకు 400 మందికి నేర్పించాను. వారంతా చాలా సంతోషంగా ఉన్నారు. ఒకప్పుడు ఇంటికే పరిమితమైన నా విద్య ఇప్పుడు ఇంతమందికి బతుకుదెరువుగా మారింది. వారంతా నన్ను ఎంతో గౌరవంగా చూస్తున్నారు' అని చెప్పారు. గుంటూరు జిల్లా పచ్చల తాడిపర్రు గ్రామానికి చెందిన శుభవేణి ఆ గ్రామంలో ఏర్పాటు చేసిన మెడికల్ సెంటర్‌లో 2010 నుండి నర్సుగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ హెల్త్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం వల్ల ఈ ప్రాంతం వారికి చాలా ఉపయోగంగా ఉందని ఆమె చెప్పారు. రోజుకు 30 నుండి 40 మంది వస్తారు. రాలేని వారికి శుభవేణి ఇంటికి వెళ్లి వైద్య సేవలు అందిస్తారు. ఇలా ఇంకొంతమంది మహిళలు, పురుషులు ఆరోగ్య కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్నారు.

పేదరిక కుటుంబాల బతుకులు బాగుచేసేందుకు ఆ ఇంటి మహిళలకు ఆదాయ మార్గాలను చూపించడం, మౌలిక వసతుల్లేని మారుమూల గ్రామాల్లో వైద్య సేవలందించడంలో బిందు చేస్తున్న కృషి ఎంతోమందికి ఆదర్శం.

- జ్యోతిర్మయి



కాలేయం .. జర జాగ్రత్త!

శరీరంలో కాలేయం 500 పైగా పనులు నిర్వహిస్తోంది. జీర్ణకోశ నాళం నుంచి వచ్చే రక్తాన్ని ఫిల్టర్ చేస్తుంది. తిన్న ఆహారం జీర్ణం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఆహారంలోని వ్యర్థాలను, విషతుల్యాలను.. శరీరంలో ఏర్పడే ఇన్ఫెక్షన్లు, కొవ్వులు, రక్తంలోని చక్కెర స్థాయిలను నియంత్రించడంలో కూడా కీలకంగా ఉంటుంది. ఇంతటి ముఖ్యమైన అవయవాన్ని కాపాడుకోవడం చాలా అవసరం. కానీ 90 శాతం కాలేయం దెబ్బ తినేంతవరకు వ్యాధి లక్షణాలు బయటపడవు.

- ❖ సాధారణంగా, కడుపులో అసౌకర్యం ఉంటే వికారంగా, వాంతి వచ్చేలా ఉంటుంది. ఈ సమస్య పదేపదే ఇబ్బంది పెడుతుంటే లివర్‌లో సమస్య ఉందని అర్థం.
- ❖ కాలేయంలో సమస్యలు వచ్చినప్పుడు కూడా నోటి నుంచి దుర్వాసన వస్తుంది.
- ❖ కామెర్లు, హెపటైటిస్ సమస్యలు ఉంటే.. కళ్ళు పసుపు పచ్చగా మారతాయి. నిద్ర లేవగానే కళ్ల పసుపు రంగులోకి మారితే కాలేయ సమస్య ఉన్నట్లు అనుమానించాలి.
- ❖ మూత్రం రంగులో మార్పు వస్తే కిడ్నీ, కాలేయంలో సమస్యలున్నట్లు భావించాలి.
- ❖ ముఖ్యంగా శరీరంలోని మలినాలను తొలగించే కాలేయం సరిగా పనిచేయకపోతే పైత్యరసం, లవణాలు ఎక్కువగా ఉత్పత్తి అవుతాయి. ఇవి శరీరంలో పేరుకుపోయి చివరికి మూత్ర విసర్జన, మలవిసర్జన సమయంలో బయటకు వస్తాయి.
- ❖ తగినంత నీరు తాగకపోతే మూత్రం ముదురు రంగులో ఉంటుంది. తగినంత నీరు తాగినప్పటికీ, మూత్రం ముదురు రంగులో ఉంటే, కాలేయ సమస్యను అనుమానించాలి.
- ❖ కాలేయ సమస్యలు ఉంటే, చేతులు, కాళ్ళు అకస్మాత్తుగా ఉబ్బుతాయి. కాలేయం సరిగా పనిచేయకపోయినా, శరీరంలో టాక్సిన్స్ పేరుకుపోయినా ఇలాంటి లక్షణాలు కనిపిస్తాయని వైద్యులు చెబుతున్నారు.
- ❖ కాలేయం ఆరోగ్యంగా ఉండాలంటే.. సరైన జీవనశైలిని అనుసరించాలి. ఆహారంలో ఆకు కూరలు, పండ్లు, నానబెట్టిన బాదం, ఎర్ర బియ్యం తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ప్రాసెస్ చేసిన ఆహారం, ప్యాకేజ్ ఆహారం, స్వీట్స్‌కు పూర్తిగా దూరంగా ఉండాలి.

ఫైనల్ బెర్తే లక్ష్యం

నేడు సెమీస్‌లో ఆస్ట్రేలియాతో ఢీ
ఐసిసి మహిళల టి20 ప్రపంచకప్
రాత్రి 6.30గం॥ల నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో



కేప్‌టౌన్: దక్షిణాఫ్రికా వేదికగా జరుగుతున్న ఐసిసి మహిళల టి20 ప్రపంచకప్‌లో భారత జట్టు కఠిన పరీక్షను ఎదుర్కోబోతోంది. గురువారం జరిగే తొలి సెమీస్‌లో భారత మహిళలజట్టు ఐదుసార్లు టైటిల్ విజేత, డిఫెండింగ్ ఛాంపియన్ ఆస్ట్రేలియాతో తలపడనుంది. గ్రూప్-1 నుంచి ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, గ్రూప్-2 నుంచి ఇంగ్లండ్, భారత్‌జట్లు సెమీస్‌కు చేరాయి. దీంతో గ్రూప్-2లో రెండోస్థానంలో ఉన్న భారతజట్టు గ్రూప్-1లో అగ్రస్థానంలో నిలిచిన ఆస్ట్రేలియాతో అమీతుమీ తేల్చుకోనుంది. భారత మహిళలజట్టు తొలిసారి టైటిల్‌ను చేజిక్కించుకోవాలంటే ప్రధాన అడ్డంకిగా ఉన్న ఆస్ట్రేలియాను సెమీస్‌లో ఓడిస్తేనే ఆ ఛాన్స్ దక్కనుంది. ఇక టి20 ప్రపంచకప్‌లో భారత్ సెమీస్‌కు చేరడం ఇది నాల్గోసారి మాత్రమే. 2020లో రన్నరప్‌గా నిలిచిన భారత్.. 2009, 2010లలో సెమీస్‌లో ఓటమిపాలైంది.

దక్షిణాఫ్రికాకు జాక్‌పాట్..

గ్రూప్-1 ఆఖరి లీగ్ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా జట్టు బంగ్లాదేశ్‌పై 10వికెట్ల తేడాతో గెలిచి సెమీస్‌కు చేరింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన బంగ్లా మహిళలజట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6వికెట్ల నష్టానికి 113పరుగులు చేసింది. ఛేదనలో దక్షిణాఫ్రికా మహిళలజట్టు 17.5ఓవర్లలో 117పరుగులు చేసి ఘన విజయం సాధించింది. దీంతో ఈ గ్రూప్‌లో దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్ 4పాయింట్లతో సమంగా నిలిచాయి. కానీ దక్షిణాఫ్రికా(+0.738) రన్‌రేట్‌తో 2వ స్థానంలో, న్యూజిలాండ్(+0.138) రన్‌రేట్‌తో 3వ స్థానంలో నిలిచాయి. 24న జరిగే రెండో సెమీస్‌లో దక్షిణాఫ్రికా జట్టు ఇంగ్లండ్‌తో తలపడనుంది.

ఇంగ్లండ్ అత్యధిక పరుగుల రికార్డు

ఇంగ్లండ్ జట్టు పాకిస్థాన్‌తో మ్యాచ్‌లో ప్రపంచ రికార్డు నమోదు చేసింది. టీ20 ప్రపంచకప్ చరిత్రలో అత్యధిక పరుగులు చేసిన జట్టుగా రికార్డు నెలకొల్పింది. గ్రూప్-2 ఆఖరి లీగ్ మ్యాచ్‌లో భాగంగా మంగళవారం రాత్రి తొలిగా బ్యాటింగ్ దిగిన ఇంగ్లండ్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 213పరుగులు చేసింది. నాట్ స్కీవర్ బ్రంట్(81), వ్యాట్(59) అర్ధ సెంచరీలతో మెరిసారు. ఛేదనలో పాక్ జట్టు నిర్ణీత ఓవర్లు పూర్తయ్యేసరికి 9వికెట్లు కోల్పోయి 99పరుగులు మాత్రమే చేయగల్గింది. దీంతో ఇంగ్లండ్ 114పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	నె.ర.	పా
గ్రూప్-1					
ఆస్ట్రేలియా	**4**	**4**	**0**	**+2.14**	**8**
దక్షిణాఫ్రికా	**4**	**2**	**2**	**+0.73**	**4**
న్యూజిలాండ్	4	2	2	+0.13	4
శ్రీలంక	4	2	2	-1.46	4
బంగ్లాదేశ్	4	0	4	-1.52	0
గ్రూప్-2					
ఇంగ్లండ్	**4**	**4**	**0**	**+2.86**	**8**
భారత్	**4**	**3**	**1**	**+0.25**	**6**
వెస్టిండీస్	4	2	2	-0.60	4
పాకిస్తాన్	4	1	3	-0.70	2
ఐర్లాండ్	4	0	4	-1.81	0

జడేజాకు అగ్రస్థానం


ఐసిసి టెస్ట్ ఆల్‌రౌండర్ల జాబితా విడుదల



దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్‌మండలి(ఐసిసి) తాజా ఆల్‌రౌండర్ల జాబితాలో రవీంద్ర జడేజా అగ్రస్థానానికి ఎగబాకాడు. అలాగే టాప్-5లో ఏకంగా ముగ్గురు ఆల్‌రౌండర్లు దక్కించుకున్నారు. ఐసిసి తాజా ఆల్‌రౌండర్ల ర్యాంకింగ్స్‌లో రవీంద్ర జడేజా(406 పాయింట్లు) టాప్‌లో నిలువగా.. రవిచంద్రన్ అశ్విన్(376 పాయింట్లు)2వ స్థానంలో నిలిచాడు. ఇదే క్రమంలో బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో నిలకడగా రాణిస్తున్న అక్షర్ పటేల్(283 పాయింట్లు) ఐదో స్థానానికి ఎగబాకాడు. షకిబుల్ హసన్(బంగ్లాదేశ్ 329 పాయింట్లు), బెన్ స్టోక్స్(ఇంగ్లండ్ 320 పాయింట్లు) మూడు, నాలుగు స్థానాల్లో ఉన్నారు. ఐసిసి ఆల్‌రౌండర్ ర్యాంకింగ్స్‌లో ముగ్గురు భారత క్రికెటర్లు చోటు దక్కించుకోవడం ఇదే తొలిసారి. ఐసిసి టెస్టు బౌలర్ల జాబితాలో అశ్విన్ (864 పాయింట్లు) రెండో స్థానంలో ఉండగా.. ఇంగ్లండ్ పేసర్ జేమ్స్ ఆండర్సన్ (866 పాయింట్లు)కు అగ్రస్థానానికి ఎగబాకాడు.

థోమర్‌కు స్వర్ణం

ఐఎస్‌ఎస్‌ఎఫ్ ప్రపంచకప్ షూటింగ్



కైరో: ఈజిప్ట్ వేదికగా జరుగుతున్న ఐఎస్-ఎస్ఎఫ్ ప్రపంచకప్ షూటింగ్ పోటీల్లో భారత యువ షూటర్ ఐశ్వరీ ప్రతాప్ సింగ్ థోమర్ స్వర్ణ పతకంతో సత్తా చాటాడు. బుధవారం జరిగిన 50మీ. రైఫిల్-3 పొజిషల్‌తో థోమర్ ఈ పతకాన్ని కైవసం చేసుకున్నాడు. స్వర్ణ పతక పోటీలో ఐశ్వరీ 16-6పాయింట్ల తేడాతో అలెగ్జాండర్ షిమీ(ఆస్ట్రేలియా)పై విజయం సాధించాడు. అంతకుముందు గ్రూప్ స్టేజ్‌లో 407.9పాయింట్లతో ఐశ్వరీ అగ్రస్థానంలో నిలిచి స్వర్ణ పతక పోటీకు అర్హత సాధించాడు. లీగ్‌లో 0.3 పాయింట్ల వ్యత్యాసంతో ఆండ్రూస్ కంటే ఆధిక్యతలో నిలిచాడు. 22ఏళ్ల థోమర్ రెండేళ్లుగా దక్షిణ కొరియాలోని ఛాంగ్‌వాన్‌లో శిక్షణ పొందుతున్నాడు. పురుషుల ఎయిర్ రైఫిల్‌లో రుద్రాక్ష పాటిల్, మిక్స్‌డ్ ఎయిర్ రైఫిల్‌లో భారత్‌కు స్వర్ణాలు దక్కిన సంగతి తెలిసిందే. దీంతో ఈ పోటీల్లో భారత్‌కు స్వర్ణాల సంఖ్య నాలుగుకు పెరిగింది.

పవన్, తేజ్ కొత్త సినిమా ప్రారంభం



పవన్‌కల్యాణ్, సాయి ధరమ్ తేజ్ కాంబినేషన్‌లో రాబోతున్న కొత్త సినిమా షూటింగ్ బుధవారం నుండి ప్రారంభమైంది. ప్రస్తుతం దీనికి సంబంధించిన ఫొటోలు వైరల్ అవుతున్నాయి. తమిళంలో సూపర్ హిట్ అయిన 'వినోదాయ సిద్ధం' సినిమాను తెలుగులో రీమేక్ చేస్తున్నారు. సముద్రఖని తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో పవన్ కల్యాణ్, సాయి ధరమ్ తేజ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. పవన్ కల్యాణ్‌తో దిగిన ఫొటోలను షేర్ చేసిన సాయి ధరమ్ తేజ్ 'ఈ రోజు నా జీవితంలో మర్చిపోలేనిది. నా కల నిజమైంది. నా గురువుగారు పవన్‌తో కలిసి పనిచెయ్యాలని ఎప్పటి నుంచో ఎదురుచూశాను. ఆయనతో కలిసి పనిచేస్తూ ఎన్నో విషయాలు నేర్చుకుంటాను. ఆ జ్ఞాపకాలను ఎప్పటికీ గుర్తుంచుకుంటాను' అని ట్వీట్ చేశాడు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68